అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

మంగళవారం 6-2-2018

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 4 సంచిక : 39 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | 12+16 పేజీలు వెల : 5.00



ఉక్కు కంపెనీల యాజమాన్యాలతో సమావేశమైన మంత్రులు కేటీఆర్, ఇంద్రకరణ్‌రెడ్డి


డబుల్‌ను ఆదుకోండి

ఉక్కు కంపెనీలను కోరిన మంత్రులు కేటీఆర్, ఇంద్రకరణ్‌రెడ్డి

చర్చించి చెబుతామన్న యాజమాన్యాలు

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డబుల్ బెడ్ రూం ఇండ్ల పథకానికి సామాజిక బాధ్యతగా ఉక్కు కంపెనీ యజమానులు సహకారం అందించాలని గృహ నిర్మాణశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ కోరారు. సోమవారం సచివాలయంలో ఉక్కు కంపెనీల యాజమాన్యాలతో మంత్రులు సమావేశమయ్యారు. డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణానికి సిమెంట్ కంపెనీలు మార్కెట్‌లో హెచ్చుతగ్గులతో సంబంధం లేకుండా బస్తా సిమెంట్‌ను రూ.230కే విక్రయిస్తున్నాయనీ, ఉక్కు కంపెనీ యాజమాన్యాలు కూడా తక్కువ రేట్‌కు ఉక్కును విక్రయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మొత్తం 2.60 లక్షల డబుల్ ...9లో



జమిలి ఎన్నికల నిర్వహణ

అప్రజాస్వామికం

- ప్రజలపై భారాలు మోపుతున్న బీజేపీ ప్రభుత్వం
- కేంద్ర బడ్జెట్‌లో సామాన్యులకు ఒరిగేదేం లేదు
- జాతీయస్థాయిలో లెఫ్ట్ డెమోక్రటిక్ అలయెన్స్ ఏర్పాటే లక్ష్యం: ప్రకాశ్‌కరత్

నర్రా రాఘవరెడ్డినగర్ (నల్లగొండ) నుంచి బొల్లె జగదీశ్వర్



నల్లగొండలో జరుగుతున్న రాష్ట్ర ద్వితీయ మహాసభలో భాగంగా ఫొటోఎగ్జిబిషన్‌లో సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్‌కరత్

దేశవ్యాప్తంగా పార్లమెంటు, అసెంబ్లీలకు జమిలి ఎన్నికలు నిర్వహించాలనుకోవడం అప్రజాస్వామికమని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్‌కరత్ విమర్శించారు. ఇది తప్పుడు నిర్ణయమని అన్నారు. నల్లగొండ పట్టణంలో జరుగుతున్న సీపీఐ(ఎం) రాష్ట్ర ద్వితీయ మహాసభల సందర్భంగా సోమవారం ఫొటో ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. ఫొటోలన్నింటినీ ఆయన తిలకించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ పార్లమెంటు, అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం రాజ్యాంగ విరుద్ధమని చెప్పారు. కొన్ని అసెంబ్లీలకు పదవీ కాలం ఉన్నా మధ్యలోనే రద్దు చేసి ఎన్నికలకు వెళ్లడం సరైంది కాదన్నారు. ఏదైనా కారణాలతో అసెంబ్లీ రద్దయితే వచ్చే ఎన్నికల వరకు రాష్ట్రపతి పాలన వస్తుందని చెప్పారు. ఐదేండ్లు పూర్తయ్యే వరకు ఏమీ చేయడానికి అవకాశముండబోదని అన్నారు. అధ్యక్ష పాలన విధించడం అప్రజాస్వామికమని చెప్పారు. సహజంగానే ఐదేండ్లకోసారి ఎన్నికలు జరగాలని అన్నారు. లోక్‌సభ, అసెంబ్లీలు ఐదేండ్ల పదవీకాలం ఎప్పుడు పూర్తయితే అప్పుడు ఎన్నికలు రావాలన్నారు.

ఈ మహాసభల్లో ఎన్నికల వ్యూహాల గురించి మాట్లాడ్డం లేదని చెప్పారు. ఎన్నికల సమయంలో ఎత్తుగడలు అనుసరిస్తామని అన్నారు. జాతీయ స్థాయిలోనూ లెఫ్ట్ డెమోక్రటిక అలయెన్స్ ఏర్పాటు చేయడమే తమ లక్ష్యమన్నారు. అధికారంలో ఉన్న బీజేపీని ఓడించడంపైనే దృష్టి కేంద్రీకరిస్తామని చెప్పారు. తెలంగాణలో ప్రత్యామ్నాయ రాజకీయాలకు బీఎల్ఎఫ్ ఆవిర్భావమే నిదర్శనమని అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో సామాన్యులకు ఒరిగిందేం లేదని విమర్శించారు. పెద్దపెద్ద ప్రకటనలు చేసి నిధులు కేటాయించలేదని ఎద్దేవా చేశారు. పెట్టుబడికి అదనంగా 50 శాతం కలిపి గిట్టుబాటు ధర కల్పించాలని స్వామినాథన్ కమిషన్ సిఫార్సు చేస్తే కేంద్రం దాన్ని విస్మరించిందని చెప్పారు. దేశంలోని ప్రజలకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తామని చెప్పి బడ్జెట్‌లో మాత్రం రూ.2 వేల కోట్లు కేటాయించిందని ...9లో



ఇద్దరూ మేజర్లయితే..

- పెండ్లి విషయంలో జోక్యం చేసుకునే హక్కు ఎవరికీ లేదు: సుప్రీంకోర్టు

వివరాలు 2లో

నిరుద్యోగిగా ఉండటం కన్నా..

పకోడీలు అమ్ముకోండి

- బడా పారిశ్రామికవేత్తలుగా ఎదుగుతారని వ్యాఖ్య: రాజ్యసభ మొదటి ప్రసంగంలో అమిత్‌షా



నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

'నిరుద్యోగిగా ఉండటం కన్నా పకోడీలు అమ్ముకోవడం ఉత్తమం' అని బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా చెప్పారు. పకోడీలు అమ్మి దేశంలో బడా పారిశ్రామికవేత్తలుగా ఎదుగొచ్చని సెలవిచ్చారు. 'ఒక చాయ్ అమ్మే వ్యక్తి కొడుకు ప్రధానమంత్రి అయి ఈ సభలో కూర్చున్నప్పుడు(నరేంద్రమోడీ) పకోడీలు అమ్మేవారి కొడుకులు బడా పారిశ్రామికవేత్తలు కావొచ్చు' అని అన్నారు. పైగా పకోడీలు అమ్ముకోవడం కూడా ఉపాధి కల్పన కిందకే వస్తుందని చెప్పారు. దేశంలో నిరుద్యోగ సమస్య ఉందని అంగీకరిస్తానన్న అమిత్‌షా.. అందుకు సమాధానం కాంగ్రెస్ పార్టీ చెప్పాలని అన్నారు. ఈ దేశాన్ని పాలించే అవకాశం బీజేపీకి ఎనిమిది సంవత్సరాలు లభించిందని, ఈ సమస్య తమ హయాంలో ఉత్పన్నం కాలేదని చెప్పారు. అయితే నిరుద్యోగ సమస్యకు స్కిల్ ఇండియా, స్టార్టప్-స్టాండప్ ఇండియా, ముద్రా బ్యాంకు సమాధానంగా తీసుకొచ్చామని చెప్పుకొచ్చారు. రాష్ట్రపతి ధన్యవాద తీర్మానంపై రాజ్యసభలో సోమవారం చర్చ జరిగింది. ఈ చర్చను బీజేపీ అధ్యక్షుడు, ఎంపీ అమిత్ అనిల్ చంద్ర షా(అమిత్‌షా) తన మొదటి ప్రసంగంతో ...9లో

అందుబాటులో లేని అత్యవసర మందులు

2లో

బహుజన తెలంగాణ నిర్మిద్దాం

- బూర్జువా పార్టీలకు ప్రత్యామ్నాయమే బీఎల్ఎఫ్
- అధికారంలోకి వస్తేనే అభివృద్ధి సాధ్యం : ప్రజలకు సీపీఐ(ఎం) రెండో మహాసభ పిలుపు

బీఎల్ఎఫ్‌ను బలపరుద్దాం

నవతెలంగాణ- ప్రత్యేక ప్రతినిధి

బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్)ను బలపరుద్దామని, బహుజన తెలంగాణ నిర్మిద్దామని సీపీఐ(ఎం) రెండో మహాసభ పిలు పునిచ్చింది. టీఆర్ఎస్, కాంగ్రెస్, టీడీపీ, బీజేపీ వంటి బూర్జువా పార్టీలకు ప్రత్యామ్నా యమే బీఎల్ఎఫ్ అని అభివర్ణించింది. నల్ల గొండ పట్టణంలో జరుగుతున్న సీపీఐ(ఎం) రాష్ట్ర ద్వితీయ మహాసభల సందర్భంగా సామాజిక న్యాయం-రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధన కోసం బహుజన లెఫ్ట్ ఫ్రంట్‌ను బలపర్చాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య ప్రవేశపెట్టిన తీర్మా నాన్ని చెరుపల్లి సీతారాములు బలపరిచారు. మహాసభ ఆ తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమో దించింది. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర కార్యదర్శివర్గ ...9లో



మాట్లాడుతున్న చెరుపల్లి సీతారాములు

క్షణికావేశంలో...

భార్య, ఇద్దరు బిడ్డలను హత్య చేసిన భర్త

హైదరాబాద్ మీర్‌పేట్‌లో దారుణం

నవతెలంగాణ - బడంగ్‌పేట

హైదరాబాద్ మీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం జరిగింది. భార్య, ఇద్దరు బిడ్డలను అతి కిరాతకంగా హత్య చేశాడో భర్త. ఈ ఘటన సోమవారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా కుల్కచెర్ల గ్రామానికి చెందిన హరిందర్ గౌడ్‌కు మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన జ్యోతి(35)తో ఎనిమిదేండ్ల కిందట వివాహమైంది. వీరికి కొడుకు అభిజిత్‌పార్థు(6), కూతురు సహస్ర(4) ఉన్నారు. హరిందర్‌గౌడ్ హైదరాబాద్ లోని ఓ ప్రయివేటు డెంటల్ క్లినిక్‌లో టెక్నీషి యన్‌గా పని చేస్తున్నాడు. హరిందర్‌గౌడ్ నాలుగు నెలలుగా పనికి వెళ్లకుండా ఇంటి వద్దే ఉంటు న్నాడు. భర్త పనికి వెళ్లకపోవడంతో భార్య జ్యోతి భర్తతో తరచూ గొడవ ...9లో



హత్యకు గురైన జ్యోతి ఇద్దరు పిల్లలు (ఫైల్)

విద్యార్థినులపై లైంగిక వేధింపులు

- ఉపాధ్యాయుని నిర్వాకం
- దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన తల్లిదండ్రులు
- సంగారెడ్డి జిల్లాలో ఘటన



3లో

అక్రమ మైనింగ్‌లో బీజేపీ పాలిత రాష్ట్రాలదే పైచేయి

స్వల్ప కేసుల్లోనే ఎఫ్ఐఆర్

- స్వయంగా అంగీకరించిన నరేంద్రమోడీ సర్కార్

వివరాలు 2లో



దారి తప్పిన మద్దతు

పొలం దగ్గరే కొని... రైతుల పేర మార్కెట్లో అమ్ముకుంటున్న దళారులు

- క్వింటాపై రూ.1500 నుంచి 2 వేలు లాభం పొందుతున్న వైనం
- 750 మంది రైతులు 38, 734 క్వింటాళ్లు అమ్మినట్టు చూపిన వైనం
- మహబూబ్‌నగర్‌లో పట్టుబడ్డ 100 బస్తాల కందులు

అక్రమాలకు అడ్డాలుగా పీఏసీఎస్ కేంద్రాలు



వివరాలు 3లో



కమీషన్ ఏజెంట్ దుకాణంలో నిలువ చేసిన కందులు

రాత్రికి రాత్రే కొనుగోలు


కేంద్రాల ఎత్తివేత

ఆందోళనకు దిగిన కంది రైతులు..

రోడ్డుపై బైటాయింపు

నవతెలంగాణ-పెద్దేముల్/కోట్‌పల్లి

వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రాలను రాత్రికి రాత్రే ఎత్తేశారు. దాంతో రైతులు ఆందోళనకు దిగారు. బషీరాబాద్, యాలాల, కోట్‌పల్లి, పెద్దేముల్ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఎత్తేశారు. మండల కేంద్రంలో రైతులు కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం ఆందోళనకు దిగారు. రోడ్డుపై బైటాయించి రాస్తారోకో చేపట్టారు. రైతుల దగ్గర ఉన్న కందులను పూర్తిగా కొనుగోలు చేయకుండా మధ్యంతరంగా మూసేస్తే ఎక్కడికెళ్లాలని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రం వారు ఇచ్చిన తేదీల ప్రకారమే కందులు ...9లో



ఆందోళన చేపడుతున్న కాంగ్రెస్ నేతలు

ముస్లిం పురుషులను వేటాడండి

- హిందుత్వ ఫేస్‌బుక్ పేజీలో
- 100కు పైగా మతాంతర జంటల పేర్లు

న్యూఢిల్లీ : హిందుత్వవాదులు మరోసారి రెచ్చిపోయారు. సామాజిక మీడియా వేదికగా ముస్లిం పురుషుల హత్యాకాండకు పిలుపునిచ్చారు. హిందుత్వ గ్రూప్ ఫేస్‌బుక్ పేజీలో 100కు పైగా మతాంతర వివాహం చేసుకున్న జంటలను పేర్లు ప్రకటించారు. ఈ జంటల్లో పురుషులను వేటాడాలని పిలుపునిచ్చారు. 'ఈ జాబితాలోని బాలికలంతా లవ్ జీహాద్ బాధితులు. జంటల్లోని పురుషులను వేటాడాలని హిందూ సింహాలకు పిలుపునిస్తున్నాం' అని ఫేస్‌బుక్ పోస్టులో పేర్కొన్నారు. ఫేస్‌బుక్‌లో ప్రకటించిన జంటల్లోని బాలికలంతా హిందువులు కాగా, పురుషులంతా ముస్లింలు. అలాగే ఈ ఫేస్‌బుక్ పేజీల్లో పోస్టులన్నీ కూడా ముస్లింలను దెయ్యాలుగా పేర్కొంటూ, హిందువులకు రక్షణకావాలని కోరుతున్నట్టుగా ఉన్నాయి. అలాగే ఈ పేజీలో ఇటీవల పోస్టు చేసిన వీడియోలో ఒక తండ్రి తన కుమార్తెకు తుపాకీ ఎలా ఉపయోగించాలో నేర్పుతున్నట్టుగా ఉంది.మరొక వీడియోలో ఒక వ్యక్తిని దారుణంగా హింసిస్తున్న దృశ్యాలు ఉన్నాయి. 'ఆవును హత్య చేసిన వ్యక్తి కూడా ఇలాగే మరణిస్తాడు' అనే క్యాప్షన్ ఈ వీడియోకు ఉంది.

మసీదు ద్వారానికి నిప్పు పెట్టిన దుండగులు

లక్నో : ఉత్తరప్రదేశ్‌లోని కస్గాంజ్ పట్టణంలో ఒక మసీదు ప్రవేశ ద్వారానికి గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టారు. సోమవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఈ సంఘటన జరిగిందని, సమయానికి సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక దళాలు మంటలను ఆర్పివేశాయని కస్గాంజ్ ఎస్‌పి పియూష్ శ్రీవాత్సవ తెలిపారు. పరిస్థితి ప్రస్తుతం అదుపులోనే వుందని తెలిపారు. కాగా ఇదే పట్టణంలో రిపబ్లిక్ డే రోజున జరిగిన మత ఘర్షణల్లో ఒక వ్యక్తి మృతి చెందిన సంగతి తెలిసిందే.

2014లో 'ప్రామిస్' టూత్ పేస్టు అమ్మారు

నవ్వులు పూయించడంలో అది విఫలమైంది

- మోడీపై నటుడు ప్రకాశ్‌రాజ్ సెటైర్లు



బెంగళూరు : ప్రధాని మోడీ నరేంద్రమోడీ బెంగళూరు పర్యటనలో చేసిన వాగ్దానాల నేపథ్యంలో ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. '2014లో ప్రామిస్ టూత్‌పేస్ట్' అమ్మారు. నిరుద్యోగులు, సంక్షోభంలో కూరుకుపోయిన రైతుల ముఖాల్లో నవ్వులు పూయించడంలో అది విఫలమైందని ప్రకాశ్ రాజ్ ట్వీట్ చేశారు. ప్రధాని మోడీ బెంగళూరు సభలో చేసిన వాగ్దానాలు ఆ నవ్వులను తీసుకొస్తాయని మీరు నమ్ముతున్నారా..? అని ప్రజలను ప్రశ్నించారు. సిద్ధరామయ్య నేత త్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్ర నిధులను దారిమళ్లించి అవినీతికి పాల్పడుతున్నదనీ, తమ పార్టీ అధికారంలోకి వస్తే.. 'సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్' లక్ష్యంగా బీజేపీ రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తుందనీ బెంగళూరులో ఆదివారం జరిగిన సభలో మోడీ వాగ్దానం చేశారు. 'జస్ట్ ఆస్కింగ్ క్యాంపెయిన్' పేరుతో ప్రకాశ్ రాజ్ ప్రధాని, బీజేపీపై విమర్శలు ఎక్కు పెడుతున్న విషయం తెలిసిందే. 'నేను హిందూ వ్యతిరేక కాదు, మోడీ వ్యతిరేకిని, అమిత్ షా వ్యతిరేకిని' అని ప్రకాశ్ రాజ్ ఇటీవల ట్వీట్‌లు చేశారు.

ఇద్దరూ మేజర్లయితే..

- పెండ్లి విషయంలో జోక్యం చేసుకునే హక్కు ఎవరికీ లేదు
- కాప్ పంచాయితీలపై సుప్రీం ఆగ్రహం



న్యూఢిల్లీ : ఇద్దరు మేయర్లు పెండ్లి చేసుకోవాలని నిర్ణయిం చుకుంటే అందులో జోక్యం చేసుకునే హక్కు ఎవరికీ లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కాప్ పంచాయత్‌ల పేరిట చట్టాలను తమ చేతుల్లోకి తీసుకుని.. మైనర్ల వివాహాలను అడ్డుకునే హక్కు వారికి లేదని తెలిపింది. 'తల్లిదండ్రులు గానీ, రాష్ట్రంగానీ, పంచాయితీలుగానీ, ఎవరైనా సరే.. ఇద్దరు వయోజనులు వివాహం చేసుకుంటే అందులో కల్పించుకునే హక్కు ఎవరికీ ఉండదు' అని జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. పరువు హత్యలపైన, కాప్ పంచాయితీ ఆదేశాల చట్టపరమైన ప్రామాణికతను ప్రశ్నిస్తూ శక్తివాహిని అనే స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం పై వ్యాఖ్యలు చేసింది. పరువు హత్యలు, ఇతర నేరాలను అరికట్టేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు జారీచేయాలని కోరుతూ 2010లో ఈ పిటిషన్ దాఖలు చేసిం ది. పరువుహత్యల నేపథ్యంలో ఆ యువ దంపతుల రక్షణకు సంబంధించి 'సమర్థవంతమైన సూచనలు' చేస్తూ అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. 'కాప్', మరెవరినైనా చట్ట సంరక్షకులుగా ఎవరు నియమించారు?. ఒక వివాహం చట్టబద్ధమైనదో, కాదో నిర్ణయిం చాల్సింది కోర్టులే. కాప్ పంచాయితీలు కాదు' అని మిశ్రా అన్నారు. పురా తనమైన సంప్రదాయాలు, సమాజంలోని చైతన్యాన్ని పరిరక్షించేం దుకు కట్టుబడి ఉన్నామని కాప్ పంచాయితీల తరపున హాజరైన న్యాయ వాది కోర్టుకు తెలిపారు. 'ఆ వివాహం చెల్లుబాటు అవునో కాదు నిర్ణయిం చడానికి మీరెవరు? ఆ పని కోర్టులది' అంటూ ధర్మాసనం వ్యాఖ్యానించింది.

హజ్‌యాత్రికులకు స్వతంత్ర సంఘం

- ఢిల్లీ హైకోర్టులో దాఖలైన పిటిషన్

న్యూఢిల్లీ : కేంద్రప్రభుత్వ నియంత్రణలో ఉన్న హజ్ కమిటీని రద్దు చేసి, దాని స్థానంలో స్వతంత్ర సంఘాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. జెడ్డా వెళ్లేందుకుగానూ హజ్ యాత్రికులకు అందించే సబ్సిడీని రద్దు చేస్తూ కేంద్రం ఇటీవల నిర్ణయం తీసుకోవడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ న్యాయవాది షాహిద్ అలీ ఈ పిటిషన్ దాఖలు చేశారు. హజ్ యాత్రికులకు విమాన చార్జీల్లో సబ్సిడీ విధానాన్ని 1959లో ప్రవేశపెట్టారు. హజ్ యాత్రికుల విషయంలో కేంద్రం నియంత్రణ అవసరం లేదని, హజ్ కమిటీ యాక్ట్-2002ను కూడా రద్దు చేయాలని తన పిటిషన్‌లో పేర్కొన్నారు. హజ్ కమిటీని రద్దు చేయకపోతే.. దేశంలోని ముస్లిములకు ఇబ్బందులు తప్పవన్నారు.

తాజ్‌మహల్‌పై మరోసారి...

బీజేపీ ఎంపీ వివాదాస్పద వ్యాఖ్యలు

న్యూఢిల్లీ : అద్భుత కట్టడం తాజ్‌మహల్‌పై బీజేపీ ఎంపీ వినయ్ కటియార్ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. తాజ్‌మహల్‌ను తాజ్ మందిర్‌గా మారుస్తామని చెప్పారు. తాజ్‌మహల్ స్థానంలో శివాలయం ఉందనీ, దాన్ని హిందువులే నిర్మించారని కటియార్ గతంలో చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారితీసిన విషయం తెలిసిందే. ఔరంగజేబు, తేజ్ మందిర్‌ను శ్మశానంగా మార్చారని అన్నారు. తాజ్ మహోత్సవ్ జరపడం మంచి విషయమని ఆయన అన్నారు. అది హిందూ ఆలయమనడానికి కూడా ఎన్నో ఆధారాలున్నాయని కటియార్ చెప్పారు. ఈ నెల 18 నుంచి 10 రోజులపాటు ఆగ్రాలో తాజ్ మహోత్సవ్ జరగనున్న నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ మహోత్సవానికి ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, గవర్నర్ రామ్‌నాయక్‌లు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు.

మోడీకి సూటు బూటుపైనే మక్కువెక్కువ

- కాంగ్రెస్ నేత రణదీప్ సూర్జేవాలా

న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోడీకి జనం సమస్యలను పరిష్కరించడం కంటే సూటు బూటుపైనే ఎక్కువ మక్కువని కాంగ్రెస్ అధికార ప్రతినిధి రణదీప్ సూర్జేవాలా ఎద్దేవా చేశారు. ఢిల్లీలో సోమవారం ఆయన మాట్లాడుతూ మోడీకి ప్రత్యామ్నాయం కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీనే అని, ఆయనను ప్రధానిగా చూడాలని దేశం కోరుకుంటున్నదని తెలిపారు. దేశంలో నేడు మోడీ మోడల్, కాంగ్రెస్ మోడల్ ఉన్నాయన్నారు. మోడీ రోజుకు ఆరుసార్లు దుస్తులు మారుస్తారని చెప్పారు. రాష్ట్రాల వ్యవహారాల కంటే ఆయన వస్త్రధారణ(సూటు బూటు)పైనే ఎక్కువ శ్రద్ధ పెడుతారని విమర్శించారు.

నేటి నుంచి మొఘల్ గార్డెన్స్ సందర్శనకు అనుమతి

న్యూఢిల్లీ: దేశ రాజధానిలోని రాష్ట్రపతి భవన్ ఆవరణలో ఉన్న మొఘల్ గార్డెన్స్‌ను సందర్శకుల కోసం మంగళవారం నుంచి అందుబాటులో ఉంచనున్నారు. మార్చి 9 వరకు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు గార్డెన్స్‌ను సందర్శించేందుకు ప్రజలకు అనుమతి కల్పిస్తారు. 'ఉద్యానోత్సవ్' కార్యక్రమంలో భాగంగా భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ దీనిని ప్రారంభించనున్నారు. మొఘల్ గార్డెన్స్‌కు ప్రత్యేక ప్రాముఖ్యత ఉన్నది. 1917లో సర్ ఎడ్విన్ లూటీన్స్ దీనిని 15 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేశారు. గార్డెన్‌లో అనేక రకాల పూల మొక్కలు, పొదలు, తీగలు సందర్శకులకు గొప్ప అనుభూతిని ఇస్తాయి. పర్యాటకులకు మరింత ఆహ్లాదం కలిగించేందుకుగానూ ఈసారి వివిధ రంగుల్లో ఉన్న 10 వేల పూల మొక్కలను నెదర్లాండ్ నుంచి ప్రత్యేకంగా తెప్పించి గార్డెన్‌లో నాటారు. సందర్శన చివరిరోజు(మార్చి 9) రైతులు, వికలాంగులు, డిఫెన్స్/పారామిలిటరీ బల గాలు, ఢిల్లీ పోలీసులకు మాత్రమే అనుమతి కల్పిస్తారు. నిర్వహణ కోసం ప్రతి సోమవారం, మార్చి 2న(హోలీ పండుగ సందర్భంగా) గార్డెన్స్‌ను మూసివేయను న్నట్టు రాష్ట్రపతి భవన్ వర్గాలు వెల్లడించాయి.



'రైతు సంక్షేమం' నినాదాల్లోనే..

వాస్తవాలకు దూరంగా రాష్ట్రపతి ప్రసంగం

- కేంద్ర ప్రభుత్వంపై అందరూ అసంతృప్తి
- ఉద్యోగకల్పనలో మోడీ సర్కారు పూర్తిగా విఫలం
- ఎంఏ, బీఏ అభ్యర్థులు రిక్షాలు తొక్కే పరిస్థితి
- రాజ్యసభ చర్చలో సీపీఐ(ఎం) ఎంపీ టికె రంగరాజన్

నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

ఉభయసభలనుద్దేశించి రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్ చేసిన ప్రసంగం దేశంలోని వాస్తవ పరిస్థితులకు దూరంగా ఉందని సీపీఐ(ఎం) సీనియర్ ఎంపీ టీ రంగరాజన్ విమర్శించారు. నిరుద్యోగం, రైతుల ఆత్మహత్యలు, మహిళా భద్రత, ఆకలి చావులు తదితర అంశాలను ప్రసంగంలో విస్మరించారని అన్నారు. రైతు సంక్షేమంపై ఎన్డీయే సర్కారుతో సహా పాలకవర్గాలన్నీ నినాదాలకే పరిమితమయ్యాయని విమర్శించారు. కేంద్రంలో నాలుగు సంవత్సరాలుగా అధికారంలో ఉన్నప్పటికీ.. రైతుల ఆదాయం రెండింతలు చేయలేదు. పైగా 2012 వరకు ఆదాయం రెండింతలు చేస్తామని బడ్జెట్‌లో పేర్కొన్నారు. రైతులు మరో నాలుగేండ్లు ఆగాలా? అప్పటి వరకు మరిన్ని ఆత్మహత్యలు జరుగుతాయి. వీటికి పరిష్కారం ఏమిటి?' అని ప్రశ్నించారు. ఎన్డీయే సర్కారు ఉపాధి కల్పనలో ఘోరంగా విఫలమైందని, ఫలితంగా ఎంఏ, బీఏ అభ్యర్థులు రిక్షాలు తొక్కే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

రాష్ట్రపతి ప్రసంగ ధన్యవాద తీర్మానంపై రాజ్యసభలో సోమవారం చర్చ జరిగింది. ఈ చర్చలో సీపీఐ(ఎం) నుంచి రంగరాజన్ పాల్గొన్నారు. 'కేంద్రంలోని ఎన్డీయే సర్కారుపై ఏ ఒక్క వర్గమూ సంతృప్తిగా లేదు. చివరికి తన భాగస్వామ్యపక్షాలైన శివసేన, టీడీపీ సైతం అసంతృప్తితో ఉన్నాయి' అని ఎద్దేవా చేశారు. 'రాష్ట్రపతి ప్రసంగంలో, బడ్జెట్‌లో రైతుల ఆదాయం రెండింతల చేస్తామని చెప్పారు. అమిత్‌షా సైతం తన ప్రసంగంలో రైతులపై తామొక్కరమో ఆందోళనగా ఉన్నట్టు చెప్పారు. అమిత్‌షా ఒక్కరే కాదు గతంలో లాల్‌బహుదూర్ శాస్త్రి సైతం జై జవాన్, జై కిసాన్ అని నినాదం ఇచ్చారు. ఇలా దేశంలోని పాలకవర్గాలన్నీ రైతుల సంక్షేమాన్ని నినాదాలకే పరిమితం చేశాయి' అని విమర్శించారు.

2022 వరకు రైతుల ఆదాయం రెండింతలు చేస్తామని ప్రభుత్వం పేర్కొన్నదని, కానీ ఇప్పటికే వేల సంఖ్యలో జరుగుతున్న రైత ఆత్మహత్యలను ఎలా నిలువరిస్తారో సమాధానం చెప్పలేదని అన్నారు. రైతుల ఆదాయానికి మరో నాలుగేండ్లు ఆగాలి అంటున్నారు. అప్పటి వరకు రైతు ఆత్మహత్యలు మరిన్ని చోటుచేసుకుంటాయి. దీనికి పరిష్కారం ఏమిటి?' అని ప్రశ్నించారు. ఇక నిరుద్యోగంపై మాట్లాడుతూ.. 2015-16 విడుదలైన నివేదిక ప్రకారం 46.6 శాతం



జీవిస్తున్నారని అన్నారు. ప్రధాని మోడీ, అమిత్‌షా చెప్పినట్టు పకోడీలు అమ్ముకోవడం ఉపాధి కల్పించినట్టు కాదని స్పష్టం చేశారు. అయితే స్వయం ఉపాధిపై ఆధారపడి జీవిస్తున్న వారి వార్షికాదాయం యేడాదికి కేవలం రూ.60 వేలు మాత్రమేనని, ఈ లెక్కన ప్రతినెలా ఐదు వేల రూపాయలని, రోజువారిగా పరిశీలిస్తే రెండు వందల రూపాయల లోపేనని చెప్పారు. పెరుగుతున్న ధరలతో రోజూ రెండువందలతో కుటుంబాన్ని ఎలా పోషించుకుంటారని ప్రశ్నించారు.

దేశంలో ఉపాధి కల్పన పూర్తిగా అటకెక్కిందని అన్నారు. ఫలితంగా ఎంఏ, బీఏ చేసినవారు రిక్షాలు తొక్కుతున్నారని అన్నారు. నయాసరళీకరణ ఆర్థిక విధానాల వల్ల రెగ్యులర్ ఉపాధి తగ్గిందని, టీచర్లను సైతం కాంట్రాక్టు విధానంలో నియమిస్తున్నారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నోట్లరద్దు నిర్ణయం చిన్న, మధ్యతరహా పరిశ్రమలపై ప్రతికూల ప్రభావం చూపిందని అన్నారు. 'వసుధైక కుటుంబం' అంటూ రాష్ట్రపతి తన ప్రసంగం ప్రారంభించారని గుర్తు చేసిన రంగరాజన్... రోహింగ్యా శరణార్థుల విషయంలో మాత్రం భారత ప్రభుత్వం మౌనం వహించిందని విమర్శించారు. బీజేపీ మతోన్మాద సిద్ధాంతం వల్లే రోహింగ్యాల అంశంలో కేంద్రం జోక్యం చేసుకోలేదని చెప్పారు. దేశంలో అసమానతలు పెరిగిపోయాయని ఎంపీ రంగరాజన్ ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలోని ఒక్క శాతం జనాభా 73 శాతం సంపద కల్గిఉండగా..మిగితా 99 శాతం ప్రజానీకం వద్ద కేవలం 29 శాతం ఆదాయముందని చెప్పారు. వ్యాపార సులభతరంలో భారతదేశ స్థానం మెరుగుపడుతుందని చెప్పిన రాష్ట్రపతి.. పిల్లలపౌష్టికాహారలోపం, ప్రపంచ ఆకలి నివేదికల్లో భారతదేశ స్థితి గురించి ప్రస్తావించలేదని అన్నారు.

ఈ సందర్భంగా రంగరాజన్ ప్రాతినిధ్యం వహిస్తున్న తమిళనాడుపై కేంద్రం చూపుతున్న వివక్షా వైఖరిని సభలో ఎండగట్టారు. జల్లికట్టు విషయంలో కేంద్రం రాష్ట్ర ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. ఇక కావేరి విషయంలో 'కావేరి నిర్వహణ బోర్డు' ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించినప్పటికీ ఇప్పటి వరకు అడుగుముందుకు పడలేదని అన్నారు. కర్నాటక రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆ రాష్ట్రంలో ప్రచారం చేస్తున్న కేంద్రమంత్రులు సైతం తమిళనాడుకు నీరు ఇవ్వబోం అంటూ విద్వేష ప్రసంగాలు చేస్తున్నారని అన్నారు. 'తమిళనాడు భారతదేశంలో అంతర్భాగం అవునా కాదా?' అనే విషయంపై కేంద్ర పెద్దలు సమాధానం చెప్పాలన్నారు.

విజయం ఖాయం... మాణిక్ సర్కార్

బీజేపీ బూటకపు ప్రచారాలు త్రిపుర ఓటర్ పట్టించుకోరు ...



త్రిపురలోని ధర్మానగర్ ఎన్నికల ప్రచార సభలో ప్రసంగిస్తున్న మాణిక్ సర్కార్

అగర్తల త్రిపురలో పాగా వేసేందుకు బీజేపీ సంకుచిత రాజకీయాలు చేస్తోందని, డబ్బు మూటలతో గెలుపు దక్కించుకోవాలని ప్రయత్నిస్తోందని త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ ఆరోపించారు. ఫిబ్రవరి 18న జరిగే రాష్ట్ర శాసన సభ ఎన్నికల ప్రచారాలను బీజేపీ తరఫున కేంద్ర హోమ్ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ రెండు రోజులుగా ఉధృతంగా సాగిస్తున్నారు. ఈ సందర్భంలో ఆయన అవాస్తవాలు చెప్పి త్రిపుర ఓటర్లను ప్రభావితం చేస్తున్నట్టు మాణిక్ సర్కార్ ఒక పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆరోపించారు. బీజేపీ ఎన్ని ఎత్తుగడలు వేసినా వామపక్ష ప్రభుత్వం గెలవడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తంచేసారు. రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజల్లో ఎలాంటి అసంతృప్తి లేదని ఆయన గుర్తుచేసారు. అందువల్ల తమ గెలుపు ఖాయమన్నారు. బీజేపీ సవాలు గురించి ప్రశ్నించగా – మా ఓటు బ్యాంకు బలంగా ఉంది, ఇంతవరకు కాంగ్రెస్‌కు ఉన్న స్థానాన్ని మాత్రమే బీజేపీ దక్కించుకోగలుగుతోంది, అందుకు కాంగ్రెస్‌లోని అవకాశవాదులే కారణం. వారు గోడ దూకేందుకు, ఆ రకంగా తమ పార్టీకి నష్టం కలిగించేందుకు సిద్ధపడుతున్నారు – అని సర్కార్ విశ్లేషించారు. ఇక తమ పార్టీకి, ఆర్‌ఎస్‌ఎస్-బీజేపీకి మధ్య ఉన్న పోటీ వ్యక్తిగత పోరు కాదని, రెండు పార్టీల సిద్ధాంతాల మధ్య పోరాటమని ఆయన స్పష్టం చేశారు. కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ ప్రచారాలపై స్పందిస్తూ ... అగర్తలలో అవాస్తవాలు వల్లె వేశారని ఆరోపించారు. నాయకులు అబద్ధాలు చెప్పకూడదని హితవు చెబుతూ, అవినీతి పాలన అంటున్నారు. ... మా అకౌంట్లను తనిఖీ చేస్తున్నారు ... అయినా భయం లేదు. ఎందుకంటే మా అకౌంట్లు పారదర్శకం ...నిజాయితీకి ప్రతిరూపం ... మాకు కేంద్రం నుంచి దయాదాక్షిణ్యంగా నిధులు రావటం లేదు ... అని సర్కార్ సమాధానం ఇచ్చారు. రాష్ట్రంలో పాదం పెట్టడానికి బీజేపీ ఇండిజినస్ పీపుల్స్ ఫ్రంట్‌తో చేతులు కలిపింది. ఈ అంశంపై మాట్లాడుతూ, వాళ్లు త్రిపురను ముక్కలు చేయాలనుకుంటున్నారు... ఆ విషయం బీజేపీ గుర్తించటం లేదా అని ఎదురు ప్రశ్నించారు. రాష్ట్రంలో అశాంతి రగిలించడమే వాళ్ల ఉద్దేశంలా కనిపిస్తున్నది అని ఆయన విమర్శించారు. త్రిపురలో రాజకీయ హత్యలు పెరుగుతున్నాయన్న ఆరోపణ పూర్తిగా అసత్యం అని సర్కార్ తెలిపారు. జాతీయ క్రైం రికార్డ్స్ బ్యూరో నివేదిక చూస్తే ఈ విషయంలో నిజానిజాలు తెలుస్తాయని ఆయన అన్నారు. తీవ్రవాదాన్ని నియంత్రించగలిగాం ... నేరాలు తగ్గు ముఖం పట్టాయి అని ఆయన చెప్పారు. గెలుపు కోసం బీజేపీ కోట్లలో డబ్బు కుమ్మరిస్తోంది. 2014 సార్వత్రిక ఎన్నికల్లో ఆ పార్టీ దాదాపు రూ. 15వేల కోట్లు ఖర్చుచేసిందని పత్రికల్లోనే వచ్చింది కదా! ఆ వార్తలను కాదనలేదు. అంటే అంగీకరించినట్టే అని వ్యాఖ్యానించారు. పేదల కోసం వాళ్లు చేసిందేమీ లేదు. కార్పొరేట్లకు దోచిపెట్టడమే వారి విధానం అని ఆయన విమర్శించారు. 69 ఏండ్ల వయసులో కూడా ఉత్సాహంగా ఉండటానికి కారణం అడిగినప్పుడు రోజూ యోగా చేయడం ఇంకా ఇతర వ్యాయామాలు చేయడమేనని ఆయన అన్నారు.

అక్రమ మైనింగ్‌లో

బీజేపీ పాలిత రాష్ట్రాలదే పై చేయి

స్వల్ప కేసుల్లోనే ఎఫ్ఐఆర్

- స్వయంగా అంగీకరించిన మోడీ సర్కార్



భోపాల్ : చిన్నారులకు పోషకాహారలోపం, లైంగికదాడి కేసుల్లో బీజేపీ పాలిత రాష్ట్రమైన మధ్యప్రదేశ్‌దే అగ్రస్థానమని కేంద్ర ప్రభుత్వ గణాంకాలే స్పష్టం చేశాయి. ఇక ఇప్పుడు తాజాగా అక్రమమైనింగ్‌లోనూ బీజేపీ పాలిత రాష్ట్రాలే మొదటి, రెండో స్థానాన్ని ఆక్రమించాయి. ఈ విషయాన్ని కూడా కేంద్ర ప్రభుత్వ పత్రాలే నిర్ధారించాయి. కొద్దిపాటి కేసుల్లో మాత్రమే ఎఫ్ఐఆర్ నమోదు కావడం గమనార్హం. మధ్యప్రదేశ్‌లోని రాజ్‌గఢ్, భింద్, చింద్వారాల్లో అక్రమ మైనింగ్ కార్యకలాపాలు యథేచ్ఛగా సాగుతున్న ఫొటోలు హల్‌చల్ చేసిన నేపథ్యంలో పార్లమెంటులో ఇందుకు సంబంధించి ఓ సభ్యుడు లేవనెత్తిన ప్రశ్నకు కేంద్ర మైనింగ్ మంత్రిత్వ శాఖ సమాధానం ఇచ్చింది. అక్రమ మైనింగ్ వాస్తవమేనని అంగీకరించింది. అక్రమ మైనింగ్‌కు సంబంధించి 2016-17లో అత్యధికంగా మహారాష్ట్రలో 31,173 కేసులు నమోదయ్యాయని, అయితే, 794 కేసుల్లో మాత్రమే ఎఫ్ఐఆర్‌లు నమోదైనట్టు తెలిపింది. మధ్యప్రదేశ్‌లో 13,880 కేసులు నమోదుకాగా, కేవలం 516 కేసుల్లో మాత్రమే ఎఫ్ఐఆర్ నమోదైంది. ఆంధ్రలో 9,703 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. 9,703 కేసులతో ఆంధ్రప్రదేశ్ మూడో స్థానాన్ని ఆక్రమించింది. 'ఈ గణాంకాలు ఆందోళనకరంగా ఉన్నాయి. కానీ, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు ఖనిజ ఆదాయం 600 మిలియన్లు (రూ.60 కోట్లు) ఉండేది. నేడు ఆ ఆదాయం 4,500 (రూ. 450 కోట్లు) మిలియన్లకు చేరుకుంది. అక్రమమైనింగ్‌ను నిరోధించడంవల్లే ఇది సాధ్యమైంది. కాంగ్రెస్ హయాంలో అక్రమ మైనింగ్‌కు పాల్పడేవారికి రక్షణ లభించేదనీ, కానీ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆదాయం పెరిగిందని మోడీ సర్కారు చెప్పుకునేందుకు తంటాలు పడుతోంది. వాస్తవానికి అక్రమమైనింగ్‌ను ఏవిధంగా కట్టడి చేస్తామో కూడా చెప్పలేక చేతులెత్తేస్తున్నది. ఈ లెక్కన సర్కారు ఖజానాకు వచ్చే ఆదాయాన్ని కొల్లగొడుతున్నా.. దోచుకునేది మా వాళ్లేకదా.. అందినంత దోచుకోనిద్దాంలే అన్న తీరులో బీజేపీ పాలకులు వ్యవహరించటంపై స్థానిక జనంతో పాటు, ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి.

అంగన్‌వాడీల ఆదరణలో లెఫ్ట్ ఫస్ట్.!

- బీజేపీ పాలిత రాష్ట్రాలు, త్రిపురలో వేతనాల తీరు ఇలా..

నవతెలంగాణ - జనరల్ డెస్క్

అతి చిన్నదైన ఈశాన్య రాష్ట్రం త్రిపురలో ఎన్నికల వేడి ఊపందుకుంది. వామపక్ష నేతలు ఇంటింటి ప్రచారంతోపాటు.. నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభలకు విశేష ఆదరణ లభిస్తోంది. వేర్పాటువాద ఇండిజినస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపురతో కూటమిగా ఏర్పడిన బీజేపీ వామపక్ష ప్రభుత్వంపై అబద్ధపు ప్రచారాలను చేస్తూ.. విమర్శలను ఎక్కుపెడుతున్నది. 25 ఏండ్ల నుంచి తిరుగులేని పాలన అందిస్తున్న వామపక్ష ప్రభుత్వం పనితీరుకు సంబంధించి వాదనలు.. ప్రతివాదనలు ఎలా ఉన్నా... లెఫ్ట్ ఫ్రంట్ రికార్డులను.. బీజేపీ పాలిత రాష్ట్రాలతో పోల్చి చూస్తే వాస్తవాలేమిటో ఇట్టే అర్థమవుతాయి.బీజేపీ పాలిత ఇతర రాష్ట్రాల్లో, త్రిపుర లో అంగన్‌వాడీ కార్మికులు,హెల్పర్లు అందిస్తున్న వేతనాలు ఒకసారి పరిశీలిద్దాం.

అధిక వేతనం త్రిపురలోనే...

అంగన్‌వాడీ కార్మికులు, హెల్పర్లకు గౌరవ వేతనం అందిస్తున్న రాష్ట్రాల్లో త్రిపురదే అగ్రస్థానం. కేంద్ర ప్రభుత్వం వారికి స్వల్పమొత్తం ఇస్తుండటంతో దానికి కొంత మొత్తాన్ని కలిపి ఆయా రాష్ట్రాలు వారికి వేతనాలు చెల్లిస్తున్నారు. అంగన్‌వాడీ కార్మికులకు, సహాయకులకు అత్యధికంగా త్రిపురలో రూ.5,865, రూ. 3,424 ఇస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం వారికి వరుసగా రూ. 3,000, రూ. 1,500 చెల్లిస్తుంటే.. దానికి అదనపు మొత్తాన్ని చేర్చి రాష్ట్రాలు చెల్లిస్తున్నాయి. రెండు దశాబ్దాలుగా బీజేపీ అధికారంలో ఉన్న గుజరాత్‌లో అంగన్‌వాడీలకు, హెల్పర్లకు వరుసగా రూ. 4,750, రూ. 2,400 చెల్లిస్తున్నారు. 15 ఏండ్ల నుంచి అధికారంలో ఉన్న మధ్యప్రదేశ్‌లో వరుసగా రూ. 5,000, రూ. 2,500 చెల్లిస్తున్నారు. అత్యధిక గిరిజన జనాభా కలిగిన ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్‌లలోనూ బీజేపీ అధికారంలో ఉంది. ఈ రాష్ట్రాల్లో వారి జీతాలను త్రిపురతో పోలిస్తే.. 20 నుంచి 30 శాతం తక్కువ ఉండటం గమనార్హం. ఐసీడీఎస్ ప్రోగ్రామ్ కింద ఆరేండ్లలోపు పిల్లలకు, గర్భిణులకు, పాలిచ్చే తల్లులకు పోషకాహారాన్ని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్నారు. త్రిపురలో వారికి మెరుగైన వేతనాలే కాదు.. ప్రత్యేకంగా మారుమూల గిరిజన ప్రాంతాల్లో సైతం అంగన్‌వాడీ కార్మికులు కీలక సేవలను అందిస్తున్నారు. పిల్లలు మరియు తల్లులకు మెరుగైన పోషకాహారంతోపాటు, వారి ఆరోగ్యాన్ని కాపాడటంలో సహాయపడుతున్నారు.

అంగన్‌వాడీల వేతనాలు
నెలకు రూపాయల్లో

	కార్మికులు	హెల్పర్లు
త్రిపుర	5865	3424
అసోం	4000	2000
బీహార్	3750	1875
ఛత్తీస్‌గఢ్	4000	2000
గుజరాత్	4750	2400
హర్యానా	5500	3750
జార్ఖండ్	4400	2200
మధ్యప్రదేశ్	5000	2500
మహారాష్ట్ర	5000	2500
రాజస్థాన్	4736	2565
ఉత్తరప్రదేశ్	4000	2000

లోక్‌సభలో ఈ నెల 2న ప్రభుత్వం ఇచ్చిన గణాంకాలు

అందుబాటులో లేని అత్యవసర మందులు

ముంబయి : 'ఎసెన్షియల్ మెడిసిన్స్' (అత్యంత ఆవశ్యకమైన మందులు) జాబితాలో భారత ప్రభుత్వం వేలాది మందుల్ని భారత ప్రభుత్వం చేర్చింది. ప్రతీ మెడికల్ షాపులో వీటిని అందుబాటులో ఉంచాల్సిందే. కానీ ఇందులో ఏవో కొన్ని మాత్రమే (అధిక ధరలతో ఉన్నవి) ప్రజలకు అందుబాటులో ఉన్న విషయాన్ని తాజా అధ్యయనం బయటపెట్టింది. వైద్య రంగం అవసరాల్ని తీర్చే...సురక్షితమైన, ప్రభావంతమైన వివిధ మందుల్ని 'ఎసెన్షియల్ మెడిసిన్స్' జాబితాలో చేర్చుతారు. దీనర్థం ఈ జాబితాల్లో ఉండే మందులన్నీ ప్రజలకు అందుబాటులో ఉండాలి.

కానీ భారతదేశంలో ఈ పరిస్థితి లేదని ఈ అధ్యయనం తేల్చింది. న్యూక్యాస్టల్ వర్సిటీ (బ్రిటన్), ముంబయిలోని 'లక్ష్య' సొసైటీ, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ సంయుక్తంగా ఈ అధ్యయనాన్ని జరిపాయి. వీరి పరిశోధన పత్రం ఈ ఏడాది 'జర్నల్ ఆఫ్ గ్లోబల్ హెల్త్‌'లో ప్రచురితమైంది. మహారాష్ట్రలో ధూలే, సాంగ్లీ, నాగపూర్, ముంబయి నగరాల్లో వీరి పరిశోధనాత్మక అధ్యయనం సాగింది. అందులో తేలిన విషయాలు ఇలా ఉన్నాయి...

'ఎసెన్షియల్ మెడిసిన్స్' 2015 జాబితాలో భారత ప్రభుత్వం 376 రకాల మందుల్ని చేర్చింది. ఇందులో అత్యధికం ప్రయివేటు ఫార్మసీ దుకాణాల్లో అమ్మటం లేదు. ఈ జాబితాలోని కేవలం 6 మందులు మాత్రమే 124 ప్రయివేటు ఔషధ షాపుల్లో లభ్యమయ్యాయి. వీటి ధరలు సామాన్యుడికి అందుబాటులో లేవు. కేవలం ధనవంతులు మాత్రమే కొనగలిగే స్థాయిలో వీటి ధరలు ఉన్నాయి.



భారతదేశంలో వైద్య వసతులు కనిష్టస్థాయిలో ఉన్నాయని, కనీసం మందులైనా అందుబాటులో ఉంచాల్సిందని పరిశోధనా బృందంలోని వైద్యుడు డా.కోలిన్ మిల్లార్డ్ చెప్పారు. ఖరీదైనప్పటికీ బలవంతంగా ప్రయివేటులో కొనాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన అభిప్రాయపడ్డారు.

జనరిక్ మందుల్ని ప్రయివేటు రిటైల్ ఔట్‌లెట్స్‌లో ఉండేట్టు చూడాలని ఆయన సూచించారు. బహుళ ఆమోదం పొందిన బ్రాండ్స్ ఎన్నో ఉన్నాయని, 'ఎసెన్షియల్ మెడిసిన్స్' జాబితాలో భారత ప్రభుత్వం వీటిని కూడా చేర్చిందని, కానీ ఇవేవీ మందుల షాపుల్లో అమ్మటం లేదని ఆయన చెప్పారు. అలాగే మార్కెట్లో వివిధ కాంబినేషన్లతో తయారైన మందులు ఎన్ని ఉన్నాయన్నదానిపై సమాచారం సేకరించాల్సిందిగా సూచన చేశారు. ఎసెన్షియల్ మందులకు సంబంధించి వివిధ రకాల ఔషధాలు, వాటి ధరలు, అనుమతికి సంబంధించి డాటాబేస్‌ను రూపొందించి ప్రజలకు అందుబాటులో ఉంచాలని, 'సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్'కు సూచించారు.

64 శాతం యాంటిబయోటిక్స్ మందులు నకిలీలే..

యాంటిబయోటిక్స్ మందుల్లో 64 శాతం నకిలీవేనని యూకే నిర్వహించిన అధ్యయనంలో వెల్లడైంది. ప్రపంచవ్యాప్తంగా యాంటిబయోటిక్స్ మందుల వినియోగంపై లండన్‌లోని క్వీన్స్‌మేరీ యూనివర్సిటీ, న్యూక్యాసిల్ యూనివర్సిటీల పరిశోధకులు సంయుక్తంగా నిర్వహించిన అధ్యయనంలో తేలింది.


దారి తప్పిన మద్దతు

రైతుకు దక్కాల్సిన కంది మద్దతు ధర దారి తప్పింది. కాదు..కాదు..అధికారులు, దళారులు మిలాకత్ అయి దారి తప్పించారు. మార్కెట్‌లో రైతులు పడిగాపులు గాసేలా చేస్తూ...అమ్మినా డబ్బులు 45 రోజుల తర్వాత కూడా వస్తాయో రావని భయపెడుతూ..దళారులకు అమ్మేలా అధికారులు పరోక్షంగా సహకరిస్తున్నారు. క్వింటాల్ కందులకు రూ. 3 వేల నుంచి 4 లోపే దళారులు రైతుల నుంచి కొంటున్నారు. వాటినే తిరిగి రైతుల పాస్‌పుస్తకాల పేరిటే మార్కెట్‌లో తమ పరపతిని ఉపయోగించి రూ.5,450 (మద్దతు ధర)కు అమ్ముకుంటున్నారు. ఇలా 750 మంది రైతుల పేరిట 38,734 క్వింటాళ్ల కందులు అమ్మినట్టు అధికారులు రికార్డుల్లో చూపుతున్నారు. ఈ క్రమంలోనే మహబూబ్‌నగర్‌లోని మార్కెట్‌యార్డు పక్కనే డీసీఎంలో దళారులకు చెందిన 100 బస్తాల కందులు పట్టుబడ్డాయి.



నవతెలంగాణ-మహబూబ్‌నగర్

మహబూబ్‌నగర్ జిల్లాలో 26మండలాల్లో 2,142.5 ఎకరాల్లో కంది సాగు చేశారు. నెల నుంచి నారాయణపేట, మక్తల్, దేవరకద్ర, మహబూబ్‌నగర్, జడ్చర్ల మార్కెట్‌లోకి కందులు వస్తున్నాయి. ప్రభుత్వం రైతులకు మద్దతు ధర 5,450 రూపాయలు కల్పించింది. జిల్లాలో ఉన్న 18 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల నుంచి కందులను కొనుగోలు చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని సింగిల్ విండో సహకార కేంద్రం డిసెంబర్ 28వ తేదీన కందుల కొనుగోలు కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించారు. ఫిబ్రవరి రెండో తేదీ నాటికి 77,468బస్తాలు(38, 734 క్వింటాళ్లు) కొనుగోలు చేశారు. అధికారుల రికార్డుల్లో 750మంది రైతుల నుంచి కొనుగోలు చేసినట్టు ఉంది. రైతుల కోసం ఏర్పాటు చేసిన సింగిల్‌విండో సహకార కేంద్రాలే దళారుల అక్రమాలకు అడ్డాలుగా మారాయి. రైతుల నుంచి పొలాల వద్ద కందుల నాణ్యతను బట్టి రూ.మూడున్నరవేల నుంచి నాలున్నర వేల వరకు దళారులు కొంటున్నారు. వాటినే తిరిగి మార్కెట్‌లో మద్దతు ధరకు అమ్ముకుంటున్నారు. ఈ క్రమంలోనే శుక్రవారం అర్ధరాత్రి జిల్లా కేంద్రంలోని సర్దార్ వల్లాభాయ్ పటేల్ వ్యవసాయ మార్కెట్ బయట ఓ కమీషన్ ఏజెంట్ దుకాణంలో 100(50కిలోల)బస్తాలను డీసీఎంలో నుంచి దించుతుండగా పోలీసులు పట్టుకున్నారు. వివరాలు ఆరా తీయగా పొలాల దగ్గరే రైతుల నుంచి క్వింటాకు రూ. 4,200 చొప్పున కొన్నట్టు తేలింది. ఆ కందులను మద్దతు ధర రూ.5,450 రూపాయల చొప్పున మార్కెట్‌లో అమ్ముకుంటున్నట్టు చెప్పారు. సన్నకారు రైతుల నుంచి కందులు కొని పెద్ద రైతుల పాస్ పుస్తకాలు, బ్యాంక్ అకౌంట్లను చూపించి అక్రమ దందాలు చేస్తున్నట్టు వెల్లడైంది. ఆ మార్కెట్ యార్డులో రైతులకు దక్కాల్సిన 21.12 కోట్ల రూపాయలు ఎవరి పాలయ్యాయే తేలాల్సి ఉంది. పట్టుబడిన వాహనంపై కేసు కాకుండా అధికార పార్టీకి చెందినవారు పోలీసులపై ఒత్తిడి తెస్తున్నట్టు తెలుస్తోంది. అధికార పార్టీ నేతల అండదండలతోనే దళారులు ఈ దందాకు తెరతీసినట్టు స్థానికంగా ప్రచారం జరుగుతున్నది. ఈ కందులు జిల్లాకు చెందినవేనా? పక్క జిల్లాలకు చెందినవా? లేక పక్క రాష్ట్రాలను ప్రభుత్వం మద్దతు ధర కోసం తెచ్చి అమ్ముకుంటున్నారా? అనేది తేలాలి.



బయటనే అమ్ముకున్న : కతాని లక్ష్మయ్య, హన్వాడ

'రెండెకరాల్లో కంది పంటేస్తే రెండు క్వింటాళు పండింది. అప్పు తీర్చడానికి వ్యాపారులకే క్వింటా రూ.4,600 చొప్పున అమ్మిన. కందిపంట వేసినందుకు అప్పులే మిగిలాయి.'

అమ్మిన 45 రోజులకు పైసలిస్తమన్నరు...: యాదయ్య, రైతు ఇబ్రహీంబాద్



'మార్కెట్ల కందులు అమ్మితే పైసలు రావటానికి 45 రోజులు పడుతదన్నరు. పంట ఇంటికొచ్చినప్పటి నుంచి అప్పులోళ్లు తిరుగుతున్నరు. అప్పు తీర్చటానికి బయటనే అమ్ముకున్న.'

బడా వ్యాపారులతో రైతులకు నష్టం : వెంకట్‌రాంరెడ్డి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి

'రైతుల అసరాలను, బలహీనతలను ఆసరాగా చేసుకుని బడావ్యాపారులు మోసం చేస్తున్నారు. కొనుగోలులో ప్రభుత్వాధికారులు పారదర్శకత పాటించాలి. కందుల దందాపై సమగ్ర విచారణ చేసి దోషులను శిక్షించాలి.'

మా దృష్టికొస్తే కేసులు పెడతాం : కోరమోని వెంకటయ్య, మహబూబ్‌నగర్ వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు

'మా సొసైటీ ద్వారా ప్రభుత్వ మద్దతు ధరకే కందులను కొనుగోలు చేశాం. మాపై వస్తున్న ఆరోపణల్లో నిజంలేదు. రాత్రి కందుల డీసీఎం పట్టుబడ్డట్టు తెలిసింది. కచ్చితంగా మా దృష్టికి వస్తే కేసులు పెడతాం. ఎక్కడో జరిగిన పొరపాటును మాపై రుద్దడం సరికాదు.'

విద్యార్థినులపై లైంగిక వేధింపులు

- ఉపాధ్యాయుడి నిర్వాకం
- దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన తల్లిదండ్రులు, సంగారెడ్డి జిల్లాలో ఘటన

నవతెలంగాణ-జోగిపేట

విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయుడు కీచకుడిగా మారాడు. అభం..శుభం తెలియని విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. కీచకుడి వేధింపులు ఎక్కువవడంతో బాలికలు జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు తెలిపారు. ఆగ్రహించిన వారు అతన్ని పట్టుకుని దేహశుద్ధి చేశారు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం కొర్పోల్ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న మల్లికార్జున్ తొమ్మిది, పదవ తరగతి చదువుతున్న విద్యార్థినులతో రోజూ అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడు. వేధింపులు ఎక్కువ కావడంతో విద్యార్థినులు జరిగిన విషయం తల్లిదండ్రులకు చెప్పారు. ఆగ్రహించిన తల్లిదండ్రులు, గ్రామస్తులు పాఠశాలకు చేరుకుని టీచర్ మల్లికార్జున్‌కు దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు సమాచారం అందజేశారు. ఎస్సై సత్యనారాయణ పాఠశాలకు చేరుకుని తల్లిదండ్రులు, బాలికల ఫిర్యాదు మేరకు టీచర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

నమ్మి ఓట్లేస్తే నిలువునా ముంచారు

- కేసీఆర్‌పై కనుకుల విమర్శ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

సాధారణ ఎన్నికల్లో కేసీఆర్ మాటలు నమ్మి జనం ఓట్లేస్తే అధికారంలోకి వచ్చాక ఆయన ప్రజలను నిలువునా ముంచారని మాజీ ఎమ్మెల్సీ, టీపీసీసీ సేవాదళ్ చైర్మెన్ కనుకుల జనార్ధన్‌రెడ్డి చెప్పారు. ప్రజలకు అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక వారిని అన్నివిధాల మోసం చేశారని విమర్శించారు. సోమవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇస్తామని, 2018 నాటికి రెండు లక్షల 75 వేల ఇండ్లు నిర్మిస్తామంటూ ప్రగల్భాలు పలికిన కేసీఆర్ ఎందుకు ఇండ్ల పనులు పూర్తి చేయించలేకపోతున్నారని ప్రశ్నించారు. ఇప్పటి వరకు 4వేల ఇండ్ల నిర్మాణం మాత్రమే జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో లక్షలాది మందికి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేయించామన్నారు. సీఎం కేసీఆర్ సచివాలయానికి వచ్చి ఏడాది గడిచిపోయిందని, ఇంత దుర్మార్గంగా పరిపాలన సాగించిన చరిత్ర ఏ ముఖ్యమంత్రికి లేదన్నారు. రాష్ట్రాభివృద్ధికి కాంగ్రెస్ పార్టీయే అడ్డుపడుతుందని చెప్పి కేసీఆర్ తప్పించుకుంటున్నారని విమర్శించారు. కేసీఆర్‌కు పరిపాలనపై చిత్తశుద్ధి లేదని, రాజకీయాలు కొంత సేపు పక్కన పెట్టి రాష్ట్ర అభివద్ధిపై దృష్టి సారించాలని ఆయన సూచించారు.

నాస్ పరీక్షకు 79,423 మంది హాజరు

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

అభ్యసన ఫలితాలను అంచ నా వేసేందుకు పదో తరగతి విద్యార్థులకు పాఠశాల విద్యాశాఖ సోమవారం నిర్వహించిన నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే(నాస్)-2018 ప్రశాంతంగా ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా 2481 ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేటు పాఠశాలల్లో నిర్వహించిన ఈ పరీక్షకు 79,423 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 42,292 మంది బాలికలు కాగా, 37,131 మంది బాలురు ఉన్నారు. గణితం, ఇంగ్లీష్, సైన్స్, సోషల్ స్టడీస్, మోడర్న్ ఇండియన్ లాంగ్వేజీ సబ్జెక్టుల్లో ఈ పరీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. కాగా ఈ సర్వేలో తెలంగాణ నుంచి 92,978 మంది పాల్గొంటారని ముందుగా విద్యాశాఖ అధికారులు అంచనా వేయగా, వివిధ కారణాలతో 13,555 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

'నూతన మార్కెట్ విధానం ప్రవేశపెట్టాలి'

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వ్యవసాయ రంగం సంక్షోభం నుంచి బయటపడాలంటే నూతన మార్కెట్ విధానం ప్రవేశపెట్టాలని అఖిల భారత రైతు సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బిఎన్ మల్లీశ్వర్‌రెడ్డి, ఎం. విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు సమస్యలను పరిష్కరించడంలో శ్రద్ధ చూపడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కార మార్గాలు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సూచించినట్టుగా ప్రభుత్వాలు పని చేసినట్టయితే ఇప్పటికే వ్యవసాయం పూర్తిగా బాగుపడేదని అన్నారు. ప్రభుత్వాల అవకతవకల విధాన నిర్ణయాల వల్ల దేశవ్యాప్తంగా ఆహారాన్ని అందిస్తున్న వేలాదిమంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంట పండించేందుకు అయ్యే మొత్తం ఖర్చులో 50 శాతం అదనంగా కలిపి ధర నిర్ణయించాలని కమిషన్ సూచించిందన్నారు. దీన్ని యూపీఏ ప్రభుత్వం ఏనిమిదేండ్లయినా అమలు చేయలేదన్నారు. 2014లో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అమలు చేస్తామని చెప్పి తమ ఎన్నికల మేనిఫెస్టోలో కూడా పొందుపర్చిందన్నారు.

అయినా ఇప్పటి వరకు అమలుకు నోచులేదన్నారు. మోడీ ప్రభుత్వ హయాంలో రైతు ఆత్మహత్యలు రెట్టింపు అయ్యాయని చెప్పారు. ఈ సమావేశంలో రైతు ప్రోత్సాహక నేత డాక్టర్ సి. గోపినాథ్‌రెడ్డి, రిటైర్డ్ అడిషనల్ డీజీపీ పెద్దిరెడ్డి చెంగల్‌రెడ్డి, సిహెచ్ సత్యనారాయణరెడ్డి, అధ్యక్షులు ఎం. విష్ణువర్ధన్‌రెడ్డి, మెదక్ జిల్లా రైతు నాయకులు కడపటి రాజయ్య, వరంగల్ జిల్లా రైతు నాయకులు లక్ష్మీకాంత్‌రెడ్డి, కూనరెడ్డి అంజిరెడ్డి పాల్గొన్నారు.

ఆర్థికవిధానాల అమలులో దొందుదొందే!

మేడారంలో దేవాలయ నిర్మాణం ప్రమాదకరం: సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం



మాట్లాడుతున్న సురవరం సుధాకర్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

ఆర్థిక విధానాలు అమలు చేయడంలో బీజేపీ, కాంగ్రెస్ రెండు పార్టీలకు తేడా లేదని సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి అన్నారు. ఆర్థిక విధానాలతో పాటు మతోన్మాదం, నిరంకుశత్వం, సంఘ్ పరివార్ శక్తులను బీజేపీ ముందుకు తెస్తుందని చెప్పారు. బీజేపీని ఓడించేందుకు వామపక్ష, ప్రజాతంత్ర లౌకిక శక్తులన్నీ కలిసి విశాల ఐక్య వేదిక ఏర్పాటు చేయాలనీ సీపీఐ భావిస్తుందని అన్నారు. దేశంలోని సమస్యలకు వామపక్షాలే నిజమైన పరిష్కారం చూపగలుగుతాయనేది వాస్తవమేనని చెప్పారు. సోమవారం మఖ్దూంభవన్‌లో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం వర్క్‌షాప్‌ను సురవరం సుధాకర్‌రెడ్డి ప్రారంభించారు. ప్రభుత్వం రూ.200కోట్లతో మేడారంలో సమ్మక్క, సారలమ్మ దేవాలయాన్ని నిర్మించాలనే ఆలోచన ప్రమాదకరమైందని ఆయన అన్నారు. గిరిజనుల సంప్రదాయల నుంచి ఈ ఉత్సవాలను బ్రాహ్మణీయ సంప్రదాయంలోకి మార్చడానికి ప్రయత్నం చేస్తున్నరని గిరిజనులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ...భూమి, ఇండ్ల స్థలాలు ప్రధాన అంశాలతో పాటు సమస్యలపై నిరంతరం ఉద్యమాలు నిర్మించడం ద్వారా ప్రజాసంఘాలను బలోపేతం చేసుకోవాలని అన్నారు. అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ, దేవాదాయ, వక్ఫ్, అసైన్డ్ భూములను పరిరక్షించేందుకు ఆందోళనలు చేయాలని కోరారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి వెంకట్రాములు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుండా మల్లేశ్, ఈర్ల నరసింహ మాట్లాడారు.

పాలన వికేంద్రీకరణతో ప్రజల్లోకి పథకాలు :కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పాలన వికేంద్రీకరణ ద్వారా ప్రజలకు ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా చేరుతాయని మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. సోమవారం సచివాలయంలో తెలంగాణ మున్సిపల్ కమిషనర్ల డైరీని మంత్రి ఆవిష్కరించారు. శాఖలో ఇప్పటికే పలు సంస్కరణలు చేపట్టామని, చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్రంలోని పలు మున్సిపాలిటీలకు, కార్పొరేషన్లకు పెద్దఎత్తున నిధులు కేటాయించామని చెప్పారు.

కార్పొరేట్‌ల నజరానా

సంపాదకీయం

కార్పొరేట్ సంస్థల నుంచి అధిక మొత్తంలో నిధులు దండుకోవడంలో బీజేపీ సరికొత్త రికార్డు సృష్టించింది. 2016-17 సంవత్సరంలో కార్పొరేట్ సంస్థలు రాజకీయ పార్టీలకు ఇచ్చిన రూ.419 కోట్ల విరాళాల్లో 83శాతం అంటే రూ.287.69 కోట్లు ఒక్క బీజేపీకే దక్కాయని ఎన్నికల సంస్కరణల కోసం కృషి చేస్తున్న ప్రభుత్వేతర సంస్థ అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) తెలిపింది. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కార్మిక వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలను అత్యంత సమర్థవంతంగా అమలు చేస్తున్నందుకు దక్కిన నజరానా అది. కేంద్ర ప్రత్యక్ష పన్నుల మండలి (సీబీడీటీ) వద్ద నమోదయిన 21 ఎలక్టోరల్ ట్రస్టులు, ఎన్నికల సంఘానికి రాజకీయ పార్టీలు సమర్పించే డిక్లరేషన్ల ఆధారంగా రూపొందించిన ఈ నివేదిక.. కార్పొరేట్ సంస్థలు రాజకీయ వ్యవస్థను తమ గుప్పెట్లో పెట్టుకునేందుకు విరాళాలను ఒక సాధనంగా ఎలా వాడుకుంటున్నదీ, అవి విదిల్చే నిధుల కోసం బీజేపీ, కాంగ్రెస్ లాంటి పాలకవర్గ పార్టీలు, ప్రాంతీయ పార్టీలు ఎలా పోటీ పడుతున్నదీ పూసగుచ్చినట్టు వివరించింది. రాజకీయ పార్టీలకు నిధుల లభ్యతపై పారదర్శకత, స్వచ్ఛత ఉండాలని గంభీరమైన ప్రకటనలు చేసే బీజేపీ కపట వైఖరిని ఏడీఆర్ నివేదిక కండ్లకు కట్టింది. ఇది ఈ ఒక్క సంవత్సరానికి మాత్రమే పరిమితమనుకుంటే పొరపాటు. నాలుగేండ్లుగా ఇదే ధోరణి కొనసాగుతూ వస్తోంది. బీజేపీకి ముడుతున్న ఈ నిధుల్లో చాలా వరకు రియల్ ఎస్టేట్, మైనింగ్, చమురు, విద్యుత్, కన్‌స్ట్రక్షన్, మ్యాన్‌ఫ్యాక్చరింగ్ వంటి రంగాల నుంచి వచ్చినవే. ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం ద్వారా కాంట్రాక్టులను, ప్రజల ఆస్తులను, సహజ వనరులను కారుచౌకగా కొట్టేయడం కోసం అవి చెల్లించుకునే ముడుపులకు మరో పేరే ఈ విరాళాలు!

కార్పొరేట్ శక్తుల నిధుల్లో 80శాతం పైన దండుకుంటున్న బీజేపీ ఎఫ్‌సీఆర్‌ఏ చట్టానికి సవరణలు జరిగితే మరిన్ని నిధులు కైంకర్యం చేస్తుంది. ఈ నిధులను ఎన్నికల్లో గెలవడానికే కాదు ప్రతిపక్షాలను లొంగదీసుకోడానికీ, సంఘ్‌పరివార్ ప్రాజెక్టులకు కూడా ఉపయోగపెట్టుకునే అవకాశం ఉంది. ఇది ప్రజాస్వామ్యానికి చాలా ప్రమాదకరం.



కార్పొరేట్ సంస్థలకూ, మోడీ ప్రభుత్వానికీ మధ్య పెనవేసుకుపోయిన అపవిత్ర పొత్తుకు ఈ ఉదంతం ఒక తిరుగులేని తార్కాణం. ఈ పొత్తును మరింత పటిష్టపరిచేందుకు కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఇటీవల ఎన్నికల బాండ్ల స్కీమ్ పేరుతో సరికొత్త అంకానికి తెర తీశారు. అధికారంలో వున్న బీజేపీకి కార్పొరేట్ నిధులు దండిగా సమకూర్చేందుకు, రాజకీయ వ్యవస్థను కుబేరులు టేకోవర్ చేసేందుకు తప్ప ఈ ఎలక్టోరల్ బాండ్ స్కీమ్ మరి దేనికీ పనికిరాదు. ఇందుకు సంబంధించిన బిల్లును ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లోనే పార్లమెంటులో ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ప్రామిసరీ నోట్ తరహాలో వుండే ఈ ఎన్నికల బాండ్లను ఎంపిక చేసిన ఎస్‌బీఐ బ్రాంచీల్లో అమ్మకానికి పెడతారు. వెయ్యి, పది వేలు, లక్ష, పది లక్షలు, కోటి రూపాయల విలువ కలిగిన ఈ బాండ్లను కార్పొరేట్ కంపెనీలు కొనుగోలు చేసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు విరాళంగా అందజేస్తాయి. వాటిని ఆ పార్టీలు తమ అకౌంట్‌లో వేసుకుని నగదుగా మార్చుకుంటాయి. ఈ బాండ్లను ఎవరు ఇచ్చారు, ఎక్కడి నుంచి వచ్చాయి అన్న వివరాలను రాజకీయ పార్టీలు వెల్లడించనక్కర్లేదు. దర్యాప్తు సంస్థలూ దీనిని ప్రశ్నించడానికి వీల్లేదు. రాజకీయ పార్టీలకు కార్పొరేట్ల నిధుల్లో పారదర్శకతే ప్రభుత్వ లక్ష్యమైనప్పుడు ఆ బాండ్లను ఇచ్చిన వారి పేర్లు ఎందుకు బయటపెట్టరు? బాండ్లను ఎవరిచ్చారో ప్రజలకు తెలియకపోవచ్చుగానీ అధికారంలో ఉన్న పార్టీకి తెలియకుండా ఉండదు. అందువల్ల ప్రతిపక్ష పార్టీలకు విరాళాలు ఇవ్వకుండా కార్పొరేట్లను ప్రభుత్వం బెదిరించేందుకు కూడా ఈ కొత్త బిల్లు వల్ల అవకాశం ఏర్పడుతుంది. మొత్తంగా చూస్తే బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లు వల్ల అధికార పార్టీకి లాభం చేకూరుతుంది. ఎన్నికల్లో అది విపరీతంగా డబ్బు ఖర్చు చేయడానికి అవకాశం ఏర్పడుతుంది.

దేశీయ కార్పొరేట్ సంస్థలే కాకుండా, విదేశీ కార్పొరేట్ సంస్థలు సైతం రాజకీయ పార్టీలకు నిధులు ఇచ్చేందుకు వీలుగా ఎఫ్‌సీఆర్‌ఏ చట్టానికి సవరణలు చేపడుతున్నది. విదేశీ కంపెనీలు భారత్‌లోని తమ అనుబంధ సంస్థల ద్వారా రాజకీయ పార్టీలకు నిధులు ముట్టజెప్పడానికి ఇది వీలుకల్పిస్తున్నది. ఆయుధాలు, విమానాలు వంటి భారీ కొనుగోళ్లలో క్విడ్ ప్రోకో వంటి పద్ధతులకు ఈ సవరణల ద్వారా చట్టబద్ధత కల్పించాలని చూస్తున్నది. భారీ కాంట్రాక్టు పొందేవారు అధికారంలో వున్న పార్టీకి పది శాతం ముడుపుల రూపంలో సమర్పించుకోవడం ఇప్పటివరకు గోప్యంగా జరుగుతోంది. ఇక నుంచి చట్టబద్ధంగానే అటువంటివి సాగించవచ్చు. ఇందుకు అడ్డంకిగా వున్న ప్రజాప్రాతినిధ్య చట్టం, ఆర్‌బీఐ చట్టం, ఆదాయపు పన్ను చట్టాల్లోని నిబంధనలను తొలగించేందుకు ఈ ప్రభుత్వం పూనుకుంటోంది. ఇప్పటికే కార్పొరేట్ శక్తుల నిధుల్లో 80శాతం పైన దండుకుంటున్న బీజేపీ ఎఫ్‌సీఆర్‌ఏ చట్టానికి సవరణలు జరిగితే మరిన్ని నిధులు కైంకర్యం చేస్తుంది. ఈ నిధులను ఎన్నికల్లో గెలవడానికే కాదు ప్రతిపక్షాలను లొంగదీసుకోడానికీ, సంఘ్‌పరివార్ ప్రాజెక్టులకు కూడా ఉపయోగపెట్టుకునే అవకాశం ఉంది. ఇది ప్రజాస్వామ్యానికి చాలా ప్రమాదకరం.

ఆర్థిక సర్వే 2017-18



ప్రభాత్ పట్నాయక్

పులిమీద స్వారీ చేస్తున్న వ్యక్తిలాగానే భారత ఆర్థిక వ్యవస్థ ఒక ప్రమాదకర మార్గంలో పయనిస్తోంది. 2017-18 సంవత్సర ఆర్థిక సర్వే ఈ వాస్తవాన్ని నిజాయితీతో గుర్తించింది. అయితే సమస్యకు పరిష్కారం పాలుపోని స్థితిలో ప్రయాణాన్ని ఇలానే కొనసాగించాలనే ఆశతో ముందుకు సాగుతున్నది.

ఈ ఆర్థిక సర్వే అందజేస్తున్న స్థూల ఆర్థిక డాటా (సమాచారం) అంతర్జాతీయ ద్రవ్యనిధి(ఐఎమ్‌ఎఫ్)కి చెందిన ప్రపంచ ఆర్థిక పరిస్థితి(వరల్డ్ ఎకనామిక్ ఔట్‌లుక్)లోని సమాచారాన్ని పోలివున్నది. దావోస్‌లో జరిగిన సమావేశం కోసం ఈ సమాచారాన్ని తాజా పరిచారు. అంతేగానీ భారత ప్రభుత్వ గణాంక సంస్థ అందిస్తున్న సమాచారాన్ని సమగ్రంగా పరిగణనలోకి తీసుకోలేదు. వర్తమాన ఆర్థిక సంవత్సరంలో స్థూల జాతీయోత్పత్తి పెరుగుదల రేటు 6.7శాతం (ఐఎమ్‌ఎఫ్ 6.7శాతం, కేంద్ర గణాంక సంస్థ 6.5శాతంగా అంచనా వేశాయి)గా ఉంటుందని ఆర్థిక సర్వే అంచనా వేసింది. ఎటువంటి అవాంతరాలు లేకుంటే అంటే పులిమీద చేస్తున్న స్వారీ కొనసాగితే 2018-19లో ఈ వృద్ధి రేటు 7-7.5శాతం (ఇది ఐఎమ్‌ఎఫ్ అంచనాలో 7.4శాతం)గా ఉంటుందని ఆర్థిక సర్వే అంచనా వేసింది.

ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పరిస్థితి మెరుగవుతున్నదనే ఊహనపై ఇది ఆధారపడింది. అంటే మోడీ మూక నోట్ల రద్దువంటి అవకతవక పనులేమీ చెయ్యకపోతే (సర్వే దీనిపై స్పష్టంగా విమర్శనాత్మక వైఖరిని ప్రదర్శించింది) ఎగుమతుల వృద్ధి రేటు పెరిగే అవకాశం ఉంటుంది. దీనితో ఇప్పుడున్న సంక్లిష్ట పరిస్థితులలో గందరగోళం ఏర్పడకపోతే ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రయివేటు పెట్టుబడులు వచ్చి ఆర్థిక వ్యవస్థను ఉత్తేజపరుస్తాయి.

ఆర్థిక సర్వే ప్రభుత్వ నియంత్రణలో లేకుండా స్వయం ప్రతిపత్తిని కలిగివున్నదని ఒక ఆసక్తికరమైన వాస్తవం తెలియజేస్తున్నది. అదేమంటే 2022 సంవత్సరంకల్లా వ్యవసాయ ఆదాయం రెండింతలు చేయాలనే ప్రభుత్వ ప్రకటిత లక్ష్యాన్ని మెచ్చుకుంటూనే ఆ లక్ష్యాన్ని చేరుకోవటానికి తీసుకోబోయే చర్యల గురించి ఆర్థిక సర్వే పట్టించుకోలేదు.

గందరగోళపరిచే రెండు కారకాలను సర్వే ఎత్తి చూపింది. ప్రపంచ మార్కెట్‌లో చమురు ధరలు పెరగటం, దేశంలో స్టాక్ మార్కెట్ బూమ్ పతనం కావటమనే ఈ రెండు ప్రమాదాలు వాస్తవ రూపం దాల్చకపోతే వృద్ధి రేటు అనుకున్నట్టు కొనసాగుతుంది. ప్రపంచ మార్కెట్‌లో చమురు ధరలు తగ్గటం, స్టాక్ మార్కెట్‌లో బూమ్ కొనసాగటం వల్ల వడ్డీ రేట్లు అధికంగా ఉన్నప్పటికీ విదేశీ మారక ద్రవ్య చెల్లింపుల శేషం ఆశించిన రీతిలో ఉన్నది. స్టాక్ మార్కెట్‌లో బూమ్ కొనసాగటంవల్ల విదేశీ ద్రవ్య పెట్టుబడులు వర్తమాన మారకపు రేటు ప్రకారం విదేశీ ద్రవ్య నిల్వలకు అదనంగా కూడా వచ్చి చేరుతున్నాయి.

ఆ విధంగా ఆర్థిక వ్యవస్థలో వర్తమాన వృద్ధిరేటు పెరుగుతుందని ఆశించటంలో స్టాక్‌మార్కెట్ బుడగ పాత్ర ఉందనే విషయాన్ని సర్వే నిజాయితీగా గుర్తించింది. ఒకవేళ ఈ బుడగ పతనం కావటమంటూ జరిగితే విదేశీ ద్రవ్య పెట్టుబడులు దేశాన్ని వదిలిపోతాయి. అటువంటి పరిస్థితిని ఎదుర్కోవటానికి వడ్డీరేట్లను పెంచవలసి ఉంటుంది. అలా జరిగితే ఆర్థిక వ్యవస్థలో మాంద్యం నెలకొంటుంది. ఇటువంటి సంక్లిష్ట పరిస్థితిలో వున్న ఆర్థిక వ్యవస్థను బయటపడేయటానికి కావలసిన నూతన మార్గాలను అన్వేషించటంలో సర్వే అంతగా నిజాయితీ ప్రదర్శించలేదు. ఆర్థిక సర్వేను ప్రచురించటంలోగల హేతువు సంక్లిష్ట స్థితిలో ఆర్థిక వ్యవస్థ కూరుకుపోకుండా దిశానిర్దేశం చేయటమేనని వేరే చెప్పనక్కరలేదు. ఉదాహరణకు స్టాక్ మార్కెట్ బుడగ పతనం అయితే ఆర్థిక వ్యవస్థకు ప్రమాదం అని గుర్తించినప్పుడు అది కొనసాగాలనే ఆశాభావాన్ని వ్యక్తపరిస్తే సరిపోదు. అసలు ఈ బుడగపై ఆధారపడటాన్ని అధిగమించటం ఎలా అనే విషయం గురించి ఆలోచించాలి. అటువంటి పరిష్కార మార్గాన్వేషణ ఆర్థిక సర్వేలో లేకపోవటం విచారకరం.

ఇది చాలా ఆందోళన కలిగించే విషయం. ఎందుకంటే భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటును ప్రస్తుత సంక్లిష్ట పరిస్థితుల్లో కొనసాగేలా చేసేవి సర్వేలో పేర్కొన్న రెండు కారకాలే కాకుండా ఇతర కారకాలు కూడా చాలానే ఉన్నాయి. ఇందుకు సంబంధించిన ఒక స్పష్టమైన ఉదాహరణ అమెరికాలో వడ్డీ రేట్లు. ప్రస్తుత ఫెడరల్ రిజర్వ్ బోర్డు చైర్‌పర్సన్ జానెట్ యెల్లెన్ పదవిని డొనాల్డ్ ట్రంప్ పొడిగించలేదు (ఇలా ఫెడ్ చైర్ పదవీ కాలాన్ని రెండవ టర్మ్ పొడిగించకపోవటం ఇదే తొలిసారి). ఆమె స్థానంలో ఫెడ్ అధ్యక్షుడైన జెరోమి పోవెల్ యెల్లెన్ విధానాలను కొనసాగిస్తానని చెప్పినప్పటికీ ఆయన అమెరికాలో వడ్డీ రేట్లు పెంచాలనే రిపబ్లికన్ల డిమాండ్‌ను అంగీకరించే అవకాశం ఉన్నది. నిజానికి యెల్లెన్‌కు కూడా ఈ ఆలోచన ఉండేది. ఈ ఆలోచన ఆచరణలోకి రావటానికి ఎక్కువ సమయం పట్టకపోవచ్చు. అదే జరిగితే పెట్టుబడులు ఇండియావంటి దేశాలనుంచి తిరిగి అమెరికా చేరతాయి. అంటే సరిగ్గా భారతదేశంలో స్టాక్ మార్కెట్ పతనమయితే ఏమి జరుగుతుందో అమెరికాలో వడ్డీరేట్లు పెరిగితే అదే జరుగుతుంది. వీటన్నింటి పర్యవసానంగా పెట్టుబడులు దేశం విడిచి పోతాయి.

ఇరాన్‌పై ఆంక్షలు విధించాలని ట్రంప్ తీసుకోవాలనుకుంటున్న తీవ్ర నిర్ణయం పరిగణనలోకి తీసుకోవలసిన అదనపు కారకాల్లో రెండవది. అంతర్జాతీయ పరిస్థితుల దృష్ట్యా చమురు ధరలు పైపైకి ఎగబాకుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బారెల్ ధర 70డాలర్లకు చేరింది. ఈ ధోరణి తిరోగమించే సూచనలు ఏవీ కనపడటం లేదు. పైగా అమెరికాలో చమురు నిల్వలు తగ్గిపోతున్నాయి. చమురు మార్కెట్ మందగమనంతో పడిపోయిన షేల్ చమురు ఉత్పత్తి తిరిగి పుంజుకోవటం లేదు. ఈ కారణాలచేత చమురు ధరలు పెరిగే అవకాశం ఉంటుంది. ఒకవేళ ట్రంప్ గనుక ఇరాన్‌పై తాజాగా ఆంక్షలను విధించటం జరిగితే చమురు ధరలు పెరుగుతాయి. దీనితో ద్రవ్యోల్బణం, విదేశీ మారకద్రవ్యపు చెల్లింపుల శేషం, భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటు తదితర అంశాలపై ప్రతికూల ప్రభావం ఏర్పడుతుంది. మూడవది, పెరుగుతుందని ఆశిస్తున్న ఎగుమతుల వృద్ధి రేటు భారత ఆర్థిక వ్యవస్థకు ఉత్ప్రేరకంగా పనిచేయటం ఈ కింది ఒకటి లేక రెండు కారకాల కారణంగా కొనసాగకపోవచ్చు. ఇంతకుముందే పేర్కొన్నట్టు చమురు ధరలు పెరగటంతోను, అమెరికాలో వడ్డీరేట్లు పెరగటంతోను ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటు క్షీణించటం మొదటిది. అమెరికా మరింతగా రక్షిత విధానాలను అవలంబించటం మూలంగా సాఫ్ట్‌వేర్ ఔట్‌సోర్సింగ్ మీద ప్రతికూల ప్రభావం పడి భారతదేశ సేవారంగ ఎగుమతులు దెబ్బతింటాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పరిస్థితి మెరుగవుతున్నదని చెబుతున్నప్పటికీ ఐటీ సంబంధిత సేవలలో ఉపాధి ఇప్పటికే క్షీణిస్తున్నది. భారత ఆర్థిక వ్యవస్థపై ఏర్పడిన ఒత్తిళ్ళకు ఇది సూచికగా ఉన్నది. రాబోయే నెలల్లో ఈ ఒత్తిళ్ల మరింతగా పెరుగుతాయి.

తన వృద్ధి రేటు తగ్గుతుందని భావిస్తున్న చైనా ఈ విషయాన్ని తేలిగ్గా తీసుకోదు. భారతదేశం వంటి మార్కెట్లను



పట్టుకోవటంలో చైనా నిశ్చయాత్మకంగా వ్యవహరిస్తుంది. 'రక్షిత విధానం టెర్రరిజం అంత ప్రమాదకారి' అని దావోస్‌లో భారత ప్రధాని ప్రకటించారు. భారతదేశంలోని ఉత్పత్తిని, విదేశీ మారక ద్రవ్య చెల్లింపుల శేషాన్ని రక్షించుకోవటం, దుందుడుకుగా అయ్యే దిగుమతులను అడ్డగించటం వంటి విషయాలపట్ల ప్రభుత్వానికి సరియైన వ్యూహం లేదని దీనితో తేటతెల్లమౌతున్నది.

ఇటువంటి ప్రమాదాలు ఆర్థిక వ్యవస్థకు పొంచివున్న నేపథ్యంలో సర్వే ప్రతిస్పందన మౌలికంగా నిస్తేజంగా ఉన్నది. న్యాయ సంస్కరణలు, స్త్రీ-పురుష సమానత్వం, విజ్ఞాన శాస్త్ర పరిశోధనలపై వ్యయంవంటి విషయాలపై సర్వేకు చెల్లని అభిప్రాయాలు చాలానే ఉన్నాయి. అయితే ఆర్థిక వ్యవస్థకు తక్షణం ఎదురవుతున్న లేక కొనసాగుతున్న ప్రమాదాలను ఎదుర్కోవటానికి ఉద్దేశింపబడిన ఎటువంటి నిర్దిష్ట వ్యూహాలనూ ఆర్థిక సర్వే పేర్కొనలేదు.

ఈ విషయంలో చైనా వ్యూహం భారతదేశంకటే చాలా ముందున్నది. ప్రపంచ పెట్టుబడిదారీ సంక్షోభం నేపథ్యంలో అంతకుముందువలే కాకుండా దేశీయ మార్కెట్‌ను విస్తరించుకోవలసిన అవసరాన్ని, ఎగుమతుల మార్కెట్‌పై అతిగా ఆధారపడవలసిన అవసరాన్ని గుర్తించినందుకు చైనా ప్రభుత్వాన్ని ప్రజలు మెచ్చుకుంటున్నారు. సంక్షోభం తరువాత ఈ లక్ష్యాన్ని చేరుకోవటానికి బలమైన విత్త ప్రేరకాన్ని అందించటమే కాకుండా చైనా ప్రభుత్వం కార్మికుల వేతనాలను కూడా బాగా పెంచింది. అలా వేతనాలను పెంచటంతో చైనా ఎగుమతులకు పోటీనిచ్చే శక్తి సన్నగిల్లినప్పటికీ దేశీయ మార్కెట్ విస్తృతమౌతుంది. వాణిజ్య ఆధారిత మారకపు విలువ పెరగటానికి చాలాకాలం తరువాత అనుమతించటం చైనా దృక్పథంలో వచ్చిన మార్పును సూచిస్తోంది.

చైనా తన ఎగుమతులపై ఆధారపడుతుందా లేక దేశీయ మార్కెట్‌ను విస్తృత పరచటంపై తన దృష్టిని కేంద్రీకరిస్తుందా అనే విషయం ఇంకా పూర్తిగా స్పష్టం కాలేదు. అయితే భారతదేశంలోని అధికార వర్గాలలో ఈ విషయాల గురించి మౌనం రాజ్యమేలుతున్నట్టు సర్వేనిబట్టి అర్థమౌతోంది. అర్థశాస్త్రం గురించి అంతగా అవగాహన లేని బీజేపీ ప్రభుత్వానికి ఈ విషయాలు తెలియవనే చెప్పాలి. అయితే సర్వేలో వీటిలో కొన్నింటిని పేర్కొని ఉండాల్సింది. కానీ అలా జరగకపోవటం విచారకరం.

నిజానికి ఒక విషయానికి చెందిన మధ్యంతర వ్యూహం గురించి సర్వేలో చర్చ జరిగింది. ఉత్తర భారతదేశంలో తృణధాన్యాలను పండిస్తున్న రైతులకు ఇస్తున్న సబ్సిడీలకు, మద్దతు ధరలకు ప్రత్యామ్నాయంగా నగదు బదిలీలను చేయాలనే సూచన సర్వేలో ఉన్నది. ప్రపంచ వాణిజ్య సంస్థ(డబ్యూటీవో)లో అభివృద్ధిచెందిన దేశాలు డిమాండ్ చేస్తున్న నగదు బదిలీ దానిని వ్యతిరేకిస్తున్న భారత ప్రభుత్వ ప్రచురణలో మద్దతు లభించటం ఆశ్చర్యం.

దీనితో ఈ ఆర్థిక సర్వే ఎంతవరకు ప్రభుత్వ ఆలోచనలను ప్రతిబింబిస్తున్నదనే ప్రశ్న ఉదయిస్తుంది. అంతర్జాతీయ ద్రవ్య నిధితోసహా ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు వ్యక్తిగత ఆలోచనలను ఇది ప్రతిబింబిస్తున్నదా? ఎందుకంటే ఈయన గతంలో ఆ సంస్థలో పనిచేశారు కాబట్టి ఆ సంస్థ ఆలోచనలు ఆయనను ప్రభావితం చేశాయా? అనే ప్రశ్నలు తలెత్తుతాయి. లేక ఆ ఆలోచనలు ప్రభుత్వ వైఖరికి ప్రాతినిధ్యం వహిస్తున్నాయా?

ఆర్థిక సర్వే ప్రభుత్వ నియంత్రణలో లేకుండా స్వయం ప్రతిపత్తిని కలిగివున్నదని ఒక ఆసక్తికరమైన వాస్తవం తెలియజేస్తున్నది. అదేమంటే 2022 సంవత్సరంకల్లా వ్యవసాయ ఆదాయం రెండింతలు చేయాలనే ప్రభుత్వ ప్రకటిత లక్ష్యాన్ని మెచ్చుకుంటూనే ఆ లక్ష్యాన్ని చేరుకోవటానికి తీసుకోబోయే చర్యల గురించి ఆర్థిక సర్వే పట్టించుకోలేదు.

అనువాదం: నెల్లూరు నరసింహారావు
సెల్: 8886396999

బుడి బుడి అడుగులు.. హాయిగా..

ముహమ్మద్ ముజాహిద్

ఇటీవల హర్యానా రాష్ట్రం నుంచి ఒక భయంకరమైన వార్త ఒకటి వచ్చింది. ఒక స్కూలు పిల్లాడు తన క్లాస్ టీచర్‌ను తుపాకితో కాల్చి చంపేశాడు. స్కూలు పిల్లలు నేరాలకు పాల్పడిన వార్త ఇది మొదటిసారికాదు ఇలాంటి వార్తలు గతంలోనూ వచ్చాయి. కాకపోతే ఇలాంటి వార్తలు ఏ అమెరికాలోనో, మరే పాశ్చాత్య దేశాల నుంచో మనం వినేవాళ్లం. గ్లోబలైజేషన్ పుణ్యమా అని పశ్చిమ దేశాల సంస్కృతి ఇక్కడకూ పాకింది. ఈ సంఘటన మనదేశంలో మొదటి సంఘటన అనుకుంటే పొరపాటే. గతంలోనూ ఇలాంటిదే లక్నో పాఠశాలలో చోటుచేసుకుంది. ఒక విద్యార్థి తన తోటి సహవాసిని కత్తితో పొడిచి గాయాలపాలు చేశాడు. దాని కారణం తెలుసుకుని పోలీసులు, ప్రజలు నిర్ఘాంతపోయారు. తన ఫ్రెండ్‌ను చంపేస్తే స్కూల్‌కు ఒక రోజు సెలవిస్తారని ఇలా చేశానని నిందితుడైన ఆ విద్యార్థి చెప్పాడు.

హర్యానా సంఘటన కూడా ఇక్కడ చెప్పాలి. రయ్యాన్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థి హత్యచేయబడ్డాడు. నోయిడాలో ఒక విద్యార్థి తన తల్లీ అక్క ప్రాణాలు తీసుకున్నాడు. చదువు విషయంలో ఒత్తిడి చేస్తున్నారని కసి పెంచుకుని ఈ పని చేశానని ఆ కుర్రాడు ఒప్పుకున్నాడు.

పిల్లల్లో నేర ప్రవృత్తి ఇప్పుడు చాలా వేగంగా పెరుగుతోంది. కొన్ని రోజుల క్రితం సోషల్ మీడియాలో ఓ కుర్రాడి వీడియో హల్ చల్ చేసింది. హైదరాబాద్‌కు చెందిన ఒక కుర్రాడు పోలీస్ స్టేషన్‌కు తన తల్లిదండ్రులపై కేసు పెట్టడానికి వెళ్లాడు. మా అమ్మానాన్నలను కస్టడీలోకి తీసుకుని కఠినంగా శిక్షించండని పోలీసు అధికారులను కోరాడు. ఎందుకంటే మా అమ్మానాన్నలు నన్ను మా ఫ్రెండ్స్‌తో ఎగ్జిబిషన్‌కు పంపడం లేదనే కారణం చెప్పాడు. ఆ బుడతడికి పోలీసులు నచ్చచెప్పి ఎగ్జిబిషన్ చూపించి తల్లిదండ్రులతో మాట్లాడి సమస్య పరిష్కరించారు.

ఢిల్లీకి చెందిన ఒక టీచర్ తన స్కూల్లో సంఘటన ఇలా తెలిపారు.. '9వ తరగతిలో ఒక విద్యార్థికి మార్కులు తక్కువ వచ్చినందుకు మందలించాను. దానికి ఆ విద్యార్థి ఆందోళనతో రోదించడం మొదలెట్టాడు ఓదార్చాను. ఆ పిల్లాడు కాసేపాగి "నాకు చదువుల్లో చాలా టెన్షన్‌గా ఉంటోంది. మా అమ్మానాన్న స్కూలు విడిచాక మూడు చోట్ల ట్యూషన్ చెప్పిస్తున్నారు. దాంతో నేను అయోమయానికి గురవుతున్నాను. కాస్తంత ఉపశమనం లేదు, ఆటలు అసలే లేవు.' అని చెప్పాడు. ఈ సమస్య కేవలం ఆ ఒక్క విద్యార్థిదే కాదు. ఇంచుమించు పిల్లలందరిదీ ఇదే పరిస్థితి. పిల్లల్ని రోబోల్లా మార్చేస్తున్నారు. ఆటపాటలు లేకుండా యంత్రాల్లా పుస్తకాల పురుగుల్లా పెంచుతున్నారు. మానసిక ఉల్లాసం లేకుండా పెంచుతున్నారు. బాల్యాన్ని హరించేస్తున్నారు. ఆడుతూపాడుతూ చదివే పాఠాలను కఠినంగా మార్చేస్తున్నారు. ఉరుకుల పరుగుల సిటీ లైఫ్ పేరెంట్స్ అయితే పిల్లల గురించి పట్టించుకోవడం లేదు. పేరెంట్స్ ఇద్దరూ ఉద్యోగాలు చేస్తూ పిల్లల్ని ట్యూషన్‌లకు, టీవీలకు, ఇంటర్నెట్‌లకు ఇలా ఎవరి మానాన వాళ్ల వదిలేస్తున్నారు. ఇలాంటి వైఖరి కూడా పిల్లల్లో నేర ప్రవృత్తికి, మానసిక రుగ్మతలు పెరగడానికి కారణమని నిపుణులు చెబుతున్నారు. నేటి పేరెంట్స్ తమ పిల్లల గురించి బొత్తిగా తెలుసుకోలేకపోతున్నారని పలువురు మానసిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. కొందరు పేరెంట్స్ తమకున్న డబ్బుతో అత్యంత ఖరీదైన స్కూల్లో చేర్పించి బాధ్యత తీరిపోయినట్టు వ్యవహరిస్తున్నారు. పిల్లల అలవాట్లు, స్నేహితులు, స్కూలు వాతావరణం గురించి ఆరాతీయడం లేదు. కావాల్సినంత డబ్బు ముట్టచెప్పి పనైపోయినట్టు చేతులు దులుపుకుంటున్నారు. స్కూలు నుంచి ఇంటికి రాగానే రకరకాల ట్యూషన్లతో ఇంటిదగ్గర పేరెంట్స్‌తో గడిపే అవకాశాలకూ గండికొడుతున్నారు. పిల్లలతో రోజూ కాసేపు గడపడం, వాళ్ల సాధకబాధకాలు వినడం చేయాల్సిన బాధ్యత నేటి తల్లిదండ్రులకు లేదా? గత 30ఏండ్లుగా ఈ ధోరణి చాపకింద నీరులా పెరుగుతూ ఇప్పుడు పరాకాష్టకు చేరింది.

పిల్లల్లో చదువుపట్ల లేనిపోని ఒత్తిడి పెంచి వాళ్లల్లో భయాందోళనలు, అభద్రతాభావం, కుంగుబాటు పెరుగుతోంది. పిల్లల మనోభావాలను గౌరవించాలి. వాళ్లతో ప్రేమ, ఆప్యాయతలతో మెలగాలి. వాళ్ల సమస్యను శ్రద్ధగా విని పరిష్కరించాలి. వాళ్లల్లో ధైర్యసాహసాలు నూరిపోయాలి. ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలి. సెలవుల్లో అదనపు క్లాసుల పేరుతో వాళ్ల స్వేచ్ఛను హరించరాదు. నాలుగు రోజులు సెలవులొస్తే చాలు వాళ్లకు బండెటంత హోమ్ వర్క్ ఇచ్చి సెలవుల్లో ఆటపాటలకు బ్రేక్ వేయడం తగదు. ఆటపాటలు కూడా పిల్లల మానసిక, శారీరక వికాసంలో కీలకపాత్ర పోషిస్తాయని మరువకూడదు. విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న పాశ్చాత్య సంస్కృతి సంప్రదాయాలను చెల్లుచీటి చెప్పాలి. పిల్లల్ని ఐదేండ్ల వరకూ తల్లిదండ్రుల కౌగిలిలో, వాళ్ల ప్రేమ ఆత్మీయత వెచ్చదనంలో పెంచాలి. మన పిల్లల్లో నైతిక విలువలను పెంపొందించే, మానసిక వికాసాన్ని కలిగించే విద్యావ్యవస్థను రూపొందించుకోవాల్సిన తరుణం ఆసన్నమైంది. బుడి బుడి అడుగులకు బ్రేక్ వెయ్యకండి. వాళ్లను ఎదగనియ్యండి.. హాయిగా ఆడనీయండి..!

అంతా మాటల్లోనే... కేటాయింపుల్లో లేదు




జె. జగదీష్

కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ మాటలకు కేటాయింపులకు ఎక్కడా పొంతన లేదు. కొత్తగా ప్రకటించిన కొన్ని పథకాలకు నిధులే కేటాయించకపోగా, కొన్ని పథకాలకు బడ్జెట్‌లో కొసరు నిధులను మాత్రమే కేటాయించారు. ఇక వ్యవసాయాభివద్ధి, గ్రామీణ సంక్షేమాభివద్ధి పథకాలకు గతేడాది కంటే తక్కువ కేటాయింపులున్నాయి. మరికొన్ని పథకాలకు బాగా తగ్గించారు. మరికొన్ని రంగాలకు గతేడాదిలాగే కేటాయించారు. గ్రామీణాభివృద్ధికి పెద్ద పీట వేశామని ప్రధాని మోడీ, జైట్లీ, ఇతర కేంద్ర మంత్రులు ఊదరగొడుతున్నారు. బడ్జెట్ ప్రసంగంలో జైట్లీ "రైతులు, పేదలు, గ్రామీణం, వ్యవసాయం, మహిళలు" అన్న పదాలే ఎక్కువ సార్లు నొక్కి పలికారు. ఆయా పదాలు ఉచ్చరణ సందర్భంలో హిందీనే ఉపయోగించేవారు. గ్రామీణ పేదలకు, రైతులకు, మహిళలకు జైట్లీ బడ్జెట్ అర్థం కావాలని అలా చేశారేమో. అందుకనే ప్రసంగంలో అమోఘంగా ప్రకటించిన అంశాలకు కేటాయింపుల్లో మాత్రం మొండిచెయ్యి చూపించారు. ఎందుకుంటే వారందరు టీవీల్లో ప్రసంగం విన్నారేతప్ప, జైట్లీ బడ్జెట్ పుస్తకాలు తిరగేసి వాటిలో తమకు ఎంత కేటాయించారనేది వారు చూడరు కనుక. విన్నదే ఆ పేదలు నిజమనుకుంటారని బీజేపీ ఎత్తుగడ. కానీ వాస్తవం దాచాలన్నా దాగదు. బడ్జెట్ కేటాయింపులు చూస్తే.. 2017-18 బడ్జెట్‌లో గ్రామీణాభివృద్ధికి కేటాయింపులుంటే 6.11 శాతం, 2018-19 బడ్జెట్‌లో 5.65శాతం మాత్రమే కేటాయించారు. ఇదేనా పెద్దపీట?

ఇది వ్యవసాయ బడ్జెటని, రైతుల జీవితాల్లో వెలుగునింపే బడ్జెటని ప్రగల్భాలు పలికే నేతలు కేటాయింపుల్లో మాత్రం దానికనుగుణంగా చేయలేదు. వ్యవసాయ రంగానికి గతేడాది బడ్జెట్‌లో 2.55శాతం కేటాయింపులుంటే, ప్రస్తుతం 2.61శాతం కేటాయింపులు ఉన్నాయి. ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎం.ఎస్ స్వామినాథన్ సిఫార్సుల మేరకు పెట్టుబడికి ఒకట్నర రెట్లు మద్దతు ధర కల్పిస్తామని ప్రకటించిన జైట్లీ కేటాయింపులు మాత్రం అరకొరగా చేస్తే ఎలా? ప్రస్తుత కేటాయింపులతో మద్దతు ధర సాధ్యమా? జైట్లీ ప్రసంగంలో కూడా మద్దతు ధర అమలుకు నిర్మాణాత్మక చర్యలేమీ ప్రకటించలేదు. అది కాక గతేడాది బడ్జెట్‌లో కూడా ఇలానే మద్దతు ధర గురించి ప్రసంగించారు.

సామాజిక రంగానికి సంబంధించిన స్కీమ్‌లకు కేటాయింపులు 2016-17 బడ్జెట్‌లో ఈ కేటాయింపుల 21.4శాతంగా ఉంటే, ఈ బడ్జెట్‌లో 14.5శాతం మాత్రమే. గ్రామీణ వ్యవసాయ, మత్స్యకారుల అభివద్ధి కోసం మంత్రి జైట్లీ అట్టహాసంగా "ఫిషరీస్ ఆక్వా కల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్"ను పదివేల కోట్లతో ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. అయితే ఆ నిధికి ప్రస్తుత బడ్జెట్‌లో కేవలం రూ.47 కోట్లు మాత్రమే కేటాయించారు. ప్రస్తుతం దేశంలో వున్న 585 వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ కమిటీల యార్డులను అభివద్ధి చేయడంతో పాటు కొత్తగా 22 వేల గ్రామీణ మార్కెట్ యార్డుల ఏర్పాటుకు మార్కెట్ మౌలిక సౌకర్యాల అభివద్ధి నిధికి రెండువేల కోట్ల రూపాయలను ఆర్థిక మంత్రి ప్రకటించారు. ఈ నిధుల కేటాయింపుల గురించి జైట్లీ ప్రసంగంలోగానీ, బడ్జెట్ ప్రతిపాదనల్లోగానీ ప్రస్తావనే లేదు. ఈ నిధులను ఎక్కడి నుంచి తీసుకొస్తారు? గ్రామీణులు ఇండ్లల్లో విద్యుత్ వెలుగులు నింపేందుకు తీసుకొచ్చిన "ప్రధాన మంత్రి సౌభాగ్య యోజన" కోసం రూ.16వేల కోట్లను కేటాయించిన విషయం తెల్సిందేనని జైట్లీ చెప్పారు. వాస్తవానికి 2017-19 వరకు అంటే, రెండేండ్లకు కేంద్రం ఇప్పటికే రూ.16,320 కోట్లు మంజూరుకు అనుమతి తెలిపింది. ఆ మొత్తంలో 12,320 కోట్ల కేంద్రం వాటాకాగా, మిగతా సొమ్మును ఆయా రాష్ట్రాలు చెల్లించాల్సి ఉంది. ఆ మొత్తంలో 2017-18 సంవత్సరానికి కేంద్రం



రూ.3,600 కోట్లను విడుదల చేయాల్సి ఉండగా, కేవలం రూ. రెండు వేల కోట్లు విడుదల చేసింది. 2018-19 సంవత్సరానికి రూ.8,720 కోట్లను విడుదల చేయాల్సి ఉండగా, బడ్జెట్‌లో రూ.3,500 కోట్లను మాత్రమే కేటాయించింది. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సౌకర్యం కోసం అమలు చేస్తున్న "దీన్ దయాల్ ఉపాధ్యాయ్ గ్రామ్ జ్యోతి యోజన" అనే మరో కేంద్ర విద్యుత్ పథకానికి ఈసారి 30శాతం నిధులను తగ్గించారు. గ్రామీణ ప్రాంతాల్లో వెదురు పంటను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో రూ.1290 కోట్లతో "జాతీయ వెదురు మిషన్"ను ఏర్పాటు చేస్తున్నట్టు మంత్రి తెలిపారు. అయితే బడ్జెట్‌లో మాత్రం అందుకు రూ.300 కోట్లను మాత్రమే కేటాయించారు. పేద ప్రజల సొంతింటి కలను పరిపూర్ణం చేసేందుకు ప్రవేశపెట్టిన "ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం" కింద 51 లక్షల ఇండ్లను నిర్మించేందుకు కేటాయింపులను గతేడాదికన్నా తగ్గించారు. గతేడాది రూ.23 వేల కోట్లను కేటాయించగా, ఈసారి రూ.21 వేల కోట్లతో సరిపెట్టారు. ఇక కేంద్ర ప్రభుత్వం బహత్తర పథకమైన "మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం"కు కూడా ఈసారి కేటాయింపులు పెంచలేదు. గతంలోలాగానే రూ.56,000 కోట్లకు పరిమితం చేశారు. ఇలా ఏ పథకాన్ని తీసుకున్నా గతం కంటే కేటాయిం పులు ఎక్కువగా లేవు. బడ్జెట్‌లో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ అభివద్ధిపై ఎలాంటి దృష్టి లేదు.

వైద్య, ఆరోగ్య రంగంలోనే విప్లవాత్మకమైన బడ్జెట్‌గా ప్రధాని కీర్తించారు. ప్రపంచంలోనే ఈ బడ్జెట్‌లో ప్రకటించిన హెల్త్ బీమా చరిత్ర సృష్టించినట్టని కేంద్రమంత్రులు డాంబికాలు వదిలారు. దేశంలో 10 కోట్ల పేద కుటుంబాలకు లబ్ది చేకూరేలా జాతీయ ఆరోగ్య పరిరక్షణ పథకాన్ని ప్రవేశపెడుతున్నట్టు, దీని కింద ఒక్కో కుటుంబానికి ఏటా గరిష్టంగా రూ.5లక్షల వైద్య బీమా సదుపాయం కల్పిస్తున్నామని జైట్లీ ప్రకటించారు. కానీ వాస్తవానికి చూస్తే కేటాయింపులేమీ పెరగలేదు. గతేడాది బడ్జెట్‌లో 2.04శాతం నిధులు కేటాయిస్తే, ఈ ఏడాది బడ్జెట్‌లో 2.24శాతం కేటాయించారు. ఆరోగ్య రంగానికి కేటాయింపుల పెంపు 2.8శాతం మాత్రమే ఉంది. గతేడాది బడ్జెట్‌లో ఈ పెంపు ఏకంగా 36.5శాతంగా ఉండింది. అది కూడా ఆరోగ్య బీమాకు సంబంధించి ఇప్పటి వరకు ఉండే అనేక బీమా పథకాలను కలిపి జాతీయ ఆరోగ్య పరిరక్షణ పథకం తీసుకొచ్చారు. అంతేతప్ప ఇదేమీ కొత్తది కాదు. పేరు మాత్రమే మారింది. పెన్షన్స్‌లో కూడా ఈసారి కేటాయింపులు తగ్గించారు. గతేడాది బడ్జెట్‌లో 6.65 శాతం నిధులు కేటాయిస్తే, ఈఏడాది బడ్జెట్‌లో 6.09శాతం కేటాయించారు. విద్యారంగంలో అనేక మార్పులు చేశామని, బ్లాక్ బోర్డు నుంచి డిజిటల్ బోర్డు అని గొప్పలు చెప్పుకొంటున్న ప్రభుత్వ పెద్దలు కేటాయింపుల్లో మాత్రం ఆ గొప్పతనాన్ని చూపించలేక పోయారు. గతేడాది విద్యా రంగానికి 3.69శాతం కేటాయిస్తే, ఈ ఏడాది 3.48 శాతమే కేటాయించారు.

రక్షణ రంగానికి 2017-18 బడ్జెట్‌లో 12.04శాతం నిధులు కేటాయిస్తే.. ఇప్పుడు 11.58శాతం కేటాయించారు. జైట్లీ ప్రసంగంలో జమ్ము కాశ్మీర్, ఈశాన్య రాష్ట్రాల్లో రక్షక దళాలు విరోచిత పోరు సాగిస్తున్నాయని, అది అభినందనీయమని పేర్కొన్నారు. కానీ రక్షణ రంగానికి కేటాయింపులు చూస్తే మాత్రం ప్రసంగానికి, కేటాయింపులకు పొంతన లేదనిపిస్తోంది. దేశ సరిహద్దుల్లో, మంచు కొండల్లో దేశం కోసం పనిచేసే రక్షక దళాలకు జీతాలు పెంచితే బాగుండేది. ఇప్పటికే ఏడవ వేతన సంఘంలో కూడా తమకు అన్యాయం జరిగిందని ఆర్మీ, ఇతర రక్షక దళాల ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేశారు. వాస్తవానికి దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఉద్యోగుల జీతభత్యాలు పెరుగుదల మోడీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వంలో వచ్చిన ఏడవ వేతన సంఘంలోనే అతి తక్కువ అని చెప్పాలి.

న్యూఢిల్లీ.

బాల్యంలోకి మరోమారు

"అమ్మమ్మ బంగారువే.. అందాల చిన్నారివే...
అంజలి అంజలి అంజలి చిలికే నవ్వుల పువ్వుల జాబిలి...
మెరిసే పున్నమి వెన్నెల జాబిలి
....
వన్నెలు విరిసిన సిరిమల్లి
చుక్కల పందిరి నీ ముచ్చటలే
ఆమని శోభలు నీ మురిపాలే"

ఫ్యాషనబుల్ స్కర్ట్స్ వేసుకోగానే బాల్యాన్ని గుర్తు చేసే పాట తలపుల్లోకి వస్తుంది! అమ్మాయిలు ఎదిగినా అమ్మ కంటికి చిన్న పిల్లలే! అందమైన ఎంబ్రాయిడరీతో తయారు చేసిన ఫ్యాషనబుల్ స్కర్ట్స్‌ను ఓ సారి ప్రయత్నించి చూడండి! బాల్యంలోకి మరోమారు తొంగిచూడండి!



నవ్వులు పూయించి...



కల్పనా రాయ్ (9 మే, 1950 - 6ఫిబ్రవరి, 2008)

వెండితెరపై నవ్వుల పువ్వులు పూయించిన ప్రముఖ తెలుగు హాస్యనటి కల్పనారాయ్. పాత్ర ఏదైనా స్క్రీన్‌పై ఆమె కనిపిస్తే చాలు.. ప్రేక్షకుల ముఖాలపై చిరునవ్వు కనిపిస్తుంది. తన భారీశరీరంతో.. హావభావాలతో కడుపుబ్బనవ్వించే నటి ఆమె.

WOMEN of the day

'ఓ సీత కథ' చిత్రంతో తెలుగు చిత్రరంగంలోకి ప్రవేశం చేసిన ఆమె తన జీవితకాలంలో దాదాపు 430 చిత్రాలలో నటించారు. పశ్చిమగోదావరి జిల్లా కాకినాడలో జన్మించిన ఆమె చిత్రపరిశ్రమలో హాస్యనటిగా స్థిరపడ్డారు. క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా మంచి పేరు సంపాదించినప్పటికీ ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడ్డారు. తనకంటూ ఎలాంటి ఆస్తులు సంపాదించుకోలేదు.

ఆమె నటించిన సినిమాల్లో మధుమాసం (2007), ఇట్లు శ్రావణి సుబ్రహ్మణ్యం (2001), ప్రియమైన నీకు (2001), బాచి (2000), కలిసుందాం రా (2000), పెళ్ళిసంబంధం (2000), ప్రేమించుకుందాం రా (1997), ఆపద్బాంధవుడు (1992), జానకి రాముడు (1988), ఆఖరిపోరాటం (1988), కెప్టెన్ నాగార్జున (1986), కారు దిద్దిన కాపురం (1986), శ్రీమతి కావాలి (1984), ఆడవాళ్ళు అలిగితే (1983) మొదలైన సినిమాలు ఆమెకు మంచి గుర్తింపునిచ్చాయి. ఎన్నో పాత్రలతో ప్రేక్షకుల మనసుల్లో నిలిచిన పోయిన ఆమె ఆర్థిక ఇబ్బందులతో అనారోగ్యం బారిన పడి చివరి శ్వాస వదిలారు.


బరువు తగ్గడం లేదా..?



మారిన ఆహారపు అలవాట్లు, జీవన విధానాల వల్ల శరీర బరువు విపరీతంగా పెరుగుతున్నారు. ఈ పరిస్థితుల్లో బరువు తగ్గించుకోవడానికి ఎంతో మంది ఎన్నో ప్రయత్నాలు చేస్తుంటారు. కానీ బరువు తగ్గరు. ఎన్ని చేసినా బరువు తగ్గడం లేదని బాధపడుతుంటారు. నిజానికి బరువు తగ్గాలనుకునే వారు కచ్చితంగా కొన్ని నియమాలు పాటించాలి. ఆ నియమాలెంటో చూద్దాం...

- బరువు తగ్గడం కోసం కొంతమంది సరైన ఆహారాన్ని తీసుకోకపోతే మరి కొంతమంది పూర్తిగా ఆహారాన్ని మానేస్తుంటారు. మరికొందరు మితీమిరిన వ్యాయామాలు చేసి ప్రాణాల మీదకు తెచ్చుకుంటారు. అసలు బరువు తగ్గడమంటే తినేది తగ్గించడం కాదు. శరీరంలో ఉండే కొవ్వును కరిగించుకోవడం. దీని కోసం ఆకలిగా అనిపించినప్పుడు మాత్రమే ఆహారాన్ని తీసుకోవాలి.
- ఉదయాన్నే టిఫిన్ కచ్చితంగా తినాలి. అతిగా వ్యాయామం చేయడం మంచిది కాదు. ఆకలి వేసినప్పుడు పండ్లు, జ్యూసులు తీసుకోవడం మంచిది.
- ఆఫీసు, ఇంట్లో మెట్లు ఎక్కిదిగడం, భోజనం చేసిన తర్వాత కాసేపు నడవడం, పని చేసే చోట చిన్నపాటి వ్యాయామలు వంటివి క్రమం తప్పకుండా చేస్తూ ఉండాలి.
- పెద్ద ప్లేట్ లో కాకుండా చిన్న ప్లేట్‌లో భోజనం చేయడం మంచిది. ఇలా చేయడం వల్ల భోజనం తక్కువగా తీసుకుంటారు. మానసికంగా ప్రశాంతంగా ఉండటం కూడా కీలకం.
- హార్మోన్ల అసమతుల్యత వల్ల కూడా బరువు పెరుగుతారు. అలాంటి సమయంలో వైద్యుల సలహా మేరకు ఆహార పదార్థాలను ఎంచుకుంటే సరిపోతుంది.

ప్రయత్నించి చూడండి!



చుండ్రు సమస్యతో ఇబ్బందిపడే వారు ఎన్నో రకాల షాంపూలను ఉపయోగిస్తారు లేదా ప్రత్యేకంగా ట్రీట్‌మెంట్ తీసుకుంటారు. అయితే అలా చేయడం వల్ల ఎన్నో సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయి. అందుకే చుండ్రు నివారణకు సహజ సిద్ధంగా ఉండే నిమ్మనూనె, తులసి నూనె, టీ ట్రీ నూనె వంటివి ఉపయోగించటం వల్ల ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని చెబుతున్నారు నిపుణులు.

నిమ్మకాయ నూనె: నిమ్మలో ఔషధ గుణాలు చాలా ఉంటాయి. జిడ్డును, అంటువ్యాధులను నివారిస్తుంది. అలాగే నిమ్మ నూనె జుట్టును అందంగా, ఆరోగ్యంగా ఉంచుతుంది. చుండ్రు సమస్య ఎక్కువగా ఉన్న వారు వారానికి మూడు సార్లు నిమ్మకాయ నూనెను తలకు పట్టిస్తే చుండ్రు సమస్య క్రమంగా తగ్గుతుంది.

టీ ట్రీ నూనె: ఇది ప్రకృతి సహజ లక్షణాలను కల్గి ఉంటుంది. అలాగే యాంటీ బ్యాక్టీరియల్‌గా పని చేస్తుంది. దురదను, చుండ్రును తొలగించటంలో దీని పాత్ర కీలకం. టీ ట్రీ నూనెలో జోజోబా, ఆలివ్ నూనెలను కలిపి తలకు పట్టించినా మంచి ఫలితం ఉంటుంది.

తులసి నూనె: చుండ్రును నివారించటంతో పాటు రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. అలాగే జుట్టు ఊడిపోకుండా కాపాడుతుంది. చర్మ సంరక్షణకు, జుట్టు పెరగటానికి తులసి నూనె చాలా ఉపయోగపడుతుంది.

ఇట్లా చేద్దాం

రెండు చెంచాల ధనియాలను తీసుకుని పొడర్‌గా చేసి ఒక గ్లాస్ నీటిలో వేసుకుని తాగితే శరీరంలో ఉండే కొలెస్ట్రాల్ కంట్రోల్ అవుతుంది.

బాల్కనీ అందానికి...



బాల్కనీని అలంకరించేందుకు మొదటి స్టెప్ ఫ్లోరింగ్ అని చెప్పవచ్చు. సరైన ఫ్లోరింగ్ ఉపయోగించుట వలన బాల్కనీ అందం మరింత రెట్టింపవుతుంది. బాల్కనీ ఫ్లోరింగ్ తెలుపు లేదా లేత రంగు గులాబీ మొక్కలను ఉపయోగించటం వలన ఇల్లు మోడ్రన్‌గా కనిపిస్తుంది.

- బాల్కనీ అలంకరించేందుకు సరైన మొక్కలను ఎంచుకోవలసిన అవసరం ఉంది. తాజాగా ఉండే బలమైన మొక్కలను, లావెండర్ మొక్కలు వేయుట వలన బాల్కనీ ఆకర్షణీయంగా కనిపిస్తుంది.
- మొక్కలు మానసిక ఒత్తిడిని తగ్గించి, విశ్రాంతిని కలిగిస్తాయి. కాబట్టి మొక్కలను ఇంట్లో పెంచుకోవడం మంచిది. ఇప్పటికే బాల్కనీలో నాటిన మొక్కలు ఉంటే కొన్ని జాగ్రత్తలు పాటించాలి. రాలిపోయిన ఆకులను ఎప్పటికప్పుడు తొలగించాలి.
- మొక్కలను డాబా అంచుల మీద పెంచటం వలన ఇల్లు, బాల్కనీ అందంగా కనిపిస్తుంది. అంతేకాదు డాబా మీద మొక్కలను పెంచడం వలన బాల్కనీ మరింత విశాలంగా కనిపిస్తుంది.
- బాల్కనీ ఖాళీగా, పెద్దగా ఉంటే అంచుల వెంబడి పూల కుండీలను పెట్టుకోవచ్చు. బాల్కనీ చిన్నగా ఉంటే తీగ మొక్కలను వేసుకోవడం మంచిది. తీగ మొక్కల వల్ల బాల్కనీ చాలా ఆకర్షణీయంగా కనిపిస్తుంది.

రక్షణ కోసం మోడ్రన్ దండి మార్చ్



ఓసారి తల్లీ కూతుళ్ళు సామూహిక అత్యాచారానికి గురయ్యారని పేపర్లో చదివింది సృష్టి. అప్పటి నుంచి ఆమె మనసు మనసులో లేదు. దేశంలో అమ్మాయిలకు రక్షణ కావాలి. దాని కోసం తన వంతుగా ఏం చేయాలని ఆలోచించింది. గ్రామగ్రామానికి తిరిగి ప్రచారం చేయాలనుకుంది. దానికి ఆమె ఎంచుకున్న మార్గం నడక. తన అడుగులు ప్రారంభించడానికి ముందు ఏడాది పాటు ప్రాక్టీస్ చేసింది. ఆ తర్వాతనే తన ప్రయాణం మొదలుపెట్టింది.

తన లక్ష్యం ఒకటే ఆడపిల్లలకు రక్షణ. సమాజంలో ఆడిపిల్లలపై రోజురోజుకు దాడులు పెరిగిపోతున్నాయి. హింస పెరిగిపోతున్నది. తన ప్రతి అడుగు వాటన్నింటినీ ప్రశ్నించింది. మహిళల్లో చైతన్యాన్ని నింపింది. తనకు తోచిన రీతిలో అవగాహన కలిగించింది. దేశంలోని మహిళను శక్తి వంతం చేయడం కోసం, మహిళా సాధికరత కోసం... ఆమె వేసిన ప్రతి అడుగూ వీటినే కోరుకుంది.

తన ప్రయాణం పూర్తి చేసిన తర్వాత 'మోడ్రన్ డే దండి మార్చ్' పేరుతో ఓ విడియో కూడా విడుదలచేసింది. ప్రస్తుతం ఇది వెబ్‌సైట్‌లో ప్రసారం అవుతుంది. భారతదేశంలోని మహిళలు ఎటువంటి భయం లేకుండా స్వేచ్ఛగా బతకాలనుకుంది. అందుకు అవసరమైన సమాజాన్ని సృష్టించడమే ఆమె లక్ష్యం.

తన ఈ ప్రయాణంలో మహిళలను చైతన్య పరుస్తూ 60 వర్క్ షాపులను నిర్వహించింది. తన అడుగులు పూర్తయ్యే సరికి సుమారు 110 వర్క్ షాపుల వరకు నిర్వహించాలని ఆమె అంచన. వీటిలో మహిళ ఆర్థిక స్వాతంత్ర్యం, డిజిటల్ ఎడ్యుకేషన్, మహిళల ఆరోగ్యం, పరిశుభ్రత, లింగ వివక్ష, మహిళా సాధికారత గురించి వివరించింది. కేవలం వర్క్ షాప్‌లే కాకుండా స్ఫూర్తిదాయకమైన కళారూపాలను ప్రొజెక్టర్ ద్వారా 30 ప్రదర్శనలు ఇచ్చారు. అలాగే బెంగుళూరులో ఒక డాక్యుమెంటరీ చిత్రాన్ని కూడా ఈ సందర్భంగా రూపొందించారు.

సృష్టి తన అడుగులు మొదలుపెట్టిన 70వ రోజుకు హైదరాబాద్ చేరుకుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'ఈ 70 రోజుల నా ప్రయాణంలో నేను గుర్తించిన సమస్యలు లింగవివక్ష, వరకట్నం, మద్యం. ఇవి రోజురోజుకు మహిళలను సమస్యల్లోకి నెట్టేస్తున్నాయి. రక్షణ లేకుండా చేస్తున్నాయి. వీటికి పరిష్కారం దొరకాలంటే మహిళలకు ఆర్థిక స్వేచ్ఛ ఉండాలి. ఇలా జరగాలంటే ప్రస్తుతం ఉన్న టెక్నాలజీ మహిళలకు అందుబాటులోకి రావాలి. అవకాశాలు కల్పిస్తే స్త్రీలు ఏమైనా సాధించగలరు. అందుకే నా ప్రయాణంలో మహిళలను ఆర్థికంగా బలపరచడానికి వారికి సాంకేతిక విద్యను అందించే ప్రయత్నం చేస్తున్నాను' అన్నది.



2017, సెప్టెంబర్ 14న సృష్టి బక్షీ కన్యాకుమారి నుంచి తన మొదటి అడుగు ప్రారంభించింది. 260 రోజుల తర్వాత శ్రీనగర్‌లో 3,800 అడుగులతో తన ప్రయాణాన్ని పూర్తి చేయాలని ఆమె కోరిక. తన ఈ ప్రయాణంతో యావత్ భారతదేశాన్ని ఆశ్చర్య పరుస్తోంది. ఇంతకీ ఆమె వేస్తున్న ఈఅడుగులు ఎటువైపు... ఎవరి కోసం ఆమె చేస్తున్న ఈ సాహసం.

రోజూ ఉదయం 5 గంటలకు సాగుతున్న ఆమె ప్రయాణం ఒక్క రోజులో 25 కిలీమీటర్లు నడుస్తున్నది. తన ఈ ప్రయాణంలో 60 వేల మంది మహిళలను కలవాలని ఆమె టార్గెట్ పెట్టుకుంది. మహిళాభ్యుదయం కోసం సృష్టి చేస్తున్న ఈ ఉద్యమానికి ప్రేక్షకులే నిధులు సమకూర్చుతున్నారు. దీని కోసం ఒక మొబైల్ యాప్‌ను కూడా ఆమె క్రియేట్ చేశారు. దీని ద్వారా ఎంతోమంది ఆమె చేస్తున్న ఈ ఉద్యమంలో పాల్గొన్నారు. నిధులు సమకూర్చారు. తను చేస్తున్న ఈ సాహస యాత్రకు సుమారు కోటి రూపాయల వరకు ఖర్చు అవుతుందని అంచన. మహిళలను శక్తి వంతులుగా చేయాలనే ఉద్దేశంతో చేస్తున్న ఈ యాత్ర విజయవంతంగా కావాలని, తను కోరుకున్న మార్పు ఈ సమాజంలో రావాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారు.

నాస్ పరీక్షకు 79,423 మంది హాజరు

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

అభ్యసన ఫలితాలను అంచనా వేసేందుకు పదో తరగతి విద్యార్థులకు పాఠశాల విద్యాశాఖ సోమవారం నిర్వహించిన నేషనల్ అఛీవ్‌మెంట్ సర్వే(నాస్)-2018 ప్రశాంతంగా ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా 2481 ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేటు పాఠశాలల్లో నిర్వహించిన ఈ పరీక్షకు 79,423 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 42,292 మంది బాలికలు కాగా, 37,131 మంది బాలురు ఉన్నారు. గణితం, ఇంగ్లీష్, సైన్స్, సోషల్ స్టడీస్, మోడర్న్ ఇండియన్ లాంగ్వేజీ సబ్జెక్టుల్లో ఈ పరీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. కాగా ఈ సర్వేలో తెలంగాణ నుంచి 92,978 మంది పాల్గొంటారని ముందుగా విద్యాశాఖ అధికారులు అంచనా వేయగా, వివిధ కారణాలతో 13,555 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

ఎస్సీ సంక్షేమానికి రూ.5వేల కోట్లు

- ఆర్థిక శాఖకు ఎస్సీ సంక్షేమ శాఖ ప్రతిపాదనలు
- నిర్మాణ రంగానికి ప్రాధాన్యం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎస్సీ సంక్షేమానికి వచ్చే వార్షిక బడ్జెట్‌లో రూ. 5,650 కోట్లు కేటాయించాలని ఎస్సీ సంక్షేమ శాఖ ఆర్థిక శాఖకు ప్రతిపాదనలు అందజేసింది. ఇందులో ఎస్సీ అభివృద్ధి శాఖకు రూ.2,450 కోట్లు, గురుకుల సొసైటీకి రూ.1550 కోట్లు, ఎస్సీ కార్పొరేషన్‌కు రూ.1650 కోట్లు కేటాయించనుంది. గురుకుల సొసైటీలకు కేటాయించిన నిధుల్లో రూ.600 కోట్లు పాఠశాలలకు సొంత భవనాలు, రూ.400 కోట్లు ఎస్సీ సంక్షేమ వసతి గృహాలకు సొంత భవనాలకు వినియోగించేందుకు ప్రణాళిక రూపొందించారు. ఎస్సీ కార్పొరేషన్‌కు కేటాయించే రూ.1650 కోట్లలో స్వయం ఉపాధి పథకాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి రుణాలు అందజేయనున్నారు.

కొత్త పథకాల్లేవ్

ఈ వార్షిక బడ్జెట్‌లో ఎస్సీ సంక్షేమ శాఖ ఎలాంటి కొత్త పథకాలను ప్రకటించలేదు. ప్రస్తుతం ఉన్న వాటినే కొనసాగించేందుకు నిధులు కేటాయించాలని ఆర్థిక శాఖకు విజ్ఞప్తి చేసింది. 2017 -18 వార్షిక బడ్జెట్‌లో ఎస్సీ సంక్షేమ శాఖకు రూ.4,386 కోట్లు కేటాయించిన విషయం తెలిసిందే.

దేశంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ నెంబర్ వన్

- ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ రెవెన్యూ శాఖ దేశంలోనే నంబర్‌వన్‌గా ఉందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, రెవెన్యూ శాఖ మంత్రి మహ్మద్ మహమూద్ అలీ అన్నారు. మార్చి 11 నుంచి తహసీల్దార్ కార్యాలయాల్లో కూడా రిజిస్ట్రేషన్లు చేయనున్న నేపథ్యంలో ఎంసీఆర్ హెచ్‌ఆర్డీలో తహశీల్దార్లకు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల వ్యవహారాలను శిక్షణా తరగతులను మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో భూకబ్జాలకు ఆస్కారం లేకుండా రికార్డుల ప్రక్షాళన, నమోదు జరుగుతున్నదన్నారు. 1930 తర్వాత ఇప్పుడే భూ రికార్డుల ప్రక్షాళన చేపట్టామన్నారు. రికార్డులు పక్కాగా ఉండాలన్న ఉద్దేశంతోనే సీఎం కేసీఆర్ దేశంలో ఎక్కడా లేని విధంగా ఈ కార్యక్రమం చేపట్టారని గుర్తు చేశారు. రెవెన్యూ శాఖ ద్వారానే సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని, ఏడాదికి సుమారు రూ.40 వేల కోట్లు తమ శాఖ ద్వారానే లబ్దిదారులకు చెరుతున్నాయని చెప్పారు. ప్రజల కోసం, అభివృద్ధి కోసమే తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తున్నదని, అధికారం కోసం కాదని ఆయన స్పష్టం చేశారు. తహశీల్దారు ఈ శిక్షణా కార్యక్రమాలను ఉపయోగించుకోవాలని సూచించారు. శిక్షణా కార్యక్రమాలకు సంబంధించి కిట్స్, ఇతర మెటీరియల్‌ను తహశీల్దార్లకు ఈసందర్భంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో స్టాంపులు, రిజస్ట్రేషన్ల శాఖ డిప్యూటీ డీఐజీ మధుసూదన్‌రెడ్డి, ఆయా మండలాల నుంచి వచ్చిన తహశీల్దార్లు పాల్గొన్నారు.

అంతర్జాతీయ కరాటే పోటీల్లో రాష్ట్రానికి ఐదు పతకాలు



నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

యునైటెడ్ షోటోకాన్ కరాటే అఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఫిబ్రవరి 2 నుండి 4 వరకు ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో నిర్వహించిన రెండో అంతర్జాతీయ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో తెలంగాణ రాష్ట్రానికి ఐదు పతకాలు లభించాయి. రాష్ట్రం తరపున వివిధ విభాగాల్లో పాల్గొన్న క్రీడాకారులు రెండు బంగారు పతకాలు, మూడు వెండిపతకాలు సాధించారు. అండర్ (బాలుర)-14లో అవినాశ్ బంగారు పతకం, అండర్ (బాలికలు)-14 విభాగంలో నందిని బంగారుపతకం అందుకున్నారు. వివిధ విభాగాల్లో అనూష, ఆదిత్య, ఎండీ అర్ఫత్ వెండిపతకాలు పొందారు. కాగా పతకాలు అందుకున్న క్రీడాకారులను సోమవారం తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మెన్ అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి సాట్స్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కరాటే కోచ్‌లు కేశవ్ గౌడ్, అబ్దుల్ నబి ఉన్నారు.

కోర్టు తీర్పు అమలు చేయక తప్పదు

రివ్యూ పిటిషన్ వేసినా ప్రయోజనం శూన్యం

- సుప్రీంకోర్టుకు వెళ్ళడం వృథా
- ఉద్యోగసంఘాలతో పిటిషన్ వేయిస్తే...!
- విద్యుత్ ఉద్యోగుల విభజనపై టీఎస్‌పీసీసీలో చర్చ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

స్థానికతపై విద్యుత్ ఉద్యోగుల కేసులో హైకోర్టు తీర్పును అమలు చేయడం మినహా మరో మార్గం లేదని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ సంస్థల సమన్వయ కమిటీ (టీఎస్‌పీసీసీ) అభిప్రాయపడింది. హైకోర్టు తీర్పుపై రివ్యూ పిటిషన్ వేసినా ఎలాంటి ప్రయోజనం ఉండబోదని, దీనిపై సుప్రీంకోర్టుకు వెళ్లడం కూడా వృథా అని అడ్వకేట్ జనరల్ తేల్చి చెప్పిన అంశంపై కూడా సుదీర్ఘచర్చ జరిగింది. సోమవారంనాడిక్కడి విద్యుత్ సౌధలో టీఎస్‌పీసీసీ సమావేశం టీఎస్‌జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎమ్‌డీ దేవులపల్లి ప్రభాకరరావు అధ్యక్షతన జరిగింది. డిస్కంల సీఎమ్‌డీలు జి.రఘుమారెడ్డి, గోపాల రావుతో పాటు విద్యుత్ సంస్థల డైరెక్టర్లు, ఇతర అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. 24గంటల విద్యుత్ సరఫరా, అదనపు విద్యుత్ కొనుగోళ్లు వంటి అంశాలపై స్వల్పవ్యవధిలో చర్చించిన కమిటీ హైకోర్టు తీర్పు అమలుపై సుదీర్ఘంగా చర్చించింది. దీనిపై శనివారంనాడు ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో జరిగిన సమావేశ వివరాలను సీఎమ్‌డీ ప్రభాకరరావు కమిటీ ఎదుట ప్రస్తావించినట్టు సమాచారం.

ఏపీ స్థానికత ఉద్యోగులకు పదోన్నతుల అంశంలో తెలంగాణ ఉద్యోగులు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని, కానీ చట్ట బద్ధంగా కోర్టు తీర్పు అమలు చేయడం మినహా మరో ప్రత్యామ్నాయం కనిపించట్లేదని ఆయన కమిటీకి నివేదించినట్టు తెలిసింది. అయితే విద్యుత్ సంస్థల యాజమాన్యాలుగా కాకుండా ఉద్యోగ సంఘాలతో హైకోర్టులో రివ్యూ పిటిషన్ వేయించి, ఆ తర్వాత సుప్రీంకోర్టులో కేసు ఫైల్ చేస్తే ఎలా ఉంటుందనే అభిప్రాయాలు కూడా సమావేశంలో వ్యక్తమైనట్టు సమాచారం. ఇది కాలయాపనకు ఉపయోగపడుతుందే తప్ప, తీర్పు తెలంగాణ విద్యుత్ సంస్థలకు అనుకూలంగా వస్తుందో...రాదో...అనే సందేహాల్ని కమిటీ సభ్యులు లేవనెత్తినట్టు తెలిసింది. అయితే కోర్టు ఖర్చులు ఏపీ యాజమాన్యాలు చెల్లించబోవని, ఉద్యోగ సంఘాలే వాటిని భరించాలని ప్రభాకరరావు కరాఖండిగా చెప్పేసినట్టు తెలిసింది. కోర్టు ఆదేశాల మేరకు ఉద్యోగుల విభజన కోసం ప్రత్యేక కమిటీ నియామకంపై కూడా చర్చ జరిగింది. త్వరలో దీన్ని ప్రకటించేందుకు, పూర్తి విభజన జరిగాకే పదోన్నతుల విషయాన్ని పునరాలోచన చేయాలని కూడా ఈ సమావేశంలో నిర్ణయించినట్టు సమాచారం.

అంగీకరించొద్దు-టీఎస్‌పీఇఏ

కోర్టు తీర్పు అమలు పేరుతో ఆంధ్రప్రదేశ్ స్థానికత ఉద్యోగులకు పదోన్నతులు కల్పించొద్దని తెలంగాణ రాష్ట్ర పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ (టీఎస్‌పీఇఏ) విద్యుత్ సంస్థల సీఎమ్‌డీలకు విజ్ఞప్తి చేసింది. టీఎస్‌పీసీసీ సమావేశం సందర్భంగా అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి రత్నాకరరావు, పి సదానందం, శ్రీనివాస్ తదితరులు ఈ మేరకు వినతిపత్రాలు సమర్పించారు. కోర్టు తీర్పును అమలు చేస్తే తెలంగాణ విద్యుత్ సంస్థల ఉద్యోగులు సహాయ నిరాకరణకు సిద్ధంగా ఉన్నారని వారు తెలిపారు. ఆదివారం జరిగిన తెలంగాణ విద్యుత్ ఇంజనీర్స్ అసోసియేషన్ (టీఎస్‌ఈఈఏ) కార్యవర్గ సమావేశంలో కోర్టు తీర్పు అమలును వ్యతిరేకిస్తూ తీర్మానం చేసినట్టు ఆ సంఘం అధ్యక్షులు ఎన్ శివాజీ తెలిపారు.

అవినీతి తిమింగలం కోసంఏసీబీ సెర్చ్‌వారెంట్

నవతెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి

అవినీతి అక్రమాలకు పాల్పడి కోట్ల రూపాయల ఆదాయానికి మించిన ఆస్తు లు కూడబెట్టి పరారీలో ఉన్న హెచ్‌ఎండీఏ హైదరాబాద్ ప్లానింగ్ డైరెక్టర్ కట్టా పురుషోత్తంరెడ్డి కోసం అవినీతి నిరోధక శాఖ సెర్చ్‌వారెంట్‌ను జారీ చేసింది. కోర్టు అనుమతితో ఈ వారెంట్‌ను జారీ చేసిన ఏసీబీ అధికారులు అనుమానిత ప్రాంతాలలో సోమవారం నుంచి దాడులను జరుపుతున్నారు. మూడు రోజుల క్రితం పురుషోత్తంరెడ్డి ఆస్తులపై ఏసీబీ అధికారులు దాడులను నిర్వహించి రూ.25 కోట్ల రూపాయలకు పైగా ఆదాయానికి మించిన ఆస్తులను కనుగొన్న విష యం తెలిసిందే. ఏసీబీ అధికారుల దాడుల సమాచారం అందగానే అజ్ఞాతంలోకి పురుషోత్తంరెడ్డి వెళ్లిపోయినట్టు ఏసీబీ అధికారులు గుర్తించారు. ముఖ్యంగా ఇద్దరు టీఆర్ ఎస్ ఎమ్మెల్యేలు పురుషోత్తంరెడ్డికి రహస్య ప్రదేశంలో ఆశ్రయం కల్పించారని వార్త లు వచ్చాయి. ఆదిశగా ఆరా తీసిన ఏసీబీ అధికారులకు అలాం టిదేమీ జరులేదనే సమాచారం అందినట్టు తెలిసింది. తమకు చిక్కకుండా తప్పిం చుకుని తిరుగుతు న్న పురుషోత్తంరెడ్డి కోసం తాజాగా ఏసీబీ సర్చ్‌వారెంట్‌ను జారీ చేసింది. అంతే గాక ఒక వేళ ఎవరైనా ఈ నిందితుడికి సహకరించి ఆశ్రయం కల్పించినా వారి పైనా చట్టరిత్య చర్య తీసుకుంటామని ఏసీబీ డైరెక్టర్ జనరల్ జె.పూర్ణచంద్రరావు స్పష్టం చేశారు.

నిబంధనలు కఠినతరంతోనే కాలేజీలు మూత

- వచ్చే ఏడాది నుంచి తెలుగు తప్పనిసరి : కడియం

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

'గతంలో రాష్ట్రంలో ఇంటర్‌లో 2,20,000 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు అవుతుంటే...డిగ్రీ కాలేజీల్లో 4,40,000 సీట్లకు అనుమతినిచ్చారు. అదేవిధంగా ఎంసెట్ క్వాలిఫై అయ్యే విద్యార్థులు లక్ష మంది ఉంటే, ఇంజనీరింగ్ కాలేజీల్లో సీట్ల సంఖ్య 2,60,000 ఉన్నాయి. దీంతోనే విద్యలో ప్రమాణాలు లేకుండా పోయాయి. తెలంగాణ ప్రభుత్వం నిబంధనలను కఠినతరం చేయడంతో ప్రమాణాలు లేని కాలేజీలు మూతపడుతున్నాయి.." అని డిప్యూటీసీఎం కడియం శ్రీహరి అన్నారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో రూ.3.4కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న పరిపాలన భవనానికి కడియం శ్రీహరి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలుగుభాష అభివద్ధికి కొత్త,కొత్త కోర్సులు రూపొందించి, తెలంగాణ తెలుగు విశ్వవిద్యాలయం ఖ్యాతి ఇనుమడింపజేయాలని ఆయన కోరారు. రానున్న విద్యా సంవత్సరం నుంచి తెలంగాణ రాష్ట్రంలోని అన్ని విద్యాలయాల్లో తెలుగును తప్పనిసరిగా అమలు చేస్తామన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ విద్యను పటిష్టం చేసేందుకు అనేక సంస్కరణలు తీసుకొచ్చామన్నారు. వర్సిటీల్లో మౌలిక వసతుల అభివద్ధి కోసం 2017-18 బడ్జెట్‌లో రూ.420కోట్లు కేటాయించామని చెప్పారు. దీంట్లో తెలుగు విశ్వవిద్యాలయానికి రూ.20 కోట్లు కేటాయించామన్నారు. కార్యక్రమంలో తెలుగు విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ సత్యనారాయణ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అలేఖ్య, ఆకాశవాణి డైరెక్టర్ ఉదయ్ కిరణ్ పాల్గొన్నారు.

తెలంగాణ స్టడీ సర్కిల్‌లో అవినీతిపరులపై చర్యలు తీసుకోవాలి

- ఐదురోజులుగా ఆందోళన చేస్తున్న విద్యార్థులు : సంఘీభావం తెలిపిన వీహెచ్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలంగాణ స్టడీ సర్కిల్‌లో అవినీతిపరులపై కఠిన చర్యలు తీసుకోవాలని, స్టడీ సర్కిల్‌కు కేటాయించిన నిధులను సక్రమంగా ఖర్చు చేయాలని డిమాండ్ చేస్తూ 350 మంది విద్యార్థులు ఆందోళనలకు దిగారు. తెలంగాణ స్టడీ సర్కిల్‌కు కేటాయించిన నిధుల్లో తప్పుడు లెక్కలు చూపించి అవినీతికి పాల్పడ్డారని విద్యార్థులు ఆరోపించారు. దీంతో విద్యార్థులకు అందాల్సిన సౌకర్యాలను కల్పించడం లేదని పేర్కొన్నారు. ఐదురోజులుగా అందోళన చేస్తున్న విద్యార్థులకు సోమవారం నాడు మాజీ ఎంపీ వి హనుమంతరావు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత, గిరిజనులకు ఉన్నత విద్యలో శిక్షణ ఇవ్వాల్సి ఉండగా ఆపేరుతో పెద్ద ఎత్తున అధికారులు అవినీతికి పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. వారికి కేటాయించాల్సిన నిధులను విడుదల చేయకపోవడంతోపాటు వచ్చిన నిధులలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయన్నారు. సోషల్ వెల్ఫేర్ మంత్రిగా కూడా ప్రభుత్వం దళితులకు, బలహీన వర్గాలకు అవకాశం ఇవ్వలేదని విమర్శించారు. నెలకు రూ 11 కోట్ల రూపాయలు వ్యయం చేస్తూ హరిజనుల విద్య కోసం ఖర్చు చేస్తున్నట్టు చెప్తున్న ప్రభుత్వం అందులో రూ.3కోట్లకు బిల్లులు లేవని ఆరోపించారు. అంతా అవినీతి పేరిట దోచుకున్నారని మండిపడ్డారు. తెలంగాణ స్టడీ సర్కిల్ కమిషనర్ సరిగా వ్యవహరించడం లేదని, దళితుల విద్యార్థుల కోసంఖర్చు చేయాల్సిన నిధులను అధికారులు, నాయకుల జేబుల్లోకి పోతున్నాయన్నారు.

కొత్త కానిస్టేబుళ్లకు టెక్నాలజీపై కోర్సు

నవతెలంగాణ, ప్రత్యేక ప్రతినధి

విధుల్లో కొత్తగా చేరిన కానిస్టేబుళ్లకు కంప్యూటర్ల వినియోగంపై నెలరోజుల శిక్షణా కోర్సును ఆర్‌బీవీఆర్ పోలీసు అకాడమిలో సోమవారం నుంచి ప్రారంభించారు. సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్ కోర్సు పేరిట మొదలైన ఈ శిక్షణలో సర్వర్‌ను ఎలా వినియోగించాలి మొదలుకుని అందులో కొత్తగా పోలీసుశాఖలో అందుబాటులోకి తెచ్చిన టీఎస్‌కాప్స్ యాప్‌ను ఏవిధంగా వాడాలి వరకు పలురకాల అంశాలను చేర్చారు. మొత్తం 232 మంది ఔత్సాహిక కానిస్టేబుళ్లకు ఈకోర్సులో శిక్షణ నిస్తున్నారు. కోర్సును ప్రారంభించిన రాష్ట్ర పోలీసు సాంకేతిక విభాగం అదనపు డీజీ రవిగుప్తా మాట్లాడుతు పోలీసు శాఖలో సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా వినియోగించడం ద్వారా ప్రజలకు మరిన్ని సేవలను అందచేయగలమని తెలిపారు.

సీనియర్ అసిస్టెంట్‌ను చెప్పుతో కొట్టిన మహిళా టీచర్

- కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన బాధితుడు


నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

తెలంగాణ పాఠశాల విద్యాశాఖ కమిషనరేట్‌లో పనిచేస్తున్న ఓ సీనియర్ అసిస్టెంట్(సర్వీసెస్)పై అక్కడే పనిచేస్తున్న మహిళా ఉద్యోగిని(మెడికల్) చెప్పుతో దాడిచేసిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై పాఠశాల విద్యాశాఖ కమిషనర్ జి కిషన్‌కు బాధితుడు ఫిర్యాదు చేశారు. తోటి ఉద్యోగుల ముందు అవమానించేలా డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న మహిళా టీచర్ తను పలుమార్లు చెప్పుతో కొట్టిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. తన లైఫ్‌స్టైల్ గురించి తాను మాట్లాడానని, అందుకే చెప్పుతో కొట్టినట్టు ఆమె ప్రచారం చేస్తుందని, అవన్నీ అవాస్తవాలని ఆయన పేర్కొన్నారు. టీచింగ్ క్యాడర్ డిప్యూటేషన్‌పై కమిషనరేట్‌కు వచ్చిన తర్వాత కార్యాలయ వాతావరణం కలుషితమైందని ఆవేదన వ్యక్తం చేశారు. తనపై దాడిచేసిన ఉద్యోగిని ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ బంధువునని చెప్పుకుంటూ వ్యవహరిస్తుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. అకారణంగా తనపై చెప్పుతో దాడిచేసిన సదరు టీచర్‌పై చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరారు.

మాస్టర్ ఆరేటర్ కాంటెస్ట్-2లో సత్తా చాటిన నారాయణ విద్యార్థులు

హైదరాబాద్: నారాయణ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన మాస్టర్ ఆరేటర్ కాంటెస్ట్-2 శ్రీనగర్ కాలనీలోని శ్రీసత్యసాయి నిగమాగమంలో ఘనంగా జరిగింది. సెంట్రల్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ పి.దిలీప్, హైకోర్టు అడ్వకేట్ రవిప్రసాద్, నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ కె.పునిత్ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏసీపీ దిలీప్ మాట్లాడుతూ... విద్యార్థులు మాట్లాడే విధానాన్ని మెరుగుపరుచుకోవడానికి ఈకార్యక్రమం దోహదపడుతుందని ఆశిస్తున్నట్టు తెలిపారు. ఒక అంశంపై సమగ్ర అవగాహనతో ఎలాంటి తడబాటు లేకుండా ఆకట్టుకునేలా మాట్లాడటం గొప్ప విషయమని అన్నారు. రవిప్రసాద్ మాట్లాడుతూ ఎంతో ఆత్మవిశ్వాసం, మరెంతో ప్రతిభ ఉంటే గాని ఇలాంటి కార్యక్రమంలో పాల్గొనటం సాధ్యం కాదన్నారు. కె.పునిత్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలన్నీ నారాయణ విద్యా విధానంలో ఓ భాగమని అన్నారు. ఈప్రోగ్రామ్ 3విభాగాల్లో జరగగా సబ్ జూనియర్ కేటగిరిలో మాస్టర్ జయ్‌చంద్ మొదటి బహుమతి, ఆయేషా సిద్దిక రెండవ బహుమతి, రూతుదీక్షిత్ మూడవ బహుమతి సొంతం చేసుకున్నారు. ప్రతిభ చూపి, బహుమతులు గెలుచుకున్న విద్యార్థులను కె.పునిత్ ప్రత్యేకంగా అభినందించారు.

హైదరాబాద్‌లో ఫ్రెంచ్ అడ్మిషన్స్ టూర్..



హైదరాబాద్: ప్రపంచవ్యాప్తంగా ఫ్రాన్స్‌లో ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులకు కోసం 'క్యాంపస్ ఫ్రాన్స్' అడ్మిషన్ టూర్‌ను నిర్వహిస్తుంది. ఫ్రాన్స్ వ్యవహారాల, నేషనల్ ఎడ్యుకేషన్ అండ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్, ఫ్రెంచ్ మంత్రిత్వ శాఖల కింద 'క్యాంపస్ ఫ్రాన్స్' పనిచేస్తుంది. మంగళవారం హైదరాబాద్‌లోని తాజ్ బంజారాలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలియజేశారు. దీంట్లో ఫ్రాన్స్‌లోని ప్రముఖ విశ్వ విద్యాలయాలకు చెందిన 30 మంది ప్రతినిధులు పాల్గొంటున్నారని వివరించారు. ఈఅడ్మిషన్ టూర్‌లో భాగంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వీరిని కలుసుకునే అవకాశం కల్పించనున్నట్టు తెలిపారు. ప్రతియేటా ఫ్రాన్స్‌లో విద్యనభ్యసించే భారతీయ విద్యార్థులకుకోసం అక్కడి విశ్వవిద్యాయాలతో కలిసి 'క్యాంపస్ ఫ్రాన్స్' కార్యక్రమాల ను నిర్వర్తిస్తోంది. 2018లో ఢిల్లీ, పుణే, చెన్నై, హైదరాబాద్‌లో జరిగే అడ్మిషన్స్ టూర్‌లో ఇదే మొదటిదని వివరించారు. సైన్స్, ఇంజనీరింగ్, బిజినెస్ మేనేజ్‌మెంట్, హాస్పిటాలిటీ డెవలప్‌మెంట్ రంగాల్లో ఫ్రాన్స్‌లో అవకాశాలకు ఈఅడ్మిషన్ టూర్‌వేదికగా నిలువనుందని నిర్వాహకులు తెలిపారు.

జైళ్లలో మానవహక్కుల పరిరక్షణపై జాతీయ స్థాయి శిక్షణ

- చంచల్‌గూడ జైళ్లశాఖ ట్రైనింగ్ సెంటర్‌లో ప్రారంభం

నవ తెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి

జైళ్లలో మానవహక్కుల పరిరక్ష ణపై మూడు రోజుల జాతీయ స్థాయి శిక్షణా శిబిరాన్ని రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సి పల్ సెక్రటరీ రాజ్‌తివారీ సోమవా రం ప్రారంభించారు. చంచల్‌గూడ జైళ్ల శాఖ ట్రైనింగ్ సెంటర్(సికా)లో ప్రారంభమైన ఈ శిక్షణా శిబిరంలో రాష్ట్రంతో పాటు 27రాష్ట్రాలకు చెందిన జైళ్ల అధికారులు పాల్గొన్నారు. ఐదవ తేదీ నుంచి ఏడవ తేదీ వరకు సాగే ఈశిబిరాన్ని బ్యూరో ఆఫ్ పోలీసు రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (బీపీఆర్ అండ్ డీ) ఆధ్వర్యాన నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ రాజేష్‌తివారీ మాట్లాడుతు జైళ్లలో సంస్కరణలను అమలు చేయడమే గాక ఖైదీల మానవ హక్కులకు భంగం కలుగకుండా చూడటం కూడా అత్యవసరమని అన్నారు.

కల్తీపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి

'ఆహార కల్తీ' వాహన ప్రారంభోత్సవంలో మండలి చైర్మెన్ స్వామిగౌడ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కల్తీకి పాల్పడే వారిపై అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని మండలి చైర్మెన్ స్వామిగౌడ్ అన్నారు. ఆహార, కల్తీ నియంత్రణ అధికారులకు అవసరమైన వాహనాలు సమకూర్చాల్సిన అవసరం ఉందన్నారు. నారాయణగూడలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ కార్యాలయం ఆవరణలో మొబైల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్ వ్యాన్‌ను శాసన మంత్రి లక్ష్మారెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామిగౌడ్ మాట్లాడుతూ ఇలాంటి వాహనాలను కనీసం జిల్లాకు ఒకటి చొప్పున ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. నాచారంలో ఉన్న ల్యాబ్‌ను ఇక్కడకు మార్చాలన్నారు. ఆహారకల్తీని నివారించకుండా మందులకు, చికిత్సలను ఎంత ఖర్చు చేసిన ఫలితం ఉండదన్నారు. అనంతరం మంత్రి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఆహార కల్తీ చట్టాన్ని మరింత కఠినంగా తీర్చి దిద్దాల్సిన అవసరం ఉందన్నారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన రాష్ట్రాల వైద్య ఆరోగ్య శాఖల మంత్రుల సమావేశంలో రెండు మొబైల్ వాహనాలను అడిగామని, అందులో ప్రస్తుతానికి ఒక వాహనాన్ని మంజూరు చేశారని చెప్పారు. ఆహార కల్తీ నివారణలో ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు. హోటల్స్, ఇతర ఆహార పదార్థాల తయారీ అమ్మకందారులు, వ్యాపారులు కల్తీ అరికట్టడంలో నిజాయితీగా వ్యవహరించాలన్నారు. ఈ వాహనంలో పాలు, వంట నూనెలు, నెయ్యి, మసాలాలు, వంటి అనేక ఆహార పదార్థాలను, వాటి నాణ్యతలను పరీక్షించే సదుపాయాలు వాహనంలో ఉంటాయన్నారు. వాహనం ద్వారా ఆహార కల్తీ అదుపు, నివారణకు ఆస్కారం ఏర్పడుతుందన్నారు.



వాహనాన్ని ప్రారంభిస్తున్న స్వామిగౌడ్

ఆహార పదార్థాల, తయారీ, నిలువ ఉండే చోట్లకే నేరుగా వెళ్లి పరీక్షించే వీలుండటం వల్ల, అక్కడికక్కడే కల్తీ ఆహార పదార్థాలను సీజ్ చేయడంతో పాటు, వాటి నిర్వాహకుల మీద చర్యలు తీసుకునే వీలు కలుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

త్వరలోనే రెండో ఏఎన్‌ఎంల సమస్యల పరిష్కరిస్తాం

మంత్రి లక్ష్మారెడ్డి ఆర్టీసీ కళ్యాణ మండపంలో జరిగిన రెండో ఏఎన్‌ఎంల మహాసభలో పాల్గొని ప్రసంగించారు. త్వరలోనే రెండో ఎఎన్‌ఎంల సమస్యలను పరిష్కరిస్తామని, ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. సమస్యలపై ఇప్పటికే అధ్యయనం చేస్తున్నామని, అలాగే వారి సమస్యలన్నీ సీఎం దష్టిలో ఉన్నాయని, నిర్ణయం వెలువడానికి కొంత సమయం పడుతుందని అన్నారు. కార్యక్రమంలో హెూం, కార్మికశాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీనివాసగౌడ్, భారీగా ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

జాకబ్ జుమా రాజీనామాకు ఒత్తిడి

స్వపక్షం 'ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్' అత్యవసర సమావేశం

- దక్షిణాఫ్రికా అధ్యక్షుడిపై రీకాల్, పార్లమెంట్ తీర్మానంతో తప్పించటంపై మంతనాలు



జాకబ్ జుమా

ప్రిటోరియా: అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న దక్షిణాఫ్రికా అధ్యక్షుడు జాకబ్ జుమా పదవికి రాజీనామా చేయాలంటూ స్వపక్షం 'ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్(ఏఎన్‌సీ)'లో ఒత్తిడి పెరుగుతోంది. ఆదివారం ప్రిటోరియాలో అధ్యక్షుడు జాకబ్ జుమా నివాసంలో ఆయనతో ఏఎన్‌సీ సీనియర్ నాయకుల చర్చల తర్వాత ఈ ఒత్తిడి తీవ్రతరం అయ్యింది. ఈ చర్చల వివరాలు అధికారికంగా వెల్లడి కాలేదు. జాకబ్ జుమా అంశంపైనే సోమవారం ఏఎన్‌సీ జాతీయ కార్యవర్గ కమిటీ అత్యవసర సమావేశం నిర్వహిస్తోంది. జాకబ్ జుమా డిసెంబరులో ఏఎన్‌సీ అధ్యక్ష పదవిని కోల్పోవాల్సి వచ్చింది. ఆయన స్థానంలో పార్టీ అధ్యక్షుడిగా సిరిల్ రమఫోసా నియమితులయ్యారు. దక్షిణాఫ్రికాలో వచ్చే ఏడాది ఎన్నికలు జరుగనున్నాయి. ఎన్నికలకు ముందు పార్టీలో ఆధిపత్య పోరాటం జరగకుండా జాగ్రత్త పడాలని, ఎందుకంటే అలాంటి పోరాటం పార్టీ చీలికకు దారి తీయగలదని ఏఎన్‌సీ అగ్రనేతలు ఆలోచిస్తున్నారని విశ్లేషకులు చెబుతున్నారు.

'రీకాల్' ద్వారాగాని లేదా పార్లమెంటులో తీర్మానం ద్వారాగాని జాకబ్ జుమాను దేశాధ్యక్ష పదవి నుంచి తప్పించాలని, ఇందుకు అవసరమైన ప్రక్రియను చేపట్టాలని ఏఎన్‌సీ సీనియర్ నాయకులు యోచిస్తున్నారు.

తాను ఏ తప్పూ చేయలేదని, తానెందుకు రాజీనామా చేయాలని ఆదివారం ఏఎన్‌సీ సీనియర్ నాయకులతో చర్చల్లో జాకబ్ జుమా ప్రశ్నించారని ప్రతిపక్ష 'ఎకనమిక్ ఫ్రీడమ్ ఫైటర్స్(ఈఎఫ్ఎఫ్)' పార్టీ నాయకుడు జూలియస్ మలేమా 'ట్విటర్'లో చెప్పారు. తనను తప్పించాలనుకుంటే ఆ దిశగా నిర్ణయం తీసుకోవాలని, తానైతే రాజీనామా చేయబోనని జాకబ్ జుమా తేల్చి చెప్పారని ఆయన తెలిపారు. 2014 మేలో వరుసగా రెండో పర్యాయం అధ్యక్ష పదవిని చేపట్టిన జాకబ్ జుమా పదవీ కాలం 2019 జూన్ వరకు ఉంది. అయితే దక్షిణాఫ్రికా ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుండటం, అవినీతి ఆరోపణల కారణంగా తమ పార్టీ పట్ల ప్రజాదరణ తగ్గుతోందని ఏఎన్‌సీ నాయకులు భావిస్తున్నారు. 2019 ఎన్నికల్లో దేశాధ్యక్ష పదవిని దక్కించుకొనే అవకాశమున్న నాయకుల్లో అందరికన్నా రమఫోసా ముందంజలో ఉన్నారు. పార్టీలో ఐక్యత కోసం ఆయన పిలుపునిచ్చారు.



మాస్కోను ముంచెత్తిన మంచువాన

మాస్కో : రష్యా రాజధాని మాస్కోను మంచు దుప్పటి కమ్మేసింది. ఎడతెరపి లేకుండా శనివారంనుండి ఇటు వర్షం, అటు దట్టంగా పడుతున్న మంచు మొత్తం మాస్కో నగరాన్ని ముంచేస్తుందా ?అన్నట్టు భయాందోళన కలిగించింది. సోమవారంనాడు ఇక్కడ రికార్డుస్థాయిలో 55 సెంటీమీటర్ల మంచు కురవటంతో నగరంలోని అనేక ప్రాంతాల్ని మంచు మేటలు ముంచేశాయి. సెయింట్ బాసిల్స్ కేథడ్రల్, రెడ్ స్క్వేర్ భవనాల వద్ద పెద్ద ఎత్తున మంచు చేరింది. ఆది, సోమవారంనాటికి పరిస్థితిలో కొంతమార్పు వస్తుందని ఊహించగా, అలాంటిదేమీ జరగలేదు. దీంతో ప్రజా రవాణా, ప్రభుత్వ కార్యకలాపాలు, రైలు, విమాన రాకపోకలు అన్నీ స్తంభించిపోయాయి. భారీగా కురుస్తున్న మంచు కారణంగా 2000 చెట్లు నేలకొరిగాయి. విమానాలు మాస్కోలో దిగే పరిస్థితి లేకపోవటంతో, వాటిని దారిమళ్లించారు. రహదార్లపై పేరుకున్న మంచును తొలగించడానికి రాత్రింబవళ్లు 70వేలమంది సిబ్బంది పనిచేస్తున్నారు.

పిల్లల రక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటారు ?

- ట్రంప్‌నకు ఏడేండ్ల చిన్నారి లేఖ



ఎవా ఓస్లేన్

వాషింగ్టన్: తుపాకీ కాల్పుల్లో ప్రాణ స్నేహితుడ్ని కోల్పోయిన ఓ చిన్నారి.. పిల్లల రక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటారు? అని ప్రశ్నిస్తూ ఏకంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు ఉత్తరం రాసింది. ఈ లేఖకు ట్రంప్ సమాధానం పంపించారు. సౌత్ కరొలినాలోని టౌన్‌విల్లే పట్టణంలో ఎవా ఓస్లేన్ అనే చిన్నారి.. ఓ వ్యక్తి తుపాకీతో కాల్పులు జరప డం చూసింది. ఆమె చదువుకునే పాఠశాల వద్ద 14ఏండ్ల అబ్బాయి జరిపిన కాల్పుల్లో ఎవా స్నేహితుడు జాకోబ్ సహా ముగ్గురు మరణించారు. పాఠశాల ఆటస్థలంలో ఆడుకుంటున్న జాకోబ్ తీవ్రంగా గాయపడి మూడు రోజుల తర్వాత మరణించాడు. ఈ ఘటన 2016 సెప్టెంబరులో జరిగింది. ఆ ఘటన తర్వాత ఎవా మానసికంగా బాగా కుంగిపోయింది. పాఠశాలకు కూడా పోలేని పరిస్థితి. వైద్యులు ఆమెకు ఇంటి వద్దే చదువు చెప్పించమని సూచించారు. స్నేహితుడి మరణాన్ని మర్చిపోలేని ఎవా 2017 ఆగస్టులో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు లేఖ రాసింది.

"నాకు తుపాకులు అంటే అసహ్యం. అది నా జీవితాన్ని నాశనం చేసింది. నా బెస్ట్ ఫ్రెండ్‌ని కోల్పోయాను. మీరు చిన్నారులకు రక్షణ కల్పిస్తారా? మమ్మల్ని ఎలా కాపాడుతారు? దయచేసి ఇలాంటిది ఎప్పటికీ జరగనివ్వకండి" అంటూ లేఖలో పేర్కొంది. ఎవా ఉత్తరాన్ని చూసి చలించిపోయిన అధ్యక్షుడు ట్రంప్ ఆమెకు సమాధానం పంపించారు.

సామ్‌సంగ్ వారసుడు జైలు నుంచి విడుదల

అవినీతికేసులో జైలు శిక్షను సస్పెండ్ చేసిన సియోల్ హైకోర్టు

- సుప్రీంకోర్టుకు వెళ్తామన్న ప్రాసిక్యూటర్స్



సియోల్: ప్రఖ్యాత ఎలక్ట్రానిక్ ఉపకరణాల తయారీ సంస్థ 'సామ్‌సంగ్' వైస్ ఛైర్మన్, సంస్థ వారసుడు జే వై లీకి జైలు నుంచి విముక్తి లభించింది. ఆయనకు విధించిన జైలు శిక్షను దక్షిణ కొరియా అప్పీల్స్ కోర్టు నిలిపివేయడంతో...లీ సోమవారం జైలు నుంచి విడుదలయ్యారు. గతేడాదిలో అప్పటి దక్షిణ కొరియా అధ్యక్షురాలు పార్క్ గ్యాన్‌హైకి లంచం ఇచ్చారన్న ఆరోపణలతో ఆయన అరెస్టైన సంగతి తెలిసిందే. మోసం, నిధుల దుర్వినియోగం, లంచం తదితర అభియోగాల్లో ఆయన నిందితుడిగా తేలడంతో ఐదేండ్ల జైలు శిక్ష పడింది. ఇక ఇదే కేసులో అధికార దుర్వినియోగానికి పాల్పడిన అధ్యక్షురాలు పార్క్ గ్యాన్‌హై కూడా పదవి నుంచి దిగిపోవాల్సి వచ్చింది.

కాగా లీ జైలు శిక్షను నిలిపివేసిన దక్షిణ కొరియా కోర్టు... ఆయన శిక్షాకాలాన్ని కూడా రెండున్నరేండ్లకు తగ్గించింది. ఆయనపై ఉన్న లంచం, నిధుల దుర్వినియోగం అభియోగాలను కూడా కొట్టివేసింది. గత సంవత్సర కాలం పాటు జైల్లో ఉన్న ఆయనను.. సత్ప్రవర్తనతో మెలిగారని చెబుతూ నాలుగేండ్ల ప్రొబేషన్ కింద విడుదల చేసింది. మాజీ అధ్యక్షురాలు పార్క్ గ్యాన్‌హై అంతరంగికురాలికి లంచం ఇచ్చిన కేసులో మాత్రమే లీ దోషిగా ఉన్నారని కోర్టు వ్యాఖ్యానించింది.

9న మంత్రులతో ప్రయివేటు విద్యాసంస్థల యాజమాన్యాల చర్చలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉన్నత విద్యారంగంలో ఉన్న సమస్యలపై ఈనెల 9న ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, మంత్రులు ఈటల రాజేందర్, కేటీఆర్, జి జగదీశ్‌రెడ్డిలతో ప్రయివేటు విద్యాసంస్థల యాజమాన్యాలు చర్చలు జరపనున్నాయి. డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్), సీబీసీఎస్ అమలు, బయోమెట్రిక్ విధానం, ఫీజు రీయింబర్స్‌మెంట్, అనుబంధ గుర్తింపు కోసం చేపడుతున్న చర్యలు, నాణ్యమైన విద్య అందించేందుకు చేపట్టే అంశాలపై ఈనెల 9న హైదరాబాద్‌లోని సచివాలయంలో చర్చలు జరుపుతున్నామని, ప్రయివేటు డిగ్రీ కాలేజీ యాజమాన్యాల సంఘం ప్రధాన కార్యదర్శి టి విజయ్‌భాస్కర్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

కోమటిరెడ్డివి శవరాజకీయాలు

- శ్రీను హత్యపై సీబీఐ విచారణ అవసరం లేదు : మంత్రి జగదీశ్

నవతెలంగాణ-మిర్యాలగూడటౌన్

'మిర్చిబండి వద్ద జరిగిన గొడవే బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్యకు కారణమని పోలీసులు నిగ్గుతేల్చినా కాంగ్రెస్ నాయకులు కావాలనే ఆరోపణలు చేస్తున్నారు. ఆ హత్యపై సీబీఐ విచారణ అవసరం లేదు. రాబోయే ఎన్నికల్లో డిపాజిట్లు దక్కవనే ఉద్దేశంతోనే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శవరాజకీయాలకు పాల్పడుతున్నాడు' అని విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యేలు వేముల వీరేశం, గాదరి కిషోర్, భాస్కర్‌రావు, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డి, రవీంద్రకుమార్‌లతో కలిసి ఆయన సోమవారం నల్లగొండలోని మనోరమ హోటల్‌లో విలేకర్లతో మాట్లాడారు. నల్లగొండకు వచ్చే స్వేచ్ఛ దొరికిందని జైపాల్‌రెడ్డి, జానారెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డిలు నోరుపారేసుకున్నారని చెప్పారు. వీరు అధికారంలో ఉన్నప్పుడు ఏనాడైనా నల్లగొండకు వచ్చిన చరిత్ర ఉందా అని గుర్తు చేశారు. మంత్రిగా ఉన్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జానారెడ్డి, దామోదర్‌రెడ్డిలపై దాడి చేసిన చరిత్ర కోమటిరెడ్డికి ఉందని ఆరోపించారు. పాలేరు ఉప ఎన్నికల్లో ఆధిపత్యం కోసం కొట్లాడుకొని కేసులు పెట్టుకున్న సంగతి గుర్తులేదా అని ప్రశ్నించారు. బొడ్డుపల్లి శ్రీను సంస్మరణ సభను సంస్కార రహిత సభగా మార్చారని విమర్శించారు.

'ఫార్మా' దరఖాస్తులకు గడ్డుకాలం

కోర్సు పూర్తిచేసినా అభ్యర్థులకు అర్హత కష్టాలు

- ఫార్మసీ కౌన్సిల్ లేకపోవడంతో రిజిస్ట్రేషన్‌కు నోచుకోని సర్టిఫికెట్లు
- వ్యయప్రయాసల కోర్చి గుంటూరుకు..
- 28తో ముగియనున్న టీఎస్‌పీఎస్సీ గడువు
- డీ ఫార్మసీ అభ్యర్థుల ఆందోళన



సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లాల్సిందిగా తెలంగాణ ఫార్మా సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సంజయ్‌రెడ్డికి వినతి పత్రం సమర్పిస్తున్న డీ ఫార్మసీ అభ్యర్థులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఫార్మసీ కోర్సు పూర్తిచేసిన అభ్యర్థులకు రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం లేకపోవడంతో ఇక్కట్లకు గురవుతున్నారు. ఏదైనా ప్రభుత్వ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోవాలంటే సర్టిఫికెట్లకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి. ఈ నేపథ్యంలో గత నెల 25న ఫార్మసీ గ్రేడ్-2లో 238 పోస్టుల భర్తీకిగాను టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసింది. అదే నెల 29 నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. డీ ఫార్మసీ పూర్తి చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులు ఈ నెల 28లోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. అయితే, రాష్ట్రంలో ఫార్మసీ కౌన్సిల్ ఏర్పాటులో తీవ్ర జాప్యం జరుగుతుండటం, రిజిస్ట్రేషన్ కోసం అభ్యర్థులు గుంటూరు వెళ్తుండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2017లో డీ ఫార్మసీ ఉత్తీర్ణులైన సుమారు 1500 మంది ఏపీలో రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకున్నా ఇంతవరకు సర్టిఫికెట్లు అందకపోవడంతో అయోమయ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. మరోవైపు, టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్ నేపథ్యంలో విద్యార్థుల జాబితాను పంపించాల్సిందిగా ఏపీ అధికారులు స్టేట్ బోర్డు టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ (ఎస్‌బీటీఈటీ) సమాచారం అందించారు. తెలంగాణ అధికారులు సానుకూలంగా స్పందించారు. రెండుమూడు రోజుల్లో సర్టిఫికెట్ల జాబితాను ఏపీకి పంపిస్తామని అధికారులు తెలిపారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. తెలంగాణ నుండి ఏపీకి.. అక్కడి నుండి రిజిస్ట్రేషన్ల జారీ.. తరువాత టీఎస్‌పీఎస్సీ ఆన్‌లైన్ ప్రక్రియ..ఈ తతంగమంతా 19 రోజుల్లో పూర్తికావాలి. లేదంటే ప్రస్తుతానికి ప్రభుత్వ ఉద్యోగ ఆశలు వదులుకోవాల్సిందేనని అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో మొత్తం 31,500 మంది డీ ఫార్మసీ అభ్యర్థులు ఉన్నట్టు అంచనా.

తెలంగాణ విద్యార్థులకు గుంటూరు తిప్పలు

తెలంగాణలో ఫార్మసీ కౌన్సిల్ లేకపోవడంతో విద్యార్థులు రిజిస్ట్రేషన్ కోసం గుంటూరులో ఉన్న ఉమ్మడి ఏపీ ఫార్మసీ కౌన్సిల్‌కు వెళ్తున్నారు. రాష్ట్ర విభజన తర్వాత ఏడాది కిందట ఫార్మసీ కౌన్సిల్ ఏపీకి తరలిపోయిన సంగతి తెలిసిందే. తెలంగాణలో ఫార్మసీ కౌన్సిల్‌కు రిజిస్ట్రార్‌ను నియమించినప్పటికీ.. కార్యాలయం, ఖాతా, సిబ్బందిని ఏర్పాటు చేయలేదు. దీంతో ఏడాది కాలంగా విద్యార్థులు రిజిస్ట్రేషన్ల కోసం గుంటూరుకు వెళ్లక తప్పడం లేదు. విద్యార్థులు వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులను కలిసి మొర పెట్టుకున్నా ఫలితం లేకుండా పోతున్నది. పదే పదే కలిసి ఒత్తిడి చేయడంతో ఎట్టకేలకు ఇటీవల కౌన్సిల్ రిజిస్ట్రార్‌గా డ్రగ్ కంట్రోల్ జేడీ కైలాసానికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, ఫార్మసీ కౌన్సిల్‌ను మాత్రం అధికారికంగా ఏర్పాటు చేయలేదు. దీంతో ధ్రువీకరణ పత్రాల రిజిస్ట్రేషన్‌కు ఫార్మసీ విద్యార్థులు గుంటూరుకు వెళ్తుండటంతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రిజిస్ట్రేషన్ తతంగం అంతా పూర్తి చేసుకుని రావాలంటే రెండు రోజులు సమయం వృథాతో పాటు ఆర్థికంగా సమస్యలు ఎదురవుతున్నాయని విద్యార్థుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా అక్కడి సిబ్బంది సైతం తెలంగాణ విద్యార్థులను ముప్పుతిప్పలు పెడుతున్నారు. సర్టిఫికెట్లు అప్‌లోడ్ కాలేదంటూ ఒకటికి రెండుసార్లు తిప్పుతున్నారు. రిజిస్ట్రేషన్ ఫీజునూ రెండుసార్లు చెల్లించాల్సి వస్తున్నది. ఏదైనా అనుమానాలను నివత్తి చేసుకుందామంటే కనీసం చెప్పేవారు కూడా లేరని వాపోతున్నారు. కాగా, ఏపీ కంటే తెలంగాణలోనే పెద్ద సంఖ్యలో బీ.ఫ్మారసీ, ఎం.ఫార్మసీ, డీ ఫార్మసీ విద్యార్థులు అధిక సంఖ్యలో ఉన్నా అధికార యంత్రాంగం మొద్దునిద్ర వీడటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రాష్ట్రం ఏర్పడి మూడున్నరేండ్లు గడిచినా తమకు బాధలు తప్పడంలేదని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. వాస్తవానికి కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న విద్యార్థులు మాత్రమే ఏపీకి వెళ్లాల్సి వస్తున్నది. రెన్యువల్ అయితే ఆన్‌లైన్‌లో చేసుకుంటున్నారు. నాలుగైదు నెలల క్రితం వరకు హైదరాబాద్ నాంపల్లి ఫార్మసీ కార్యాలయంలో మాన్యువల్‌గా సర్టిఫికెట్లను రెన్యువల్ చేసేవారు. ఇప్పుడు ఆన్‌లైన్ కావడంతో ఈ కార్యాలయంలో సిబ్బంది ఉండటం లేదు. గతంలో మూడు రోజులు అమరావతిలో మూడు రోజులు ఇక్కడ సిబ్బంది పనిచేసే వారు. ఆన్‌లైన్ కావడంతో ఇప్పుడంతా అక్కడే ఉంటున్నారు. దీంతో నాంపల్లిలోని ఫార్మసీ కౌన్సిల్ కార్యాలయానికి తాళం పడింది. ఫార్మసీ కౌన్సిల్ ఏర్పాటు ప్రతిపాదనలు ప్రభుత్వం వద్ద ఉన్నాయని.. కౌన్సిల్ ఏర్పడగానే ఏపీలో ఉన్న

రెండు మూడు రోజుల్లో ఏపీకి జాబితా

రాష్ట్రంలో కొత్తగా ఫార్మసీ కోర్సు పూర్తిచేసిన అభ్యర్థుల జాబితాను పంపించాల్సిందిగా ఏపీ అధికారుల నుంచి సమాచారం అందింది. దీనిపై ఇప్పటికే అధికారులతో చర్చలు జరిపాం. మరోసారి సమావేశమవుతాం. ఆ తరువాత రెండు మూడు రోజుల్లో జాబితా తయారు చేసి ఏపీ ఫార్మసీ కౌన్సిల్‌కు నివేదిస్తాం.

– వెంకటేశ్వర్లు,
స్టేట్ బోర్డు టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ (ఎస్‌బీటీఈటీ) కార్యదర్శి.

సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లాం

టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్ నేపథ్యంలో డీ ఫార్మసీ విద్యార్థులు మా కార్యాలయాన్ని సంప్రదించారు. విషయాన్ని ఏపీ ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ వినయ్‌కుమార్, ఎస్‌బీటీఈటీ కార్యదర్శి వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకెళ్లాం. సానుకూలంగా స్పందించారు. సమస్యను పరిష్కరిస్తామని హామీనిచ్చారు. ఫార్మసీ కౌన్సిల్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం.

– డాక్టర్ ఏ. సంజయ్‌రెడ్డి,

వృత్తులతో నిమిత్తం లేకుండా రుణాలు : మంత్రి జోగు రామన్న

నాయిబ్రాహ్మణులకు కిట్లు, ధ్రువపత్రాలు అందజేత



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వెనుకబడిన కులాల వారికి వృత్తులతో నిమిత్తం లేకుండా రుణాలు అందజేస్తామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి జోగు రామన్న తెలిపారు. బ్యూటిషన్ రంగంలో శిక్షణ పూర్తి చేసుకున్న 138 మంది నాయి బ్రాహ్మణులకు ఆయన కిట్లు, ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బీసీ వర్గాలకు వ్యాపారం, మోటార్ ఫీల్డ్, ఇతర రంగాల పట్ల ఆసక్తి ఉంటే వారికి కూడా రుణాలు అందజేస్తామన్నారు. ప్రతి వ్యక్తికి రూ.2లక్షలు నేరుగా అందిస్తామని, రూ.2 లక్షలు పై బడ్డ రుణాలకు 70 నుండి 80 శాతం సబ్సిడీతో బ్యాంకుల ద్వారా రుణాలు అందజేస్తామన్నారు. నాయి బ్రాహ్మణుల అభివృద్ధి కోసం విడుదల చేసిన రూ.250 కోట్లను ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే లోపు పూర్తి స్థాయిలో ఖర్చు చేస్తామని తెలిపారు. ఈ ఏడాది మార్చి లోపు 25 శాతం మంది నాయి బ్రాహ్మణులకు రుణాలు అందిస్తామని చెప్పారు. వచ్చే బడ్జెట్‌లో బీసీ సంక్షేమ శాఖకు అధిక శాతం నిధులు కేటాయించేలా ప్రతిపాదనలు రూపొందించామన్నారు. ఎంబీసీ కార్పొరేషన్ చైర్మెన్ తాడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ వృత్తిదారులకు రుణాలు అందించి ఆదుకుంటామని చెప్పారు. వృత్తుల ఆధునీకరణ కోసం బీసీ సంక్షేమ శాఖ ప్రత్యేక శిక్షణ అందించడం హర్షణీయమన్నారు. ఎమ్మెల్యే శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ వృత్తిదారులు తమ వృత్తులను కాపాడుకోవాలన్నారు.

లైంగిక దాడి కేసుల పరిష్కారానికి చొరవ చూపండి

- ఎస్సీ కమిషన్ జాతీయ చైర్మెన్‌కు రాష్ట్ర చైర్మెన్ వినతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఏండ్ల తరబడి పేరుకు పోయిన లైంగిక దాడి కేసుల సత్వర పరిష్కారానికి చొరవ చూపాలని ఎస్సీ కమిషన్ జాతీయ చైర్మెన్ రాములుకు రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మెన్ ఎ శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. సోమవారం దిల్‌కుషా గెస్ట్ హౌస్‌లో రాములును రాష్ట్ర కమిషన్ బృందం కలిసింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ లైంగిక దాడి బాధితుల కేసుల పరిష్కారంలో జాప్యం వల్ల వారు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని తెలిపారు. దీంతో కేంద్రం నుంచి అందే పరిహారం కూడా అందడం లేదన్నారు. దీనికి రాములు

వైభవంగా ఇంటిలిజెంట్ ప్రీ రిలీజ్ వేడుక


సి.కళ్యాణ్, ఆకుల శివ, సాయిధరమ్‌తేజ, పత్సా నాగరాజు, వి.వి.వినాయక్, కె.పుల్లారావు, లావణ్య త్రిపాఠి, సి.వి.రావు తదితరులు

'చిరంజీవి, పవన్ కళ్యాణ్ కలిస్తే ఎలా ఉంటారో, సాయిధరమ్ తేజ్ అలా ఉంటాడు. కష్టపడే తత్వం ఆయనది. చిరంజీవిలా అందరినీ కలుపుకుపోతుంటారు' అని అన్నారు వి.వి.వినాయక్. సాయి ధరమ్‌తేజ్, లావణ్య త్రిపాఠి జంటగా వి.వి.వినాయక్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ఇంటిలిజెంట్'. సి.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ ప్రై.లి.పతాకంపై సి.కళ్యాణ్ నిర్మించిన ఈ చిత్ర ప్రీ రిలీజ్ వేడుక ఆదివారం రాజమండ్రిలో అత్యంత వైభవంగా జరిగింది.

ఈ సందర్భంగా వి.వి.వినాయక్ మాట్లాడుతూ, సినిమా చాలా బాగా వచ్చింది. ఆకుల శివ మంచి కథ అందించారు. సినిమాటోగ్రాఫర్ విశ్వేశ్వర్, ఎడిటర్ గౌతంరాజు, సంగీత దర్శకుడు థమన్ బాగా సపోర్ట్ చేశారు. సినిమాను చూసిన వారంతా చాలా సంతోషించారు. తేజుతో 'చమకు చమకు' సాంగ్ చేసేటప్పుడు నాకు చిరంజీవి అన్నయ్య గుర్తొచ్చారు. రెండు మూడు సన్నివేశాల్లో పవన్ కళ్యాణ్‌లా కనిపించేలా చిత్రీకరించాను. చిరంజీవి, పవన్ కలిసినట్టుగా తేజు ఉంటాడు. చిరంజీవి అన్నయ్య, పవన్‌లా స్టార్ హీరోగా తేజు ఎదగాలని కోరుకుంటున్నాను. సి.కళ్యాణ్ అన్నయ్య నన్ను గాజు బొమ్మలా చూసుకున్నారు. సినిమా ఇంత త్వరగా పూర్తి కావడానికి ఆయనే కారణం. ఆయన రామానాయుడిలా వంద సినిమాలు తీయాలి. సి.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ వంద సినిమాలు పూర్తయ్యేంత వరకు నా జర్నీ వారితో ఉంటుంది. సినిమాకు ఇంత హైప్ తీసుకొచ్చిన మెగా అభిమానులకు థ్యాంక్స్. ఈ సందర్భంగా పవన్‌కి ఓ రిక్వెస్ట్. 'మీరు సినిమాలు చేయనన్నారు. రాజకీయంగా ఎంత స్థాయికి ఎదిగినా టైమ్ దొరికినప్పుడల్లా సినిమాలు చేయాలని కోరుకుంటున్నా' అని అన్నారు. 'సాయిధరమ్‌తేజ్ డాన్సులు అద్భుతంగా చేశాడు. సాయిని చూస్తుంటే చిరంజీవే గుర్తుకు వస్తున్నారు. మామకు తగ్గ అల్లుడు సాయిధరమ్ తేజ్ అని నిరూపించుకున్నాడు. ముందుందు మామను మించిన అల్లుడు కావాలని కోరుకుంటున్నా' అని మురళీ మోహన్ తెలిపారు. సాయిధరమ్ తేజ్ చెబుతూ, 'వినాయక్ నాకెంతో ఇష్టమైన దర్శకుడు. ఆయన్ని చూడగానే హోమ్లీ డైరెక్టర్ అనే ఫీలింగ్ కలుగుతుంది. చిరంజీవితో 'ఖైదీ నంబర్ 150' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత నాతో సినిమా చేసినందుకు ఆయన కృతజ్ఞతలు. ఆయన మరెన్నో హైట్స్‌కు చేరుకోవాలని కోరుకుంటున్నా. మెగా అభిమానులకు, సాధారణ ప్రేక్షకులకు గుర్తుండిపోయే సినిమా అవుతుంది. 'చమ చమకు..' సాంగ్‌ను ఇళయరాజా, సీతారామశాస్త్రి చేతుల మీదుగా విడుదల చేశాం. థమన్ మంచి ట్యూన్స్ అందించారు. జానీ, శేఖర్ మాస్టర్స్ నాతో డాన్సులు కుమ్మించేశారు. వరుణ్ తేజ్ 'తొలిప్రేమ' కూడా హిట్ కావాలి. ఒకేసారి ఇద్దరు మెగాహీరోలు బాక్సాఫీసు వద్ద హిట్ కొడితే ఆ కిక్కే వేరు. ఆ రికార్డు మిస్ అయ్యాం. చిరంజీవి స్థాపించిన ఈ సామ్రాజ్యంలో జెండా రెపరెపలనే నా గుండె చప్పుడుగా భావించి కష్టపడుతున్నా. మెగాస్టార్, పవర్‌స్టార్, మెగా పవర్ స్టార్, వరుణ్‌తేజ్ ఇలా అందరూ నాకు పంచభూతాలు. చిరంజీవి, పవన్ కళ్యాణ్, సహజనటుడు నాగబాబు నాకు గురువులు. వారు లేకుండా నేను లేను' అని చెప్పారు.

'ఇళయరాజా సంగీతంలో సిరివెన్నెల సీతారామశాస్త్రి రాసిన 'చమకు చమకు' పాట ఎంత పెద్ద హిట్టో తెలిసిందే. ఆ పాటను మా చిత్రంలో రీమిక్స్ చేశాం. సాయి అద్భుతంగా డాన్స్ చేశాడు. మెగా ఫ్యాన్స్‌కిది పెద్ద పండగే. ఫిబ్రవరి 9న విడుదల కానున్న మా సినిమా కొత్త రికార్డులను క్రియేట్ చేస్తుంది. ఓ దర్శకుడు కారు దిగగానే సింహం, పులి, ఏనుగులా గాంభీరంగా అనిపించే వారిలో మా గురువు దాసరిగారుంటే, ఆ తర్వాత అలా అనిపించే దర్శకుడు వినాయక్. లోపల ఎంత టెన్షన్ ఉన్నా బయటకు మాత్రం నవ్వుతూ పలకరిస్తాడు. మా కాంబినేషన్‌లో భవిష్యత్‌లో మరిన్ని సినిమాలు వస్తాయి' అని సి. కళ్యాణ్ చెప్పారు.

నవచిత్రం

లవర్స్ డే స్పెషల్‌గా టీజర్..


నితిన్

నితిన్, మేఘా ఆకాష్ జంటగా శ్రేష్ట్ మూవీస్, పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్ పతాకాలపై ఓ చిత్రం రూపొందుతున్న విషయం విదితమే. నిఖితారెడ్డి సమర్పణలో ఎన్.సుధాకర్‌రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రానికి త్రివిక్రమ్ కథ అందించగా, కృష్ణచైతన్య దర్శకత్వం వహిస్తున్నారు. విడుదలకు సిద్ధమవుతున్న ఈ చిత్రం గురించి నిర్మాత సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ, 'హైదరాబాద్, ఊటీ, అమెరికాలో షూటింగ్ జరిపాం. ఒక్క పాట మినహా చిత్రీకరణ పూర్తయ్యింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. నితిన్ హీరోగా నటిస్తున్న 25వ చిత్రం కావడం విశేషం. ఈ నెల 12న చిత్ర ఫస్ట్‌లుక్ మోషన్ పోస్టర్‌ను, ప్రేమికుల రోజు సందర్భంగా ఈ నెల 14న టీజర్‌ను, ఏప్రిల్ 5న సినిమాను విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నాం' అని అన్నారు. 'ప్రేమతో కూడిన కుటుంబ కథా చిత్రమిది. సరదాగా సాగుతుంది' అని దర్శకుడు కృష్ణ చైతన్య తెలిపారు. డా॥ కె.వి.నరేష్, లిజి, రోహిణి హట్టంగడి, రావు రమేష్, సంజయ్ స్వరూప్, ప్రభాస్ శ్రీను, నర్రా శ్రీను, మధునందన్, ప్రగతి, పమ్మి సాయి, రాజశ్రీ నాయర్, ఆశురెడ్డి, వెన్నెల రామారావు, కిరీటి, రణధీర్, నీలిమ భవాని, బేబి హాసిని, బేబి కృత్తిక, మాస్టర్ జోయ్, మాస్టర్ లిఖిత్, మాస్టర్ స్నేహిత్, మాస్టర్ స్కందన్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈచిత్రానికి సంగీతం: థమన్ ఎస్.ఎస్, కెమెరా: ఎం.నటరాజ సుబ్రమణియన్, ఎడిటింగ్: ఎస్.ఆర్.శేఖర్, నృత్యాలు : వి.జె.శేఖర్, ఫైట్స్ : స్టంట్ సెల్వ, రవివర్మ.


అను ఇమ్మాన్యుయెల్, అల్లు అర్జున్

లవర్ ఆల్సో.. ఫైటర్ ఆల్సో..

అల్లు అర్జున్, అను ఇమ్మాన్యుయెల్ జంటగా 'నా పేరు సూర్య – నా ఇల్లు ఇండియా' చిత్రంలో నటిస్తున్నారు. వక్కంతం వంశీ దర్శకుడు. కె.నాగబాబు సమర్పణలో, రామలక్ష్మీ సినీ క్రియేషన్స్ పతాకంపై శిరీష శ్రీధర్ నిర్మిస్తున్నారు. బన్నీవాసు సహ నిర్మాత. ఈ చిత్రంలోని 'లవర్ ఆల్సో.. ఫైటర్ ఆల్సో..' అనే పాటను ప్రేమికుల రోజున విడుదల చేయబోతున్నారు. ఆ విశేషాలను నిర్మాతలు తెలియజేస్తూ, 'ఈ చిత్ర టీజర్ చూసిన వారంతా ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. అల్లు అర్జున్ డెడికేషన్, మేకోవర్ గురించి మాట్లాడుకుంటున్నారు. భావోద్వేగమైన సైనిక నేపథ్య పాట ప్రతీ ఒక్క మనసునూ కదిలించింది. మేకింగ్ వీడియో సినిమా సత్తాను చాటింది. దీనికి కొనసాగింపుగా ఈ నెల 14న మరో పాటను రిలీజ్ చేయనున్నాం. 'లవర్ ఆల్సో.. ఫైటర్ ఆల్సో ' అనే పాటను వాలెంటైన్స్ డే సందర్భంగా బన్నీ అభిమానులకు కానుకగా ఇవ్వనున్నాం. ఈ పాటకు రామజోగయ్య శాస్త్రి సాహిత్యమందించగా, బాలీవుడ్ సంగీత ద్వయం విశాల్–శేఖర్ సినిమాకు అద్భుతమైన స్వరాలను సమకూర్చారు. ఈ పాటను శేఖర్ ఆలపించారు. అల్లు అర్జున్, అను ఇమ్మాన్యుయెల్‌పై అందమైన లొకేషన్లలో ఈ పాటను చిత్రీకరించాం. ప్రస్తుతం మన దేశ సరిహద్దుల్లో మైనస్ 12 డిగ్రీల ఉష్ణోగ్రతలో షూటింగ్ చేస్తున్నాం. ఒరిజినల్‌గా మన సైనికులు దేశం కోసం ఎలా పోరాడతారో అలా అల్లు అర్జున్ సైతం సినిమా మీదున్న భక్తితో నటిస్తున్నారు. మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి. ఏప్రిల్ 27న గ్రాండ్‌గా సినిమాని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం' అని అన్నారు.

సేవకు మించిన సంతృప్తి లేదు : జయసుధ


కాదంబరి కిరణ్, జయసుధ, హరీష్‌శంకర్, సుధీర్‌బాబు, బ్రహ్మానందం తదితరులు

'ఛారిటీ కార్యక్రమాలు చేయడం అంత సులభమైన విషయం కాదు. ఎంతో పట్టుదల, ఓపిక ఉండాలి. కానీ సేవకు మించిన సంతృప్తి ఎక్కడా దొరకదు' అని జయసుధ అన్నారు. నటుడు కాదంబరి కిరణ్ ఆధ్వర్యంలో 'మనంసైతం' సంస్థ నడుస్తున్న విషయం విదితమే. పేద కళాకారులకు, టెక్నీషియన్లకు ఆర్థిక సాయం అందిస్తున్నారు. తాజాగా ఏడుగురు అభాగ్యులకు జయసుధ చేతుల మీదుగా ఫిల్మ్ ఛాంబర్‌లో ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 'గతంలో నేను కూడా ఓ స్వచ్ఛంద సంస్థను ప్రారంభించాను. కానీ కొనసాగించలేకపోయాను. 'మనంసైతం' మంచి టీమ్‌తో మంచి సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయం. ఈ సంస్థకు నా సహకారం ఎప్పుడూ ఉంటుంది' అని అన్నారు.

'నేను సేవా కార్యక్రమాలకు దూరంగా ఉంటాననుకుంటారు. కానీ నేను ఎంతో మందికి సహాయం చేశాను. ఆ విషయం ఎవరికీ తెలియదు. నింగీ, నేల ఉన్నంతకాలం 'మనంసైతం'తో నడుస్తాను' అని బ్రహ్మానందం తెలిపారు. దర్శకుడు హరీష్ శంకర్ చెబుతూ, 'మనిషి తనకు కష్టమొస్తే బాధపడతాడు. కానీ ఎదుటివారి కష్టానికి బాధపడే వారే నిజమైన మనిషి. ఇప్పుడు లక్ష మందికి చేరిన ఈ సంస్థ ముందుందు కోటి మందికి చేరాలి. నా సాయం ఎప్పుడు కావాలన్నా మనస్ఫూర్తిగా అందిస్తాను' అని అన్నారు. 'ఒక్కరితో మొదలైన ఈ సంస్థ ఇవాళ లక్ష మంది సైన్యంలా మారింది. 'మనంసైతం' కార్యక్రమాలను చూసి చిరంజీవి, పవన్ కళ్యాణ్, కొరటాల శివ, పూరీ జగన్నాథ్ తదితరులు స్పందించి ఆర్థిక సాయం అందించిన ఈ సంస్థ వెనక తామున్నామంటూ భరోసా ఇచ్చారు. యుకె నుంచి రామ్ నామనగిరి అనే వ్యక్తి లక్షా యాభై వేల రూపాయలు పంపించి ఎవరికైనా సాయం చేయండి అన్నారు. అలా వంద రూపాయల నుంచి లక్షల రూపాయల వరకు సహాయం చేస్తున్న దాతలున్నారు. వాళ్ళందరికీ కృతజ్ఞతలు' అని సంస్థ నిర్వహకుడు కాదంబరి కిరణ్ తెలిపారు. 'మనం సైతం'లో ఇప్పట్నుంచి నేనూ భాగమే అని సుధీర్‌బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో బందరు బాబీ, సురేష్, వేణు, గాయని విజయలక్ష్మి, కవిత తదితరులు పాల్గొన్నారు.


కరీనా కపూర్

మరో రెండు దశాబ్దాలూ..

'నటిగా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చి దాదాపు రెండు దశాబ్దాలు పూర్తి కావస్తున్నాయి. ఇలానే విజయవంతంగా మరో రెండు దశాబ్దాలను పూర్తి చేయాలనుకుంటున్నా' అని అంటున్నారు కరీనా కపూర్. 2000 సంవత్సరంలో 'రెఫ్యూజీ' చిత్రంతో హీరోయిన్‌గా బాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది కరీనా. ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో నటించి అగ్ర నటిగా తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు పొందింది. ప్రెగ్నెన్సీ కారణంగా కొన్నాళ్ళు సినిమాలకు దూరంగా ఉంది. కుమారుడు తైమూర్ అలీ ఖాన్‌కు జన్మనిచ్చిన తర్వాత రీ ఎంట్రీ ఇస్తూ 'వీర్ ది వెడ్డింగ్' చిత్రంలో నటిస్తోంది. ఈ సందర్భంగా కరీనా మాట్లాడుతూ, 'ఈ జర్నీ ఎంతో గౌరవ ప్రదమైనది. సుసంపన్నమైనది. 18 ఏండ్లుగా నటిగా కొనసాగుతున్నా. ఈ జర్నీలో నాకంటూ ఓ ప్రత్యేకమైన స్థానాన్ని ఏర్పర్చుకున్నాను. అందుకోసం నన్ను నేను ఎంతో మార్చుకున్నాను. కాలంతోపాటు జనరేషన్ కూడా మారింది. ఎంతో మంది వస్తున్నారు.. పోతున్నారు. కానీ నేనింకా పదిలంగా నా స్థానంలో ఉన్నానంటే అది నా నమ్మకమే. ఇటీవల మహిళా ప్రాధాన్యత కలిగిన సినిమాలు పెరుగుతున్నాయి. సమాన అవకాశాల విషయంలో మహిళలు గళం విప్పటం అభినందనీయ పరిణామం. మాతృత్వాన్ని ఆస్వాదించిన తర్వాత తిరిగి 'వీర్ డి వెడ్డింగ్' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాను. శశాంక్ ఘోష్ దర్శకత్వం వహిస్తున్న ఈ రొమాంటిక్ కామెడీ చిత్రం నలుగురు స్నేహితుల చుట్టూ తిరుగుతుంది. ఈ చిత్రాన్ని జూన్ 1 విడుదల చేయబోతున్నారు. కచ్చితంగా నాకిది మంచి రీఎంట్రీ ఫిల్మ్ అవుతుందని నమ్ముతున్నాను' అని చెప్పింది.

ప్రేక్షకులకు కృతజ్ఞతలు


బుజ్జి, నాగశౌర్య, ఉషా ముల్పూరి, శంకర్ ప్రసాద్, గౌతమ్

నాగశౌర్య, రష్మిక మండన్నా జంటగా వెంకీ కుడుముల దర్శకత్వంలో ఐరా క్రియేషన్స్ పతాకంపై శంకర్ ప్రసాద్ ముల్పూరి సమర్పణలో ఉషా ముల్పూరి నిర్మించిన చిత్రం 'ఛలో'. ఇటీవల విడుదలైన ఈ సినిమా పాజిటివ్ టాక్ తెచ్చుకుంటున్న నేపథ్యంలో ఆదివారం హైదరాబాద్‌లో థ్యాంక్స్‌మీట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హీరో నాగశౌర్య మాట్లాడుతూ, 'ఈ సినిమా ఒక ఎమోషనల్ జర్నీ. మంచి సినిమా తీశాం. విజయం సాధిస్తుందనుకున్నా. కానీ ఇంత పెద్ద సూపర్ హిట్ అవుతుందని ఊహించలేదు. టికెట్లు దొరకడం లేదంటున్నారు. అందుకు చాలా హ్యాపీగా ఉంది. ఈ సినిమాకు నేనొక్కడినే బలం కాదు. నాతోటి నటీనటులు, సాంకేతిక నిపుణులందరూ కూడా ఎంతో సపోర్ట్ చేశారు. నాకు మా అమ్మానాన్న బలమైతే, ఐరా క్రియేషన్స్‌కి బుజ్జి అంకుల్, శ్రీనివాస్‌రెడ్డి బలం. గత చిత్రాలతో నేను చేసిన తప్పుల్ని క్షమించి మంచి విజయాన్ని అందించిన ప్రేక్షకులకు థ్యాంక్స్' అని అన్నారు. 'ఈ రోజుల్లో డైరెక్టర్‌గా ఛాన్స్ రావడం ఎంత కష్టమో నాకు తెలుసు. అలాంటిది నన్ను నమ్మి సొంత ప్రొడక్షన్‌ను ప్రారంభించి నాకు దర్శకుడిగా అవకాశం ఇచ్చిన నాగశౌర్యకి జీవితాంతం రుణపడి ఉంటా. సినిమా ఇంత భారీస్థాయిలో రావడానికి నిర్మాతలు ఉషా, శంకర్‌ప్రసాద్ కారణం. వాళ్ళని ఎప్పటికీ మర్చిపోలేను' అని దర్శకుడు వెంకీ కుడుముల తెలిపారు. రష్మిక మండన్నా చెబుతూ, 'సినిమాను పెద్ద హిట్ చేయడంతోపాటు నన్ను బాగా ఆదరిస్తున్న తెలుగు ప్రేక్షకులకు థ్యాంక్స్. చిన్న సినిమాకు దక్కిన పెద్ద విజయమిది' అని రష్మిక చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉషా, శంకర్‌ప్రసాద్, గౌతమ్, సాయి శ్రీరామ్, సుదర్శన్ తదితరులు పాల్గొని తమ విజయానందాన్ని షేర్ చేసుకున్నారు.

నేనెలా కారణం అవుతాను..?


కీర్తి సురేష్

'మరోసారి విజయ్‌తో కలిసి నటిస్తున్నందుకు చాలా హ్యాపీగా ఉంది. ఊహించని అవకాశమిది' అని అంటోంది కీర్తి సురేష్. 'ఇదు ఎన్న మాయమ్' చిత్రంతో తమిళంలో, 'నేను శైలజ'తో తెలుగులో కథానాయికగా పరిచయమైంది కీర్తి. ఇటీవల 'అజ్ఞాతవాసి', 'గ్యాంగ్' చిత్రాలతో ఆకట్టుకుంది. ప్రస్తుతం 'సండకోళి 2', 'సామి 2', 'మహానటి'తోపాటు విజయ్‌తో ఓ చిత్రంలో నటిస్తోంది. 'సామి 2' నుంచి త్రిష వైదొలగడానికి కారణం తనే అంటూ వస్తోన్న వార్తలపై కీర్తి స్పందించింది. 'ఈ చిత్రంలో నాకు, త్రిషకు కాంబినేషన్‌లో వచ్చే సన్నివేశాలే లేవు. దీంతో మా ఇద్దరి మధ్య సంబంధమే లేదు. అలాంటప్పుడు ఆమె తప్పుకోవడానికి నేను ఎలా కారణం అవుతాను. ఆమె వెళ్ళిపోవడానికి కారణమేంటనేది నాకు తెలియదు. అందులో నేను జోక్యం చేసుకోను. అలాగే అజిత్‌తో నటిస్తున్నట్టు వస్తున్న వార్తల్లో వాస్తవం లేదు. ఇప్పటి వరకు నన్నెవరూ సంప్రదించలేదు. ప్రేక్షకులకు, నా అభిమానులకు దగ్గరగా ఉండటం కోసం సామాజిక మాధ్యమాల్లో యాక్టివ్‌గా ఉంటున్నాను' అని తెలిపింది. విజయ్‌తో నటిస్తున్న నూతన చిత్రం ఇటీవల ప్రారంభమైన విషయం విదితమే.

ఒకే ఒక పాత్రతో..


ఆదిత్య ఓం

'లాహిరి లాహిరి లాహిరిలో' ఫేమ్ ఆదిత్య ఓం హీరోగా ఓ నూతన చిత్రం రూపొందనుంది. రాఘవ తిరువాయిపాటి స్వీయ దర్శకత్వంలో ఎస్.ఆర్.ప్రొడక్షన్ సమర్పణలో ఎమినెంట్ 5 ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఓ వినూత్న కథాంశంతో తెరకెక్కిస్తున్న చిత్రమిది. ఒకే పాత్రతో సినిమా మొత్తాన్ని తెరకెక్కించడానికి ప్లాన్ చేస్తున్నారు. ఫిబ్రవరి నెలాఖరు నుంచి షూటింగ్ ప్రారంభించనున్నట్టు దర్శక,నిర్మాత రాఘవ తెలిపారు. ఈ చిత్రానికి రాకేష్ గోవర్థన్ స్క్రీన్‌ప్లే అందిస్తుండగా, మధుసూదన్ కోట సినిమాటోగ్రాఫర్‌గా పనిచేయనున్నారు.

ఫీల్‌గుడ్ లవ్ ఎంటర్‌టైనర్


'ఇది నా లవ్ స్టోరీ' చిత్రంలో ఓవియా, తరుణ్

తరుణ్, ఓవియా జంటగా రమేష్‌గోపీ దర్శకత్వంలో అభిరామ్ సమర్పణలో రామ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై ఎస్.వి. ప్రకాష్ నిర్మిస్తున్న చిత్రం 'ఇది నా లవ్‌స్టోరీ'. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఈ నెల 14న సినిమా విడుదల కానుంది. తాజాగా సెన్సార్ పూర్తి చేసుకున్న ఈచిత్రం గురించి హీరో తరుణ్ మాట్లాడుతూ, 'ఓ మంచి ఫీల్‌గుడ్ లవ్ స్టోరీతో తెరకెక్కించిన చిత్రమిది. ఇంత మంచి సినిమాతో ప్రేమికుల రోజు ప్రేక్షకుల ముందుకు రావడం చాలా ఆనందంగా ఉంది. రెగ్యులర్ ప్రేమ కథలకు పూర్తి భిన్నంగా ఉండే చిత్రమిది. మూడు భిన్న పార్శ్వాల్లో నా పాత్ర సాగుతుంది. అభిరామ్, శృతి అనే జంట ప్రేమాయణంలో ఎదురైన సంఘటనల సమాహారమే ఈ చిత్రం. 'మన లైఫ్ మొత్తం ఇచ్చినా ఈ అమ్మాయిలు మనల్ని వెయిట్ చేయిస్తూనే ఉంటారు', 'ఎప్పుడూ అబ్బాయిలే దేవదాసులు కావాలా? మనమూ ఓ సారి అయితేపోలా?' అనే డైలాగులు సినిమాలో ఆసక్తికరంగా ఉంటాయి' అని అన్నారు. 'తెలుగు ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్టుగా సినిమాను ఆద్యంతం ఆసక్తికరంగా తెరకెక్కించాం. ఇప్పటికే విడుదలైన ట్రైలర్, సాంగ్ టీజర్‌లు సోషల్ మీడియాలో ట్రెండింగ్ అవుతున్నాయి. తాజాగా సెన్సార్ పూర్తి చేసుకుని 'యు/ఎ' సర్టిఫికెట్ పొందింది. చాలా రోజుల తర్వాత పూర్తి లవ్ ఫీల్‌ని కలిగించే చిత్రమిదని సెన్సార్ సభ్యులు అభినందించడం హ్యాపీగా ఉంది. కుటుంబమంతా కలిసి చూసేలా సినిమా ఉంటుంది' అని దర్శకుడు రమేష్ గోపీ తెలిపారు. నిర్మాత చెబుతూ, 'ఈ ఏడాది ది బెస్ట్ ఫిల్మ్‌లలో మా సినిమా ఒకటిగా నిలుస్తుంది. వాలెంటైన్స్ డే సందర్భంగా రిలీజ్ కానున్న ఈ చిత్రాన్ని ఆదరించాలని కోరుకుంటున్నా' అని చెప్పారు.

పంచాయతీలకు మరో పంగనామం

గ్రామపంచాయతీల అధికారాల విషయంలో టీఆర్ఎస్ సర్కారు మరో పంగనామం పెట్టేందుకు సిద్ధమైంది.. అసలే నిధులు, విధుల్లేక అవస్థలు, అష్టకష్టాలు పడుతూ వెంటిలేటర్ మీదున్న వాటిని ప్రభుత్వం జీవోల ద్వారా ప్రాణం తీసే ప్రయత్నాలు చేస్తున్నదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పంచాయతీలకు ఉన్న కొద్దిపాటి అధికారాలను రద్దుచేస్తూ.. వాటి ఉనికిని ప్రశ్నార్థకం చేస్తున్నది. ఆదాయం రాకుండా అడ్డుకుంటున్నది. బాజాప్త రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాసేలా నిర్ణయించింది. గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమలు స్థాపించాలంటే నిరభ్యంతర పత్రాలు(ఎన్ఓసీ) ఇచ్చే స్థానిక పంచాయతీల అధికారాన్ని రద్దుచేస్తూ ఈనెల ఒకటిన జీవో నెం.10ని జారీ చేసింది. దీని ద్వారా పంచాయతీ పాలకమండలి అధికారాలను తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల కార్పొరేషన్(టీఎస్ఐఐసీ)కు అప్పగిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. దీనిపై పంచాయతీరాజ్ సంస్థలు, ప్రజాప్రతినిధుల నుంచి తీవ్ర నిరసనతోపాటు సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతున్నది.

- బి. బసవపున్నయ్య

- చట్టాలకు సర్కారు తూట్లు
- పరిశ్రమలకు ఎన్ఓసీలు ఇచ్చే అధికారం రద్దు
- టీఎస్ఐఐసీకి బదలాయింపు
- పాలకవర్గాలు వ్యతిరేకించినా.. సర్కారు దూకుడు



ఒకవైపు ఇలా..

గత నెలలో ఉన్నతాధికారులతో సమీక్ష సందర్భంగా ముఖ్యమంత్రి పంచాయతీల బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నామని, కొత్త పంచాయతీరాజ్ చట్టాన్ని తెస్తున్నామని చెప్పిన సంగతి తెలిసిందే. ఆరు నెలలకుపైగా నూతన చట్టంపై ప్రభుత్వ యంత్రాంగం కసరత్తు చేస్తున్నది. ఇందుకోసం ప్రత్యేకంగా కమిటీ వేసింది. ఆయా రాష్ట్రాలు సైతం తిరిగొచ్చారు. అలాగే, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆధ్వర్యంలో క్యాబినెట్ సబ్‌కమిటీని సైతం నియమించారు. అందులో మంత్రులు కె.తారకరామారావు, టి.హరీశ్‌రావు, పోచారం శ్రీనివాసరెడ్డి, ఈటల రాజేందర్, తుమ్మల నాగేశ్వరరావు, ఇంద్రకరణ్‌రెడ్డి తదితరులు సభ్యులుగా ఉన్నారు. కొత్త చట్టానికి సంబంధించి వరుసగా దాదాపు వారం రోజుల పాటు సమావేశాలు నిర్వహించారు. ఇప్పుడున్న అధికారాలతోపాటు కొత్తవి కల్పించేందుకు కసరత్తు చేస్తున్నామని సెలవిచ్చారు. ఇటీవల పంచాయతీలకు ప్రతియేటా రూ.5 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు నిధులు ఇస్తామని సీఎం కేసీఆర్ పదే పదే ప్రకటించారు. ఆదివారం సైతం పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర నిధులు, ఇతరత్రా విషయాలపై ఉన్నతాధికారులతో చర్చించారు. ఒకవైపు ఇలా చెబుతూ.. మరోవైపు పంచాయతీలకు ఎసరుపెట్టే నిర్ణయాలు తీసుకోవడాన్ని పంచాయతీరాజ్ సంస్థల ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాలు వ్యతిరేకిస్తున్నాయి.

మరోవైపు అలా..

భూనిర్వాసితులకు పరిహారం ఇచ్చేందుకు 2013-భూసేకరణ చట్టాన్ని అమలు చేయాలని కేంద్రం కోరింది. అయితే ఆ చట్టాన్ని కాదని జీవో నెం.123ను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. దీనిపై ప్రజల్లో భారీగా నిరసన వ్యక్తమైంది. సీపీఐ(ఎం) ఆందోళనకు దిగింది. హైకోర్టు ఆ జీవోను కొట్టేసింది. ఆ తర్వాత సర్కార్ రైతు సమన్వయ సమితుల పేర పంచాయతీల అధికారాలకు తూట్లు పొడుస్తూ మరో జీవో 39ని ఇచ్చింది. దీని పేర అధికార పార్టీ కార్యకర్తలకు ఫలహారం అందించే ప్రయత్నాలు చేసింది. ఇది పూర్తిగా స్థానిక సంస్థల కొన ఊపిరి తీసేలా ఉంది. టీఆర్ఎస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో స్థానిక సంస్థలకు 29 అధికారాలను బదలాయిస్తామని చెప్పుకొచ్చారు. అందులో 2008లో పాత ప్రభుత్వాలే జీవో నెంబరు ఒకటి ద్వారా దాదాపు 10 అధికారాలను స్థానిక పాలకమండళ్లకు దఖలుపరిచాయి. టీఆర్ఎస్ సర్కారు వచ్చిన తరువాత తన మేనిఫెస్టోలో పెట్టినట్టుగా ఎలాంటి అధికారాలను ఇవ్వకపోగా ఉన్న అధికారాల కోరలను పీకేస్తున్నది. ఇందుకు తాజా జీవో నెం.10నే సాక్ష్యం. గ్రామాల్లో పరిశ్రమలు స్థాపించాలంటే స్థానిక పంచాయతీ పాలకవర్గ నిరభ్యంతర పత్రం(ఎన్ఓసీ) తప్పనిసరి. ఒకవేళ పంచాయతీ ఎన్ఓసీ ఇవ్వకపోతే పరిశ్రమలుగానీ, ఇతర సంస్థలుగానీ నెలకొల్పడానికి వీల్లేదు. ఈ పరిస్థితి నుంచి పరిశ్రమలు, వాటి యాజమాన్యాలను రక్షించేందుకు ప్రభుత్వం ఉమ్మడి రాష్ట్రంలో రూపొందించిన పంచాయతీరాజ్ చట్టం-1994కు సవరణలు చేసింది. ఇందుకు జీవో నెం.10ని ఆయుధంగా వాడుకుంటున్నది. దీన్ని రాష్ట్రంలోని కొన్ని పంచాయతీలు వ్యతిరేకించి తీర్మానాలు చేసి సర్కారుకు పంపినా, తన విచక్షణాధికారాలతో స్థానిక సంస్థల ఊపిరి తీసేందుకు పూనుకున్నది.

కొత్త చట్టం రాకముందే..

స్థానిక సంస్థల బలోపేతానికి కొత్త చట్టం తెస్తామని చెబుతున్న సర్కారు, అది రాకముందే జీవోల ద్వారా పంచాయతీలకు ఉన్న అధికారాలను ఊడబీకుతున్నది. పాత చట్టానికి సైతం తూట్లు పొడుస్తున్నది. దీన్ని బట్టి కొత్త చట్టం ద్వారా ఏమేరకు పంచాయతీలకు అధికారాలు కల్పించనున్నారనే విషయం ప్రశ్నార్థకమైంది. కేంద్రం నుంచి వచ్చే నిధులను సైతం నిర్దాక్షిణ్యంగా ఆపేస్తున్నది. గతంలో నేరుగా పంచాయతీ ఖాతాల్లోకి వచ్చే నిధులు కాస్త, ఇప్పుడు ప్రభుత్వ ఖాతాలోకి వెళుతున్నాయి. అక్కడి నుంచి రావడానికి తీవ్ర ఆలస్యం జరుగుతున్నది. వచ్చిన నిధులను పన్నులు, కరెంటు బిల్లుల రూపేణా తన ఖజానాకే వచ్చేలా అడ్డుపడున్నది. 13వ, 14వ ఆర్థిక సంఘాల నిధులను పంచాయతీల అవసరాలకు అనుగుణంగా వినియోగించుకునే స్వేచ్ఛ లేకుండా చేసింది. రెండేండ్ల కాలంలో వేల కోట్ల నిధులు ఈ తరహాలో వెళ్లినట్టుగా స్థానిక ప్రజాప్రతినిధులు చెబుతున్నారు. అలాగే, స్టాంపు డ్యూటీ, మైనింగ్ సీనరేజీ, హెచ్ఎండీఏ నుంచి రావాల్సిన వేల కోట్ల నిధులు విడుదల చేయకుండా ప్రభుత్వం తన దగ్గరే పెట్టుకుంది. పంచాయతీలు ఆర్థికంగా పరిపుష్టిగా లేకపోవడంతో, కార్మికులు, ఇతర ఉద్యోగులు, సిబ్బందికి వేతనాలు ఇచ్చే పరిస్థితి లేదు.

ఇది సరికాదు..
తెలంగాణ పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు సిహెచ్.సత్యనారాయణరెడ్డి



పంచాయతీల అధికారాలను రద్దు చేస్తూ ప్రభుత్వం జీవో నెం.10ని జారీచేయడం సరికాదు. ఇప్పటికే పంచాయతీలు ఆర్థికంగా దివాలా తీశాయి. రాష్ట్రం నిధులు ఇవ్వకపోగా కేంద్రం ఇచ్చే నిధులను సైతం ఇష్టానుసారం వాడుకుంటున్నది. స్టాంపు డ్యూటీ, ఫీజులు, హెచ్ఎండీఏ నిధులను, మైనింగ్ సీనరేజీ నిధులను ఆపేసింది. దీనిపై ఆందోళన చేస్తాం.

ఆదాయాన్ని కొల్లగొట్టొద్దు : కె.నిర్మల
తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్, మేడ్చల్-మల్కాజ్‌గిరి గౌరవాధ్యక్షులు



గ్రామపంచాయతీ అధికారాలను రద్దు చేయడం మంచి పరిణామం కాదు. పంచాయతీల్లో నిధుల్లేక గ్రామాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయి. వాటిలో పనిచేసే కార్మికులది మరింత దయనీయ పరిస్థితి. మేడ్చల్ జిల్లాల్లో ప్రతాపసింగారం పంచాయతీలో వచ్చే ఆదాయం కార్మికుల వేతనాలకు కూడా సరిపోవడం లేదు. పరిశ్రమలకు ఎన్ఓసీ ఇచ్చే అధికారం ఉంటే, ఆదాయం రావడానికి అవకాశాలు ఉండేవి. ఇప్పుడు దాన్ని కూడా రద్దుచేసి టీఎస్ఐఐసికి అప్పగించడం ఎంతమాత్రం సరికాదు. జీవోను రద్దు చేయకపోతే ఉద్యమిస్తాం. పంచాయతీలకు వచ్చే బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులు కేటాయించాలి.

8వ తేదీ ఏపీ బంద్‌కు పెరుగుతున్న మద్దతు

అమరావతి: కేంద్ర బడ్జెట్‌లో ఏపీ రాష్ట్ర ప్రభుత్వానికి జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ, విభజన చట్టంలో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని కోరుతూ పది వామపక్షాలు ఇచ్చిన బంద్ పిలుపునకు పెద్ద ఎత్తున స్పందన లభిస్తోంది. అన్ని వైపుల నుండి మద్దతు పెరుగుతోంది. రాజకీయ పార్టీలతోపాటు, కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు ఒక్కొక్కరుగా బంద్‌కు మద్దతు తెలుపుతున్నారు. ఫిబ్రవరి ఒకటో తేదీన కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి ఎటువంటి కేటాయింపులు చేయక పోవడం, విభజన చట్టంలోని హామీలను కనీసం ప్రస్తావించకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల్లో అసంతృప్తి చెలరేగింది. ప్రజల ఆకాంక్షలను కేంద్రా నికి తెలియజెప్పాలన్న ఉద్దేశ్యంతో పది వామ పక్షాలు ఈనెల ఎనిమిదో తేదీన రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చాయి.

గత నాలుగేళ్లుగా విభజన హామీ లను అమలుపరచకుండా కేంద్ర ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని ఎండగట్టేందుకు, హామీలను సాధించ డంలో చంద్రబాబు ప్రభుత్వ వైఫల్యాన్ని ఎత్తి చూపేందుకు వామపక్షాలు బంద్‌కు పిలుపు నిచ్చాయి. ఈ పిలుపునకు ముందుగా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మద్దతు తెలిపింది. ఎనిమిదో తేదీ వరకు ప్రతి రోజు నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రఘువీరా రెడ్డి పిలుపునిచ్చారు. బంద్‌కు వైఎస్ఆర్‌సీపీ కూడా సోమవారం మద్దతు ప్రకటించింది.

ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్ట్, విశాఖ రైల్వే జోన్, దుగ్గరాజు పట్నం పోర్ట్, కడప ఉక్కు పరిశ్రమ తోపాటు విభజన చట్టంలోని హామీల విషయంలో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని... వీటిపై ఏ పార్టీ ఆందోళన చేసినా తాము మద్దతిస్తామని వైఎస్ఆర్‌సిపి కేంద్ర కార్యాలయం నుండి విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి అనుగుణంగానే వామపక్షాలు ప్రకటించిన బంద్‌కు తమ పూర్తి మద్దతు ఉంటుందని ఆ పార్టీ తెలిపింది. మరోవైపు వివిధ వర్గాలకు చెందిన సంఘాలు కూడా బంద్‌కు మద్దతు తెలుపుతున్నాయి. విజయవాడలోని దాసరిభవన్‌లో ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ సంఘాల నేతలు సోమవారం మీడియాతో మాట్లాడుతూ బంద్‌కు మద్దతు తెలిపారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ మోసపూరితమైనదని, దగా కోరుగా వుందని విమర్శించారు.

కార్పొరేట్ వర్గాలకు అనుకూలంగాను, కార్మిక వర్గాలకు నష్టం చేకూర్చేదిగానూ వుందని మండిపడ్డారు. 50కోట్ల మంది కార్మికుల ఆశలపై నీళ్లు పోసిందని వాపోయారు. 5కోట్ల మంది ఆంధ్రులకు ద్రోహం చేసేలా కేంద్ర బడ్జెట్ వుందని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు, అమరావతి రాజధాని, ఏపీకి ప్రత్యేక హోదా, విశాఖ రైల్వేజోన్, కేంద్రప్రభుత్వ విద్యారంగ సంస్థలు నిర్మాణానికి నిధుల కేటాయింపులో మొండిచేయి చూపిందని విమర్శించారు. వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ ఊసేలేదని వాపోయారు. నాలుగేళ్ల నుంచి తన స్వార్థ ప్రయోజనాల కోసం బీజేపీ ప్రభుత్వానికి సీఎం చంద్రబాబు కొమ్ముకాస్తున్నారని వ్యాఖ్యానించారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి కేటాయింపులలో పూర్తిగా వివక్షత కొనసాగిందని, దీనిపై మోడీని ఎందుకు నిలదీయడం లేదని ప్రశ్నించారు. ప్రజల శ్రేయస్సు కంటే అధికార దాహమే చంద్రబాబుకు అధికంగా వుందని విమర్శించారు.

డబుల్‌ను ఆదుకోండి

(మొదటిపేజీ తరువాయి)

బెడ్‌రూం ఇండ్ల నిర్మాణానికి గ్రామీణ ప్రాంతాల్లో (లక్ష ఇండ్లకు) 1.45 లక్షల మెట్రిక్ టన్నులు, పట్టణ ప్రాంతాల్లో (60 వేల ఇండ్లకు) 1.04 లక్షల మెట్రిక్ టన్నులు, జీహెచ్ఎంసీ పరిధిలో (లక్ష ఇండ్లకు) 2.78 లక్షల మెట్రిక్ టన్నులు (మొత్తం 5.27 లక్షల మెట్రిక్ టన్నులు) ఉక్కు అవసరం ఉందని కంపెనీ యాజమాన్యాలకు మంత్రులు తెలిపారు. ఉక్కు విక్రయించిన కంపెనీలకు ఎలాంటి జాప్యం లేకుండా ఆన్‌లైన్‌లో బిల్లుల చెల్లింపులు ఉంటాయని స్పష్టం చేశారు. కాగా దీనిపై అన్ని కంపెనీల యాజమాన్యాలతో చర్చించి ప్రభుత్వానికి తమ నిర్ణయం వెల్లడిస్తామని ఉక్కు కంపెనీల యాజమాన్యాలు స్పష్టం చేశాయి. ఉక్కు కంపెనీల యాజమాన్యాలతో రెండు, మూడు రోజుల్లో మరోసారి సమావేశమై నిర్దిష్టమైన ధరను (బేస్‌రేట్) నిర్ణయించాలని మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, కేటీఆర్....గృహ నిర్మాణ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ చిత్రా రామచంద్రన్‌ను ఆదేశించారు. ఈ సమావేశంలో హౌజింగ్ కార్పొరేషన్ చైర్మెన్ మడుపు భూంరెడ్డి, గృహ నిర్మాణ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ చిత్రా రామచంద్రన్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ డా.టీ.కే శ్రీదేవి, కార్మిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశాంక్ గోయల్, రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ అనిల్ కుమార్, జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ భారతి, గృహ నిర్మాణ శాఖ చీఫ్ ఇంజనీర్ సత్యమూర్తి,, జీహెచ్ఎంసీ సీఈ సురేష్ కుమార్, ఆల్ ఇండియా స్టీల్ అసోసియేషన్ చైర్మెన్ సురేష్‌కుమార్ సింఘాల్, విశాఖ స్టీల్ ప్లాంట్, జిందాల్ ,శాలినీ స్టీల్ కంపెనీలతో పాటు మరో 8 స్టీల్ కంపెనీల యాజమాన్యాలు పాల్గొన్నాయి.

యూరోపియన్ ఏఎన్ఎంలకు వేతనం పెంపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

యూరోపియన్ ఏఎన్ఎంలకు వేతనాన్ని పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 710 మంది ఉన్న వీరికి ప్రస్తుతం రూ.10 వేల వేతనాన్ని ప్రభుత్వం చెల్లిస్తున్నది. దీనిని రూ.21 వేలకు పెంచుతూ సంబంధిత ఫైలుపై సీఎం కేసీఆర్ సంతకం చేశారు. అయితే, ఈ పెంపును యూరోపియన్‌లు వ్యతిరేకిస్తున్నారు. తమకు గ్రాస్‌సాలరీ చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం తమను అన్యాయం చేసిందని మండిపడు తున్నారు. కాగా, రెండో ఏఎన్ఎంలకు వేతనాల పెంపుపై సైతం సానుకూలంగా నిర్ణయం తీసుకోవాలని వైద్యారోగ్యశాఖ మంత్రి, ఆ శాఖ ముఖ్య కార్యదర్శి.. ముఖ్యమంత్రికి విన్నవించారు. వీరి ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకొని త్వరలో నిర్ణయం వెలువరించనున్నట్టు సీఎంవో ఒక ప్రకటనలో తెలిపింది.

దిల్‌షుక్‌నగర్ బాంబు పేలుళ్ల నిందితుడి అరెస్ట్

- ఖతర్‌లో ఉగ్రవాది షఫీక్‌ను రాష్ట్ర సీఐడీకి అప్పగించిన ఇంటర్‌పోల్

నవ తెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి

నగరంలో జరిగిన జంట బాంబు పేలుళ్ల కేసులో నిందితుడు షఫీక్ మున్నావర్‌ను ఇంటర్‌పోల్ అధికారులు ఖతర్‌లో అరెస్టు చేశారు. ఉగ్రవాదిని ఈ కేసు దర్యాప్తు జరుపుతున్న రాష్ట్ర సీఐడీకి సోమవారం అప్పగించారు.అధికారుల తెలిపిన వివరాల ప్రకారం 2013 ఫిబ్రవరిలో జరిగిన దిల్‌షుక్‌నగర్ జంటబాంబుల ఘటనలో దాదాపు ఇరవై మందికి పైగా అమాయకులు మరణించిన విషయం తెలిసిందే. ఈ ఘటనకు బాధ్యులైన కొందరు ఉగ్రవాదులను ఇప్పటికే సీఐడీ అరెస్టు చేసింది. కాగా ఆ అందులో మరో నిందితుడైన షఫీక్ మున్నావర్ దేశం విడిచి పారిపోయాడు. అతన్ని పట్టుకోవడానికి తీవ్రంగా ప్రయత్నించిన సీఐడీ అధికారులు చివరికి ఇంటర్‌పోల్ సహాయాన్ని కోరారు. దీంతో షఫీక్ కోసం తీవ్రంగా గాలించిన ఇంటర్‌పోల్ అధికారులు చివరికి ఐదేండ్ల తర్వాత ఖతర్‌లో పట్టుకున్నారు.

బీఎల్ఎఫ్‌ను బలపరుద్దాం

(మొదటిపేజీ తరువాయి)

సభ్యులు చెరుపల్లి సీతారాములు మాట్లా డుతూ కాంగ్రెస్, టీడీపీ, టీఆర్ఎస్ ఎన్నికల పుడు ప్రజలకు అనేక వాగ్దానాలివ్వడం, అధికారంలోకి వచ్చాక విస్మరించడం ఆనవాయితీగా మారిందని విమర్శించారు. ప్రజల మీద భారాలు మోపడం, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వాలు పెద్దలకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటున్నాయని అన్నారు. ఏ బూర్జువా పార్టీ అధికారంలోకి వచ్చినా ప్రజల ఆకాంక్షలు నెరవేరడం లేదని చెప్పారు. అందుకే బూర్జువా పార్టీలకు ప్రత్యామ్నాయం కోసమే, ప్రజా సమస్యలే పరిష్కారం లక్ష్యంగా బీఎల్ఎఫ్ ఆవిర్భవించిందని అన్నారు. బీఎల్ఎఫ్‌ను ప్రజలు ఆదరించాలని కోరారు. మహాసభ అనంతరం బీఎల్ఎఫ్ ఎందుకు ఆవిర్భవించిందో, ప్రజల్లో చైతన్యం పెంపొందిస్తామని వివరించారు. టీఆర్ఎస్ హామీఇచ్చిన మూడెకరాల భూపంపిణీ, డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు అమలు కాలేదన్నారు. రైతు ఆత్మహత్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. గిట్టుబాటు ధర, మార్కెట్ సౌకర్యం లేక, నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయకపోవడం వల్ల రైతులు సంక్షోభంలో ఉన్నారని అన్నారు. ప్రభుత్వం రైతుల మౌలిక సమస్యలు పరిష్కరించకుండా ఎకరాకు రూ.4 వేలు ఇస్తామని చెప్పడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. విద్యావైద్యం ప్రజలకు ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. బీసీ, ఎంబీసీ సబ్‌ప్లాన్ తేవాలని కోరారు. ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీలకు ప్రయివేటురంగంలో రిజర్వేషన్లు కల్పించాలని సూచించారు. ప్రయివేటు సంస్థలు విచ్చలవిడిగా పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వాటిలో రిజర్వేషన్లు అమలు కాకపోవడం వల్ల ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. ఇంకోవైపు డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు, మూడెకరాల భూమి ఇవ్వకుండా బతుకమ్మ చీరలు, గొర్రెల పంపిణీ, చేపల పంపిణీ, పందుల పంపిణీ అంటూ ఓట్ల కోసం పథకాలు ప్రవేశపెడుతున్నారని విమర్శించారు. పైపై చర్యలతో ప్రయోజనం ఉండబోదని అన్నారు. ప్రజల జీవితాల్లో మార్పు రావాలన్నారు. రాష్ట్రంలో ఏకవ్యక్తి నియంతృత్వ పాలన సాగుతోందని విమర్శించారు. మంత్రులకు అధికారాల్లేవని ఎద్దేవా చేశారు. అధికారాలన్నీ కుటుంబం చేతిలో ఉన్నాయని చెప్పారు. ఇది ప్రజాస్వామ్యానికే విఘాతమని అన్నారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. కులదురహంకార హత్యలు కొనసాగుతున్నాయని అన్నారు.

నల్లగొండలో బొడ్డుపల్లి శ్రీనివాస్‌ను 11 మంది హత్య చేశారని అభియోగముంటే ఇద్దరిపై 302 సెక్షన్ కింద కేసు నమోదు చేశారని చెప్పారు. ఎస్సీ వర్గీకరణ కోసం దీక్ష చేసిన మందకృష్ణను అరెస్టు చేస్తే 15 రోజులైనా బెయిల్ రాలేదని, అదే శ్రీనివాస్ హత్య కేసులో నిందితులకు రెండు రోజుల్లో బెయిల్ వచ్చిందన్నారు. ఒత్తిడి తట్టుకోలేక సీఐ అదృశ్యమయ్యారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వమే దీనికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీజేపీ దళితులు, మైనార్టీలపై దాడులు చేస్తోందన్నారు. మతోన్మాద చర్యలు పెట్రేగిపోతున్నాయని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడతామని అన్నారు. బీఎల్ఎఫ్‌ను బలోపేతం చేసేందుకు గ్రామగ్రామానికి తీసుకెళ్తామని చెప్పారు. ప్రజలను సమీకరించి ఉద్యమాలు నిర్మిస్తామని అన్నారు.

విద్యావైద్యంపై కార్పొరేట్ గుత్తాధిపత్యం : జ్యోతి

విద్యావైద్య రంగాలపై కార్పొరేట్ గుత్తాధిపత్యం కొనసాగుతోందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు టి జ్యోతి చెప్పారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన విద్యా వైద్యం అందే పరిస్థితి లేదన్నారు. అందరికీ ఉచితంగా విద్యా వైద్యం అందించడం ప్రభుత్వాల బాధ్యత అని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. ఇందిరాపార్క్ వద్ద ఉన్న ధర్నాచౌక్‌ను ఎత్తేసి, సమస్యలను వివరించే అవకాశం లేకుండా చేసిందన్నారు. కుటుంబ పాలనతో ప్రజాస్వామ్యానికే నష్టం కలిగిస్తున్నారని చెప్పారు. మద్యం దుకాణాలు పెంచడంతో ఒంటరి మహిళలు పెరుగుతున్నారని అన్నారు. మద్యం దుకాణాలు 2014లో 2,200 ఉంటే, ప్రస్తుతం 3,316కు పెరిగాయని చెప్పారు. ప్రజా సమస్యలు పరిష్కారం కోసం వచ్చిన బీఎల్ఎఫ్‌ను ప్రజలంతా బలపర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు జూలకంటి రంగారెడ్డి పాల్గొన్నారు.

'ఒక్కరోజైనా కమ్యూనిస్టుగా బతకాలి'

- పుచ్చలపల్లి సుందరయ్య జీవితంపై సినిమా
- జనమున్నంత కాలం కళ : షాట్ ప్రారంభ సభలో బాబ్జి, శివారెడ్డి, వీరయ్య
- మూడో రోజూ కొనసాగిన వీధి నాటకోత్సవాలు



నవతెలంగాణ-క్లాక్‌టవర్

'ఒక్క రోజైనా కమ్యూనిస్టుగా బతుకు నేస్తమా' అనే పాట రాసే అదృష్టం తనకు కల్గిందంటే అది ప్రజానాట్య మండలి పుణ్యమే. కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య జీవితంపై త్వరలో సినిమా తీస్తాం. ప్రజల కోసం పుట్టిన కళ ప్రజలున్నంత కాలం ఉంటుంది' అని సినీ దర్శకులు బాబ్జీ అన్నారు. సీపీఐ(ఎం) రాష్ట్ర ద్వితీయ మహాసభల సందర్భంగా నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కళాశాలలో ఏర్పాటు చేసిన వీధి నాటకోత్సవాలు సోమవారం మూడవ రోజూ కొనసాగాయి. బాబ్జి, నటుడు శివారెడ్డి షాట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా బాబ్జీ మాట్లాడుతూ "ఒక్కరోజైనా కమ్యూనిస్టుగా బతకాలి" అనే గొప్ప పాట రాసే అదృష్టం తనకు దక్కిందని, తానూ ఒక పీఎన్ఎం బిడ్డనేనని అన్నారు. దేశం, రాష్ట్రంలో ఎక్కడ ఉద్యమాలు, ఆందోళనలు, దాడులు, దౌర్జన్యాలు జరిగినా కళాకారులు వాటిని కళారూపంలో చూపిస్తారని చెప్పారు. ఉద్యమాలగడ్డపై సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభ, రాష్ట్ర వీధి నాటకోత్సవాలు జరగడం గొప్ప విషయమన్నారు. శివారెడ్డి మాట్లాడుతూ తనకు కళాకారులంటే ఎంతో ఇష్టమని, కళాకారులు మంచి మనస్సు కలిగి ఉండాలని, యువత, మహిళల పట్ల గౌరవం కలిగి ఉండాలని కోరారు.

నవతెలంగాణ ఎడిటర్ ఎస్.వీరయ్య మాట్లాడుతూ కళ కళ కోసం కాదు ప్రజల కోసం పుట్టిందన్నారు. కళ ఎప్పుడూ ప్రజల మధ్య నుంచి విడిపోవడం సాధ్యం కాదని అన్నారు. నేడు సమాజంలో సామాన్యప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతేడాది హైదరాబాద్‌లో ఐటీ రంగంలో 20 వేల మంది ఉద్యోగాలు కోల్పోయారని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 70 ఏండ్లు గడిచినా సమస్యలు పెరుగుతున్నాయే తప్పా తగ్గడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం సినిమా రంగం మాత్రమే దశాబ్దాలుగా కులాలకతీతంగా విలువలతో కూడిన సందేశాన్ని ప్రజలకు అందిస్తున్నాయ న్నారు. అనంతరం మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన కళాకారులు చెక్క భజన, సూర్యాపేట జిల్లాకు చెందిన కళాకారులు నలుపు తెలుపైంది అనే నాటిక, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా కళాకారులు "నిజం తెలుసుకోండి", రంగారెడ్డి జిల్లా కళాకారులు 'రైతు బ్రతుకు-చిరుతల కథ" అనే నాటిక, కామారెడ్డి జిల్లా కళాకారులు "లాల్‌జెండా" అనే నాటిక, హైదరాబాద్‌కు చెందిన కళాకారులు "సంఘం శరణం గచ్ఛామి", నల్లగొండకు చెందిన కళాకారులు " అక్టోబర్ విప్లవం" అనే నాటికపై కళారూపాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పీఎన్ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టా నర్సింహా, రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి సత్తన్న, ఆంధ్రప్రదేశ్ పీఎన్ఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు యాదగిరి, సహాయ కార్యదర్శి కె.జోజి, కోమలి కళాసమితి అధ్యక్షులు పోశ రఘుపతి, రాష్ట్ర నాయకురాలు కె. శారద, వరలక్ష్మి, టీమాస్ జిల్లా కన్వీనర్ నారి అయిలయ్య, జిల్లా అధ్యక్షులు చంద్రమౌళి, కార్యదర్శి కుమ్మరి శంకర్, అజయ్ బాబు పాల్గొన్నారు.

నిరుద్యోగిగా ఉండటం కన్నా..
పకోడీలు అమ్ముకోండి

(మొదటిపేజీ తరువాయి)

ప్రారంభించారు. గంటా 17 నిమిషాల 36 సెకండ్ల సుదీర్ఘ ప్రసంగంలో కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. స్వాతంత్ర్యం అనంతరం ఒక పార్టీకి ప్రజలు పూర్తి మెజార్టీ కట్టబెట్టారని అన్నారు. అయినప్పటికీ తాము ఎన్డీయే భాగస్వామ్యపక్షాలతో ప్రభుత్వం ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ సందర్భంగా నిరుద్యోగ సమస్యపై అమిత్‌షా మాట్లాడుతూ.. నిరుద్యోగిగా ఉండటం కన్నా పకోడీలు అమ్ముకోవడం ఉత్తమం అని చెప్పారు. 'ఈ రోజు పకోడీలు అమ్ముకునే వ్యక్తి కొడుకు భవిష్యత్తులో బడా పారిశ్రామికవేత్తగా మారతాడు' అని అన్నారు. అయితే ఈ పనిని కాంగ్రెస్ పార్టీ నేతలు బిచ్చమెత్తుకోవడంతో పోల్చుతున్నారని ఆరోపించారు. పకోడీలు అమ్ముకోవడాన్ని సిగ్గుతో చూడాల్సిన అవసరం లేదని అన్నారు. జన్‌ధన్ పథకంతో పేదలకు ఉచితంగా బ్యాంకు ఖాతాలు ఇచ్చామని చెప్పారు. జీఎస్టీని గబ్బర్‌సింగ్ ట్యాక్స్‌తో పోల్చడంపై ఆరోపణలు గుప్పించారు. 'జీఎస్టీ దొంగతనమా? పన్ను ఆదాయాలను పేదల, వితంతువుల పథకాలకు చెల్లిస్తాం. ఈ విషయం తెలుసా' అని పరోక్షంగా రాహుల్‌గాంధీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. అలాగే దేశంలో ఏకకాల ఎన్నికలు జరగాలని అన్నారు. తరచూ ఎన్నికలు జరగడం వల్ల అభివృద్ధి కుంటుపడుతుందని చెప్పారు.

కేంద్రంలో 'పేర్లు మార్చే ప్రభుత్వం' : కాంగ్రెస్

కేంద్రంలో అధికారంలో ఉంది 'గేమ్ ఛేంజర్' సర్కారు కాదని 'నేమ్ ఛేంజర్'(పేరు మార్చే) ప్రభుత్వమని కాంగ్రెస్ ఎంపీ, రాజ్యసభా విపక్ష నేత గులాంనబీ ఆజాద్ ఆరోపించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన, స్వచ్ఛభారత్‌తో సహా ఎన్డీయే పథకాలన్నీ కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలేనని చెప్పారు. 'నాలుగేండ్లకాలంలో యూపీఏ హయాంలో పూర్తయిన ప్రాజెక్టులను ప్రారంభించడం, మా ప్రభుత్వ పథకాల పేర్లను మార్చి పెట్టుకోవడం తప్ప ఎన్డీయే సర్కారు చేసిందేమీ లేదు' అని విమర్శించారు. 2014 ఎన్నికల్లో ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15 లక్షలు వస్తాయని చెప్పారని, ఆ డబ్బులు ఎప్పుడు ఏస్తారని ప్రశ్నించారు. ప్రతి యేడాది రెండు కోట్ల చొప్పున ఐదేండ్లలో పది కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీనిచ్చారని, ఇప్పటి వరకు ఎన్ని ఉద్యోగాలు కల్పించారని నిలదీశారు.

ఈ అంశాలేవీ అటు రాష్ట్రపతి ప్రసంగంలో, ఇటు బడ్జెట్‌లో పొందుపరచలేదని విమర్శించారు. యూపీఏ హయాంలో గ్యాస్ ధర పది రూపాయలు పెరిగితే భారత్ బంద్ నిర్వహించారని, కానీ ఎన్డీయే సర్కారు అధికారంలోకి వచ్చాక రూ.350 ఉన్న గ్యాస్ సిలండర్ ధర ప్రస్తుతం రూ. 800 చేరిందని చెప్పుకొచ్చారు. నాలుగేండ్లు పూర్తవుతున్నా స్వచ్ఛభారత్‌లో భాగంగా నిర్దేశించుకున్న మరుగుదోడ్ల నిర్మాణం 60 శాతం కూడా పూర్తికాలేదని, పైగా నిర్మించిన వాటికి నీటి వసతి లేదని అన్నారు. ఇక రైతుల ఆదాయం రెండింతలు చేస్తామని 2014లో చెప్పారని, ఇప్పటి వరకు అడుగు ముందుకు పడలేదని విమర్శించారు. "2014 ఎన్నికల్లో నవ భారతం తీసుకొస్తామని చెప్పారు. ప్రస్తుతం ఎన్డీయే పాలనలో ఎనిమిది నెలల చిన్నారిపై సైతం అత్యాచారం జరుగుతోంది. ఇదేనా మీ నవ భారతం. ఇలాంటి భారతం మాకు వద్దు. మీ నవ భారతంలో హిందూ-ముస్లిముల ఘర్షణలు. నిరుద్యోగం. మాకు మా పాత భారతమైన 'గాంధీ భారతం' ఇవ్వండి" అని ఆజాద్ అన్నారు. ట్రిపుల్ తలాక్ బిల్లుతో ముస్లిం భార్యాభర్తలను సైతం విభజిస్తున్నారని విమర్శించారు.

రాత్రికి రాత్రే కొనుగోలు కేంద్రాల ఎత్తివేత

(మొదటిపేజీ తరువాయి)

తీసుకొచ్చామని రైతులు తెలిపారు. కానీ, దళారులకే ఎక్కువ అవకాశం కల్పిస్తున్నారని, రైతులను పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజులుగా నిద్రాహారాలు మానుకుని కేంద్రాల వద్దే పడిగాపులుగాస్తున్నామని తెలిపారు. తాము విక్రయించిన కందులకు రెండు నెలల నుంచి ఖాతాల్లో డబ్బులు రావడం లేదన్నారు. ఇప్పుడు కేంద్రాలనే ఎత్తేశారని, తమ కందులను రెండు మూడు రోజుల్లో తూకం చేయకపోతే పెద్దఎత్తున ఆందోళన చేపడతామని రైతులు హెచ్చరించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుపట్ల నిర్లక్ష్యం వహించడం ఎంత వరకు సమంజసమని కాంగ్రెస్ తాండూరు నియోజకవర్గ ఇన్‌చార్జి రమేష్ ప్రశ్నించారు. ఈ ధర్నాలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు సుభాస్‌యాదవ్, వికారాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి దివాకర్, మర్పల్లి ఎంపీటీసీ శేఖర్, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

నిలిపేసిన విషయం తెలియదు..

ఎండీ జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా మేనేజర్ జ్యోతి

కందుల కొనుగోలు కేంద్రంలో కొనుగోళ్లు నిలిపేసిన విషయం మాకు తెలియదు. రైతులకు ఎటువంటి సమస్యలు లేకుండా కందులు కొనుగోలు చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటాం.

క్షణికావేశంలో...

(మొదటిపేజీ తరువాయి)

పడుతుండేది. సోమవారం ఉదయం కూడా వారిద్దరు గొడవ పడ్డారు. దీంతో క్షణికావేశానికి గురైన హరిందర్‌గౌడ్ భార్య జ్యోతి, కుమారుడు అభిజిత్‌పార్థు, కూతురు సహస్రను గొంతు నులిమి దారుణంగా హత్య చేశాడు. తర్వాత నేరుగా మీర్‌పేట పోలీసుస్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. సంఘటనా స్థలాన్ని డీసీపీ వెంకటేశ్వర్‌రావు, ఏసీపీ రవీందర్‌రెడ్డి, సీఐ మన్మోహన్ పరిశీలించారు. మృతదేహాలను ఉస్మానియా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

జమిలి ఎన్నికల నిర్వహణ అప్రజాస్వామికం

(మొదటిపేజీ తరువాయి)

చెప్పారు. రూ.లక్ష కోట్లు కావాలని ఆరోగ్య నిపుణులు చెప్తున్నారని అన్నారు. ఇది ప్రభుత్వ ఆరోగ్య రంగాన్ని బాగుచేసే నిర్ణయం కాదన్నారు. పెట్రోల్, డీజిల్ సంక్షోభం కొనసాగుతున్నదని చెప్పారు. పెట్రోల్, డీజిల్‌పై కేంద్రం ఎక్సైజ్ డ్యూటీని తొమ్మిదిసార్లు పెంచిందని అన్నారు. పెట్రోల్‌పై రూ.2 తగ్గించి, సెస్ పేరుతో రూ.2 పెంచుతోందని చెప్పారు. ఒకచేత్తో ఇచ్చి, మరో చేత్తో తీసుకోవడమంటే ఇదే అని ఎద్దేవా చేశారు. ముందస్తు ఎన్నికలపై తమకు ఎలాంటి సమాచారం లేదన్నారు. ప్రస్తుతం త్రిపుర ఎన్నికలు జరుగుతున్నాయని చెప్పారు. ఆ తర్వాత మరికొన్ని రాష్ట్రాలకు ఎన్నికలు జరుగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చెరుపల్లి సీతారాములు, బి వెంకట్, జూలకంటి రంగారెడ్డి పాల్గొన్నారు.

సెన్సెక్స్ ▼310	నిఫ్టీ ▼94	డాలరుకు రూపాయి విలువ	బంగారం(10.గ్రా)	వెండి (కేజీ)	కోడిగుడ్లు			
34,757	10,666	64.06	రూ. 30,909	రూ. 42,600	హైదరాబాద్ 368	ఒక్కగుడ్డుకు 4.30	వరంగల్ 370	విజయవాడ 374, చెన్నై 397, ముంబయి 410






దుమ్ములేపిన టాటా మోటార్స్

- 13 రెట్లు పెరిగిన ఏకీకృత నష్టం



ముంబయి: ఆటోమొబైల్స్ తయారీ దిగ్గజం టాటా మోటార్స్ డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికానికి అద్భుతమైన ఆర్థిక ఫలితా లను ప్రకటించింది. అక్టోబరు- డిసెంబరు (మూడో) త్రైమాసికంలో సంస్థ ఏకీకృత నికర లాభం దాదాపు 13 రెట్లు పెరిగింది. గత ఏడాది ఇదే కాలంలో సంస్థ లాభం రూ.111.6 కోట్లుగా నమోదవగా.. ఈ ఏడాది మూడో త్రైమాసికంలో సంస్థ లాభం రూ.1,215 కోట్లకు చేరుకోవడం విశేషం. స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన సంస్థ నికర లాభం రూ.183.65 కోట్లుగా నమోదు అయింది. అంతకు ముందు రెండో త్రైమాసికంలో (సెప్టెంబరులో..) సంస్థ రూ.295.30 కోట్ల నష్టాన్ని ప్రకటించిన సంగతి తెలిసిందే. గత ఏడాది మొత్తానికి సంస్థ రూ.1,052.13 కోట్ల మేర నష్టాన్ని నమోదు చేసింది. మూడో త్రైమాసిక కాలంలో రూ.1,021 కోట్ల సొమ్మును కొత్త ఉత్పత్తులు, కొత్త ప్లాట్‌ఫాం, టెక్నాలజీ అభివృద్ధి కోసం తాము వ్యచ్చించినట్టుగా సంస్థ తెలిపింది. స్టాండ్ ఎలోన్ ప్రాతిపదికన టాటా గ్రూపు మొత్తం రెవెన్యూ 58.6 శాతం మేర పెరిగి రూ. 16,101.60 కోట్లకు పెరిగింది. ఏకీకృత ప్రాతిపదికన సంస్థ ఆదాయం లో 16.1 శాతం మేర వృద్ధి నమోదు అయింది. జాగ్వార్ వాహనాల అమ్మకాల్లో మేటి వృద్ధితో పాటు వివిధ పోర్ట్‌ఫోలియాల్లో మెరుగైన విక్రయాల మూలంగానే సంస్థ ఘనమైన లాభాలను నమోదు చేయగలి గిందని టాటా మోటార్స్ ప్రకటించింది.

పన్ను ఎగవేతలు వద్దు: సీబీడీటీ

న్యూఢిల్లీ: పన్ను ఎగవేతల కోసం ఐటీ చట్టాలను దుర్వినియోగం చేసే పనులను నిలిపివేయాలని ఇండస్ట్రీ వర్గాలను కేంద్ర ప్రత్యక్ష పన్నుల శాఖ (సీబీడీటీ) చైర్మెన్ సుశీల్ చంద్ర కోరారు. వివిధ మినహాయింపుల తర్వాత బడా కంపెనీలకు 26శాతం పన్నురేటు విధిస్తున్నట్టు ఆయన తెలిపారు. పన్ను చెల్లింపుల విషయంలో వేతన జీవుల కన్నా మరింత ఎక్కువ బాధ్యత ఇండస్ట్రీ వర్గాలపై ఉందన్నారు. తద్వారా పన్ను చెల్లింపుల సమాజ నిర్మాణా నికి విధేయులై కట్టుబడి ఉండాలని సూచించారు. సీఐఐ పోస్ట్-బడ్జెట్ సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. 2018-19 బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ 250 కోట్ల టర్నోవర్ కలిగిన కంపెనీ లకు కార్పొరేట్ టాక్స్‌ను 25శాతం ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. గడిచిన మూడేండ్లుగా ప్రభుత్వం దశలవారిగా పన్ను తగ్గించుకుంటూ వస్తుందన్నారు. ప్రస్తుతం వివిధ క్యాటగిరీలకు చెందిన 7వేల కార్పొరేట్ కంపెనీలు 30శాతం పన్ను శ్లాబులోనే కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. అయితే ఇంద్రస్టీ వర్గాలు కోరినట్టు..అన్ని కార్పొరేట్ కంపెనీలకు 25శాతం పన్ను రేట్లు వర్తింపజేస్తే.. ప్రభుత్వ ఖజానాపై రూ.60 వేల కోట్ల భారం పడుతుందని తెలిపారు.

రెనో నుంచి క్విడ్ సూపర్ హీరో ఎడిషన్

న్యూఢిల్లీ: ప్రముఖ కార్ల తయారీ సంస్థ రెనో సోమవారం క్విడ్ కారును 'సూపర్ హీరో' ఎడిషన్‌లో మార్కెట్లోకి తీసుకు వచ్చింది. ఈ కారు ప్రాథమిక ధరను కంపెనీ రూ.4,34,000గా (ఎక్స్‌షోరూమ్, న్యూఢిల్లీ) నిర్ణయించింది. ఈ సూపర్ హీరో ఎడిషన్ క్విడ్ 1.0 లీటర్ పవర్ ట్రైన్, 67 బీహెచ్‌పీ, 91 ఎన్ఎం సామర్థ్యంతో మ్యానువల్, ఆటోమేటెడ్ ట్రాన్స్‌మిషన్ వేరియంట్లలో అందించనున్నట్టుగా కంపెనీ వర్గాలు తెలిపాయి. ఈ కొత్త ఎడిషన్ కార్లను కేవలం ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ వేదికగా రూ.9,999 చెల్లించి బుక్ చేసుకోవచ్చని తెలిపింది. ఈ స్పెషల్ ఎడిషన్ క్విడ్‌ను మార్వెల్ అవెంజర్స్ సౌజన్యం



తో ఐరన్ మెన్, కెప్టెన్ అమెరికా రకాల్లో అందుబాటులో ఉంచనున్నట్టుగా కంపెనీ వర్గాలు తెలిపాయి.

టీవీఎస్ నుంచి మేటి సామర్థ్యపు స్కూటర్

- ఎన్‌టార్క్ పేరుతో మార్కెట్లోకి విడుదల

చెన్నై: ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ కంపెనీ టీవీఎస్ మోటార్ కొత్త స్కూటర్‌ను విడుదల చేసింది. దీనిని టీవీఎస్ ఎన్‌టార్క్ పేరుతో మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. ఈ స్కూటర్ ధర రూ. 58750 (ఎక్స్ షోరూం న్యూఢిల్లీ)గా కంపెనీ నిర్ణయించింది. టీవీఎస్ సంస్థ ఈ ఎన్‌టార్క్ వాహనాన్ని కొత్త సీవీటీఐ-ఆర్ఈవీఓ ఇంజన్‌తో రూపొందించింది. ఈ కొత్త ఇంజన్ 124.799 సీసీ సామర్థ్యంతో కూడుకున్నది. సింగిల్ సిలిండర్, 4స్ట్రోక్, 3 వాల్వ్, ఎయిర్‌కూల్డ్ ఎస్ఓహెచ్‌సీలు



ఈ ఇంజన్ ఇతర ప్రత్యేకతలు. ఈ వాహనం ఇంజన్ 7500 ఆర్‌పీఎం వద్ద 9.3 బీహెచ్‌పీ శక్తిని విడుదల చేస్తుంది. ఈ ఇంజన్ అత్యధిక సామర్థ్యం 10.5 ఎన్ఎం కావడం విశేషం. ఈ వాహనం అత్యధిక వేగం గంటకు 90 కి.మీ. కేవలం 9 సెకనులో 60 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనుండడం ఈ స్కూటర్ విశిష్టత. కొత్త స్కూటర్ తన స్థానాన్ని మార్కెట్లో మరింత సుస్థిరం చేయగలదని టీవీఎస్ కంపెనీ వర్గాలు భావిస్తున్నాయి. హోండా గ్రేజియా, సుజుకీ యాక్సెస్ 125కు గట్టి పోటీ ఇవ్వనుందని కంపెనీ తెలిపింది.

ముంచేసిన బడ్జెట్..

- దలాల్ స్ట్రీట్‌లో కొనసాగిన నష్టాలు
- సెన్సెక్స్ మరో 309 పాయింట్ల క్షీణత
- రెండు రోజుల్లో 1100 ఫట్
- వెంటాడిన ద్రవ్యోల్బణ భయాలు
- 10,666కు నిఫ్టీ..

ముంబయి: గత కొద్ది రోజులుగా తారజువ్వాల రాణించిన దేశీయ స్టాక్ మార్కెట్లను మోడీ బడ్జెట్ అమాంతం ముంచేసింది. ఇది వరకు బడ్జెట్ కాలంలో ఎప్పుడూ జరగని స్థాయిలో మార్కెట్లు నష్టపోతున్నాయి. గత గురువారం ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రవేశపెట్టిన 2018-19 బడ్జెట్ మదుపర్లకు తీవ్ర అసంతృప్తిని మిగిల్చింది. దీంతో రెండు రోజుల్లోనే సెన్సెక్స్ ఏకంగా 1,149 పాయింట్లు మేర పతనమయ్యింది. సోమవారం కూడా మార్కెట్లు మదుపర్ల విశ్వాసాన్ని చూరగొనలేకపోయాయి. దీంతో బీఎస్ఈ సెన్సెక్స్ 309.59పాయింట్లు పతనమై 34,757.16కు దిగజారింది. 34,719 వద్ద మొదలైన సూచీ రోజంతా ఒత్తిడికి గురి అయ్యింది. ఓ దశలో 34,874 గరిష్ట స్థాయికి చేరనప్పటికీ అనంతరం అమ్మకాల ఒత్తిడితో మరో దశలో 400 పైగా పాయింట్ల నష్టంతో 34,520.80 కనిష్ట స్థాయిని తాకింది. నిఫ్టీ 94.05పాయింట్లు తగ్గి 10,666.55 వద్ద ముగిసింది.

కాగా అంతర్జాతీయ పరిణామాలే మార్కెట్ల పతనానికి కారణమని మంత్రి అరుణ్ జైట్లీ ఆర్థిక శాఖ కార్యదర్శి హస్ముక్ అదియా వివరణ ఇచ్చారు. అయినా మార్కెట్లు నష్టాల నుంచి బయటపడలేకపోయాయి. ఈనెల 7న రిజర్వు బ్యాంకు ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్వహించనుంది. జీఎస్టీ రాకతో వరుసగా ధరలు పెరుగుతున్నాయి. ప్రభుత్వం పెట్టుకున్న అంచనాలకు మించి ద్రవ్యోల్బణం సూచీ నమోదవుతోంది. దీంతో ఆర్‌బీఐ సమీక్షలో వడ్డీ రేట్లను పెంచకపోవచ్చని మదుపర్లలో భయాలు నెలకొన్నాయి. ఈ పరిణామాల మధ్య దలాల్ స్ట్రీట్‌లో నష్టాలు కొనసాగాయి.

రంగాల వారీగా..

బీఎస్ఈలో రంగాల వారిగా క్యాపిటల్ గూడ్స్ 2.65 శాతం, బ్యాంకింగ్ 1.11శాతం, లోహ 0.56శాతం, రియాల్టీ 0.36 శాతం చొప్పున అధిక నష్టాల పాలై మార్కెట్లను ఒత్తిడికి గురి చేశాయి. కాగా ఆటో సూచీ 0.73 శాతం, విద్యుత్ 0.68 శాతం, పీఎస్‌యూ 0.38 శాతం చొప్పున రాణించి మార్కెట్లకు మద్దతునిచ్చాయి. సెన్సెక్స్-30లో హెచ్‌డీఎఫ్‌సీ 4.06 శాతం, లర్సన్ అండ్ టర్బో 3.65 శాతం, ఇండుస్‌ఇండ్ బ్యాంకు 2.36 శాతం, కొటాక్ బ్యాంకు 2.32 శాతం, అదానీ పోర్ట్సు 2 శాతం, బజాజ్ ఆటో 2 శాతం, ఓఎన్‌జీసీ 1.87 శాతం చొప్పున అధిక నష్టాలు చవి చూసిన వాటిలో టాప్‌లో ఉన్నాయి. మరోవైపు భారతీ



ఎయిర్‌టెల్ 4.20 శాతం, టాటా మోటార్స్ 3.12 శాతం, పవర్ గ్రిడ్ 2.08 శాతం, ఐటీసీ 1.43 శాతం, సన్ ఫార్మా 1.08 శాతం, కోల్ ఇండియా 0.99 శాతం చొప్పున అధిక లాభాలు సాధించిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి.

ప్రతికూల పరిణామాలు..

ఈక్విటీలపై రూ.1 లక్ష పైగా లాభాలు ఆర్జించిన మదుపర్లపై లాంగ్‌టర్మ్ ఈక్విటీ గెయిన్స్ (ఎల్‌టీసీజీ)పై 10 శాతం పన్ను విధించాలని కేంద్రం బడ్జెట్‌లో నిర్ణయించింది. ఈ పరిణామం మార్కెట్లను తీవ్ర ఒత్తిడికి గురి చేస్తోంది. మరోవైపు రూ.250 కోట్లకు లోపు కార్పొరేట్ పన్ను రేటును 25 శాతానికి తగ్గిస్తున్నట్టు కేంద్ర ప్రకటించినప్పటికీ మదుపర్లలో విశ్వాసాన్ని నింపలేకపోయింది. మరోవైపు దేశంలో వరుసగా పెరుగుతున్న ద్రవ్యోల్బణంపై మదుపర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ధరల పెరుగుదల వడ్డీ రేట్ల తగ్గుదలకు ప్రధాన అడ్డంకిగా మారనుందన్న విశ్లేషణలు మార్కెట్లను నష్టాలకు గురి చేశాయి. ప్రస్తుత పరిణామాలు పైగా వడ్డీ రేట్ల పెంపునకు ఎక్కడ దారి తీస్తాయోనన్న భయాలు మార్కెట్లను మరింత ఒత్తిడికి గురి చేశాయి.

ప్రపంచ మార్కెట్లు..

అంతర్జాతీయంగా అన్ని యూరప్ మార్కెట్లు నష్టాలు చవి చూశాయి. బ్రిటన్‌లోని ఎఫ్‌టీఎస్ఈ 100 సూచీ 1 శాతం, ఫ్రాన్స్‌కు చెందిన సీఏసీ 40 సూచీ 0.8 శాతం, జర్మనీకి చెందిన డీఏఎక్స్ సూచీ 0.6 శాతం చొప్పున నష్టపోయాయి. యూరప్ ఎస్‌టీఓఎక్స్ఎక్స్ 600 సూచీ 1.1 శాతం విలువ కోల్పోయింది.

పన్ను కారణం కాదు.. : జైట్లీ

దీర్ఘకాలిక మూలధన లాభాలపై 10 శాతం పన్నును ప్రవేశపెట్టడం ద్వారానే మార్కెట్లు పడిపోయాయని భావించడం సరైంది కాదని ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ పేర్కొన్నారు. ప్రపంచ పరిణామాలే ఇందుకు కారణమని పేర్కొన్నారు. ఎల్‌టీసీజీ లేదా బడ్జెట్ వల్ల ఈ పతనం జరగడం లేదని వివరనిచ్చారు. డౌ జోన్స్ కూడా 2 శాతం మేర పడిపోయిందని అన్నారు. డౌ జోన్స్ ఇండస్ట్రియల్ యావరేజ్ 665.75 పాయింట్లు నష్టపోయిందన్నారు. బలహీనమైన అంతర్జాతీయ పరిణామాలే ఇందుకు కారణమని ఆర్థికశాఖ కార్యదర్శి హస్ముఖ్ అదియా కూడా ఇదే తరహా వివరణ ఇచ్చారు.

దిద్దుబాటు మంచిదే : అసోచామ్

కేంద్ర బడ్జెట్ తర్వాత స్టాక్ మార్కెట్లో చోటు చేసుకున్న దిద్దుబాటునీ (కరెక్షన్) ప్రముఖ పారిశ్రామికవేత్తల సంఘం అసోచామ్ సమర్థించింది. ఇప్పటికే మార్కెట్లో ముఖ్యంగా అనేక చిన్న, మధ్య తరహా కంపెనీలు ఆయా కంపెనీల ఆర్థిక పరిస్థితులతో సంబంధం లేకుండా పెరిగాయని తెలిపింది. ఈ నేపథ్యంలో మార్కెట్లో దిద్దుబాటు మంచిదేనని అసోచామ్ అభిప్రాయపడింది. ఈ నెల 7న ప్రకటించే ద్రవ్య, పరపతి విధాన సమీక్షలో ఆర్‌బీఐ కీలకమైన రెపో రేటు పెంచకుండా సంయమనం పాటించాలని కోరింది.

పాతతరం కమ్యూనిస్టుల వారసత్వాన్ని పుణికిపుచ్చుకోవాలి

తెలంగాణ సాయుధ పోరాటానికి ఆకర్షితుడినయ్యా

- స్వాతంత్య్రం వచ్చి 70 ఏండ్లయినా వెట్టిచాకిరీ పోలేదు
- పాలకుల విధానాలపై రాజీలేని పోరు
- ప్రజల్లో తిరిగితేనే సమస్యలు తెలుస్తాయి : నవతెలంగాణతో సీపీఐ(ఎం) మాజీ ఎమ్మెల్యే కుంజా బొజ్జి

పాతతరం కమ్యూనిస్టుల వారసత్వాన్ని ఈతరం పుణికిపుచ్చుకోవాలని సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే కుంజా బొజ్జి చెప్పారు. నాడు కమ్యూనిస్టులు చేసిన త్యాగాలు, పోరాటాల వల్లే ప్రజలకు అనేక సౌకర్యాలు లభించాయని అన్నారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చి 70 ఏండ్లయినా ఇంకా వెట్టిచాకిరీ పోలేదంటే పాలకుల వైఫల్యం కాదా?అని ప్రశ్నించారు. పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. నల్లగొండ పట్టణంలో జరుగుతున్న సీపీఐ(ఎం) రాష్ట్ర ద్వితీయ మహాసభలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన నవతెలంగాణ ప్రతినిధి బొల్లె జగదీశ్వర్‌కు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

కమ్యూనిస్టు పార్టీలోకి ఎలా వచ్చారు. ఏ సందర్భంలో ఆకర్షితులయ్యారు?

వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం జరుగుతున్న కాలం 1947 అది. ఒకవైపు నెహ్రూ సైన్యం, ఇంకోవైపు నిజాం నవాబు సైన్యం ఉన్నాయి. కమ్యూనిస్టు పార్టీకి దళాలున్నాయి. మాది అప్పుడు ఆంధ్రలో వీఆర్ పురం మండలం రేగపల్లి గ్రామం. 1948లో కమ్యూనిస్టులపై నిసేధం ఉంది. దళాలు బతకాలంటే మకాం మార్చువాల్సి వచ్చింది. ఒరిస్సా, ఆంధ్రకు పోవాలంటే నది దాటాలి. పాపికొండల ఓడరేవు దాటి మా ఊరికి దళాలొచ్చాయి. 1951లోనే 22 ఏండ్ల వయసులో నాకు పెండ్లయింది. మా వద్దకు వచ్చి మేం కమ్యూనిస్టులం ప్రజల కోసం పనిచేస్తమన్నరు. వెట్టికి వ్యతిరేకంగా పోరాటం చేస్తమన్నరు. గ్రామాల్లోని ప్రజలంతా ఏకమై దొరలు, భూస్వాములకు ఎదురుతిరగాలని చెప్పింద్రు. నేను అప్పుడే ఆకర్షితుడినయ్యా. ఎండలో... వానలో... ఎన్నాళ్లీ కష్టాలు అని పాటలు పాడుకునే వాళ్లం. పండించిన పంటను తక్కువ ధరకు తీసుకునే వాళు.. ఇవన్నీ చూసి కమ్యూనిస్టు పార్టీలో 1952లో చేరాను. అప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రజల కోసమే బతుకుతున్నా.

అప్పుడు నిర్బంధం ఎలా ఉండేది?



నిజాం పాలన పోయి తర్వాత సైనిక పాలన వచ్చింది. దళాలు జనంలోకి రావాలని మీ జోలికి మేం రాం అని ప్రభుత్వం చెప్పింది. అప్పటికే కమ్యూనిస్టులు నాయకులు, కార్యకర్తలు అజ్ఞాతంలోకి పోయారు. ప్రభుత్వం చెప్పిన దాన్ని నమ్మి ప్రజల్లోకి వచ్చాం. కోర్టుకు హాజరుపరిచి ఇన్ని రోజులు ఎక్కడికి పోయారని అడిగితే పట్నంలో రిక్షా తొక్కుతూ బతికామని చెప్పామన్నారు. భద్రాచలం డివిజన్‌లో పోలీసులు, అటవీ అధికారులు అరాచకాలుండేవి. తీవ్ర స్థాయిలో నిర్బంధముండేది. గ్రామాల్లో తునికాకు పోరాటం చేశాం. వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా పోరాడాం. ప్రజలకు అండగా నిలబడ్డాం.

మొదటిసారి ఎమ్మెల్యేగా ఎప్పుడు గెలిచారు?

నేను మొదటిసారి 1985లో ఎమ్మెల్యేగా గెలిచాను. అప్పుడు 6,636 ఓట్ల మెజార్టీ వచ్చింది. రెండోసారి 1989లో 7,777 ఓట్లతో గెలిచాను. ఆ తర్వాత 1994లో 40 వేల మెజార్టీ వచ్చింది. నేను ఎప్పుడు జనంలోనే తిరిగే వాడిని. అందుకే నన్ను చూసి జనం ఆకర్షితులయ్యారు. నేను చేసిన పోరాటాల్లో భాగస్వాములయ్యారు. బ్రిటీష్ ప్రభుత్వం మాకు భూములు పంచింది. పటేల్ పేరుమీద ఇచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ భూములను రద్దు చేసింది. దానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో నా తల పగిలింది. అయినా ప్రజల వెంటే ఉన్నాను. ఖమ్మంలో జలగం వెంగళరావు, సిద్ధారెడ్డి నాయకత్వంలో ఓ మర్డర్ జరిగింది. కాంగ్రెస్ నాయకులు ఆ కేసు నా మీదకి తోసేశారు. అప్పుడు జైలు జీవితం అనుభవించాను. 1975లో ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ పెట్టినపుడు 6 నెలలదాకా అడవిలో అజ్ఞాతంలో ఉన్నా. ఇలా అనేక నిర్బంధాలు ఎదుర్కొన్నా. ప్రజాప్రతినిధి అయినా ప్రజలతోనే మమేకమయ్యా.

నాడు ఎన్నికల ఖర్చు ఎంతయ్యింది?

1985లో తొలిసారిగా ఎమ్మెల్యేగా పోటీ చేసినపుడు రూ.50 వేలు ఖర్చయ్యాయి. ఆ మొత్తం పార్టీయే భరించింది. ఎమ్మెల్యే జీతం, ఇతర భత్యం అంతా పార్టీయే తీసుకునేది. పార్టీకి విధేయుడిగా పనిచేశా. ఇప్పుడు కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. డబ్బులతో ఓట్లు కొంటున్నారు. గెలిచాక అంతకు అంత మరిన్ని రూ.కోట్లు సంపాదిస్తున్నారు. నేను ఎమ్మెల్యేగా ఉన్నపుడు కాంట్రాక్టర్ల వద్ద, ఇతర పనుల కోసం వచ్చే వారి వద్ద నుంచి ఒక్క రూపాయి తీసుకోలేదు. కనీసం చాయ్ తాగే వాడిని కాదు. అంత నిస్వార్థంగా పనిచేశాను.

ఇప్పుడు రాజకీయాలు ఎలా ఉన్నాయంటారు?

ఇప్పుడన్నీ దొంగ రాజకీయాలు నడుస్తున్నాయి. నిజాయితీ లోపించింది. అంతా డబ్బుమయం. దోచుకుంటున్నారు. స్వాతంత్య్రం వచ్చి 70 ఏండ్లయినా ఇంకా వెట్టిచాకిరీ ఎందుకుంది. ఇది పాలకుల వైఫల్యం కాదా?. ప్రజలకు మేలు చేస్తామనే పార్టీలు ఆలోచించుకోవాలి.

కమ్యూనిస్టు పార్టీల పనితీరు ఎలా ఉందంటారు?

కమ్యూనిస్టు పార్టీలు అప్పుడు, ఇప్పుడు, ఎప్పుడు ప్రజల పక్షాన ఉంటాయి. ప్రజల అభివృద్ధిని కోరుకుంటాయి. నిరాడంబరత, నిస్వార్థంగా పనిచేస్తాయి. పాతతరం కమ్యూనిస్టులు ఎంతో కష్టపడ్డారు, ఎన్నో త్యాగాలు చేశారు. అందుకే ప్రజలకు ఎన్నో సౌకర్యాలు వచ్చాయి. ఈ తరం వారు పాతతరం వారి త్యాగాలు, ఆదర్శాలను పుణికిపుచ్చుకోవాలి. నేను కల్లు, మద్యం, చుట్ట ఏదీ తాగను. నేను తాగితే బూర్జువా పార్టీల నాయకులకు, నాకు తేడా ఏముంటుంది. కమ్యూనిస్టు పార్టీలో లోపముంటే సరిదిద్దుకొని ముందుకెళ్లాలి. నిరంతరం ప్రజల్లో ఉంటేనే సమస్యలు తెలుస్తాయి.

కేంద్రంలోని మోడీ, రాష్ట్రంలోని కేసీఆర్ ప్రభుత్వాలు ధన వంతుల కోసం పనిచేస్తున్నాయి. పెట్టుబడిదారుల ఆస్తులు పెంచడం కోసం విధా నాలు రూపొందిస్తున్నారు. కార్మికులు, పేదలకు చేసిందేం లేదు. టమాట పండించే రైతుకు రూ.1 రావడం లేదు. కానీ కొనే వారికి రూ.50కి దొరుకుతున్నది. ప్రభుత్వాల విధానాల వల్ల రైతులు దివాళా తీస్తున్నారు. ఈ తీరు మారాలి.



బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ డైరీ ఆవిష్కరణ

నల్లగొండ - నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) డైరీని సీఐటీయూ అధ్యక్షురాలు కె హేమలత, రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు, ప్రధాన కార్యదర్శి ఎం సాయిబాబు సోమవారం నల్లగొండ పట్టణంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వంగూరు రాములు, ప్రధాన కార్యదర్శి కోటంరాజు, కార్యర్శులు బ్రహ్మయ్య, ఆకులరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హేమలత మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల ఫలితంగా భవన నిర్మాణ కార్మికులు పరిస్థితి రోజురోజుకు దుర్భరంగా మారుతోందని చెప్పారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నిధులను కార్మికుల కోసం ఖర్చు చేయించడం కోసం ఐక్యంగా పోరాడాలని కోరారు.

మహాసభల్లో రెట్టింపు ఉత్సాహం

- మహాజన పాదయాత్ర, టీమాస్, బీఎల్ఎఫ్‌పైనే చర్చ

నర్రా రాఘవరెడ్డి నగర్ (నల్లగొండ) నుంచి నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

నల్లగొండ పట్టణంలో జరుగుతున్న సీపీఐ(ఎం) రాష్ట్ర ద్వితీయ మహాసభల్లో భాగంగా రెండో రోజు సోమవారం పలు జిల్లాలకు చెందిన ప్రతినిధులు రెట్టింపు ఉత్సాహంగా చర్చల్లో పాల్గొన్నారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రవేశపెట్టిన నివేదికపై మహాసభ చర్చించింది. ప్రధానంగా మహాజన పాదయాత్ర, టీమాస్, బీఎల్ఎఫ్‌లపై చర్చ జరిగింది. వాటితోపాటు తమ తమ జిల్లాల్లో చేసిన కార్యక్రమాలు, పోరాట అనుభవాలను ప్రతినిధులు మహాసభ దష్టికి తెచ్చారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో సర్కారు విఫలమైందని పలువురు నేతలు విమర్శించారు. దాంతో ప్రజల్లో అసంతప్తి నెలకొందని అభిప్రాయపడ్డారు. గత మహసభలో తీసుకున్న లక్ష్యాలను అమలు చేయడంతోపాటు ఇటీవల కాలంలో పార్టీ చేసిన కషిని వివరించారు. పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాజన పాదయాత్రకు వచ్చిన స్పందనను పలువురు గుర్తు చేశారు. సామాజిక శక్తులను ఎలా ఆకర్షించారో వివరించారు. ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగిన విధానాన్ని చెప్పారు. అందువల్లే ఈ ప్రభుత్వం సామాజిక అంశాలను తీసుకొని పలు పథకాలు ప్రకటించదని అభిప్రాయపడ్డారు.

ఏపీకి తీరని అన్యాయం

- ప్రజా ప్రయోజనాలు పట్టని టీడీపీ, వైసీపీ
- వామపక్ష ప్రత్యామ్నాయమే మార్గం : నవతెలంగాణతో సీపీఐ(ఎం) ఏపీ కార్యదర్శి పి మధు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రమైన అన్యాయం చేస్తున్నాయని సీపీఐ(ఎం) ఏపీ రాష్ట్ర కార్యదర్శి పెనుమల్లి మధు విమర్శించారు. అధికార టీడీపీ, ప్రతిపక్ష వైఎస్ఆర్‌సీపీలు ప్రజల ప్రయోజనాలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. రాష్ట్ర పునర్విభజన చట్టంలో పేర్కొన్న అంశాలతోపాటు ఇతర వాగ్దానాలను నెరవేర్చాలని కేంద్రంపై ఒత్తిడి పెంచేందుకే ఈనెల 8న వామపక్ష పార్టీలు రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చాయి. ప్రజా పోరాటాలను సమీక్షించి వామపక్ష ప్రత్యామ్నాయం కోసం కలిసొచ్చే శక్తులన్నింటినీ కలిపి ఉద్యమాలను సాగించడానికి ఈ నెల 10,11,12 తేదీల్లో జరిగే సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభ నిర్ణయాలు తీసుకుంటుంది. తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడిన బీఎల్ఎఫ్ మాదిరిగానే ఏపీలో వామపక్ష ప్రత్యామ్నాయం కోసం కృషి జరుగుతున్నది. నల్లగొండ పట్టణంలో జరుగుతున్న సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర ద్వితీయ మహాసభలకు ఆయన అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నవతెలంగాణ ప్రతినిధి బొల్లె జగదీశ్వర్‌కు ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

8న ఏపీ రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చారు కదా? మీ డిమాండ్లు ఏంటీ?

రాష్ట్రానికి తీవ్రమైన అన్యాయం జరిగింది. కొత్తగా ఏర్ప



డిన ఆంధ్రప్రదేశ్‌కు రాజధాని లేదు. పరిశ్రమలు, విద్యావైద్య సంస్థలు లేవు. విభజన చట్టంలో వీటన్నింటినీ పూరిస్తామని హామీ ఇచ్చారు. కానీ అమలు జరగలేదు. ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో కూడా వాటిని పూర్తి చేస్తామని హామీ ఇవ్వలేదు, నిధులు కేటాయించలేదు. రాయలసీమ, ఉత్తరాంధ్ర వెనుకబడ్డ ప్రాంతాలు చట్టంలో ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించినా కేంద్రం ఇప్పటికీ అమలు చేయలేదు. అధికార టీడీపీ, ప్రతిపక్ష వైఎస్ఆర్‌సీపీ పార్టీలు కూడా ఈసమస్యలను సరిగ్గా పట్టించుకోవడంలేదు. అందువల్ల వామపక్షాలు బంద్‌కు పిలుపునిచ్చాయి.

కేవలం వామపక్షాలే పిలుపునిచ్చాయి. బంద్ జయప్రదం అవుతుందా?

నిజమే. వామపక్షాలు మాత్రమే బంద్‌కు పిలుపునిచ్చాయి. కానీ చాలా సంస్థలు మద్దతునిస్తున్నాయి. ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక, రాయలసీమ అభివృద్ధి వేదిక, రాజధాని అభివృద్ధి వేదిక, ప్రత్యేక హోదా సాధన సమితి, రాజమండ్రి కేంద్రంగా ఉన్న రాష్ట్రీయ కాంగ్రెస్, ప్రత్యేక హోదా కోసం పోరాడుతున్న నవ్యాంధ్ర జేఏసీ వంటి సంస్థలు మా పిలుపుకి స్పందించాయి. పది వామపక్ష పార్టీలతోపాటు పలు ప్రజా సంఘాలు పాల్గొంటున్నాయి. బంద్ కచ్చితంగా విజయవంతమవుతుంది. ఎవరు బంద్ ఇచ్చారనే దానికంటే ఏ అంశాల పరిష్కారం కోసం జరుగుతుందన్నదే ముఖ్యం.

ఏపీలో సీపీఐ(ఎం) అభివృద్ధి గురించి చెప్పండి?

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పార్టీ ఆధ్వర్యంలో చాలా పోరాటాలు ఈ కాలంలో జరిగాయి. బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా, కనీస వేతనాల కోసం, దళితులపై దాడులకు వ్యతిరేకంగా పోరాటాలు జరిగాయి. ప్రభుత్వం తీవ్ర నిర్బంధాలకు పూనుకున్నా కొన్ని ఉద్యమాలు విజయవంతమయ్యాయి. పార్టీ పెరుగుదలకు రాష్ట్రంలో మంచి ప్రాతిపదిక ఏర్పడింది.

సామాజిక తరగతుల్లో స్పందన ఎలా ఉందంటారు?

దళితులు, గిరిజనులు ఈ కాలంలో ఎక్కువ స్పందిస్తున్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో వచ్చిన మార్పుల మూలంగా సామాజిక అణచివేత ఎక్కువైంది. చదువుకున్న యువకుల్లో తిరగబడే చైతన్యం బాగా వెలువడుతోంది. అంబేద్కర్ విగ్రహాన్ని చెరువులో వేసి సమస్య మీద గరగపర్రులో, నీరు చెట్టు పేరుతో భూమిని ఆక్రమించిన దేవరాపల్లిలో, మహాభారతం ఉత్సవాల్లో దళితులకు ప్రవేశం లేదన్న చిత్తూరు జిల్లాలో, గొట్టిపాడులో దళితులపై దాడులకు వ్యతిరేకంగా దళితులు పెద్దఎత్తున కదిలారు. దాదాపు వీటన్నింటిలో విజయాలు సాధించారు. నెల 23న చలో గుంటూరు పేరుతో సామాజిక న్యాయం కోసం రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నాం

ఏపీ రాజకీయం తీరు తెన్నులేంటి ?

అధికార టీడీపీ, ప్రతిపక్ష వైఎస్ఆర్‌సీపీ రాష్ట్రం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపడం లేదు. వామపక్ష ప్రత్యామ్నాయమే మార్గం అన్నది ఇప్పుడిప్పుడే పలువురు అంగీకరిస్తున్నారు. జనసేన కూడా అధికార పార్టీ పట్ల స్పష్టమైన వైఖరి చెప్పలేదు. అందువల్ల కొన్ని తరగతుల ప్రజల్లో ప్రత్యామ్నాయం కోసం పెనుగులాటలు సాగుతున్నాయి.

ఆకట్టుకుంటున్న పుస్తకాలు

నవతెలంగాణ పబ్లిషింగ్‌హౌజ్‌కు విశేష ఆదరణ :

నర్రా రాఘవరెడ్డి నగర్ (నల్లగొండ) నుంచి బొల్లె జగదీశ్వర్

'తలదించుకొని చూడు. తల ఎత్తుకునేలా చేస్తా' అంటుంది పుస్తకం. చిరిగిన చొక్కా అయినా తొడుక్కో మంచి పుస్తకం కొనుక్కో అన్నదీ గుర్తుండే ఉంటుంది. ఇదీ పుస్తకానికి ఉండే ప్రాధాన్యత. నల్లగొండ పట్టణంలో సీపీఐ(ఎం) రాష్ట్ర ద్వితీయ మహాసభలు ఆదివారం నుంచి జరుగుతున్నాయి. నవతెలంగాణ పబ్లిషింగ్ హౌజ్ పుస్తక ప్రదర్శనను ఏర్పాటు చేసింది. ఈ ప్రదర్శనలో ఉన్న పలు రకాల పుస్తకాలు అతిథులు, ప్రతినిధులు, పరిశీలకులను ఆకట్టుకుంటున్నాయి. సామాజిక, కమ్యూనిస్టు, బహుజన, దళిత సాహిత్యం, వీర తెలంగాణ సాయుధ పోరాటం వంటి ఎన్నో రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. ప్రముఖుల జీవిత చరిత్రలు, నవలలూ ఉన్నాయి. పురాతన, ఆధునిక సైన్స్, సమకాలీన రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాలతో కూడిన పుస్తకాలకు విశేష ఆదరణ లభిస్తున్నది. రష్యా విప్లవానికి సంబంధించిన అరుదైన పుస్తకాలు అందుబాటులోఉన్నాయి. మార్క్స్, అంబేద్కర్, పూలే రాసిన రచనలున్నాయి. నవ తెలంగాణ ప్రచురణలపై 30శాతం, ఇతర పుస్తకాలపై 10



శాతం రాయితీ ఇస్తున్నది. తెలుగుతోపాటు ఇంగ్లీష్ భాషలకు చెందిన పుస్తకాలూ అందుబాటులో ఉన్నాయి.

రెండు పుస్తకాల ఆవిష్కరణ : సీపీఐ(ఎం) రాష్ట్ర ద్వితీయ మహాసభల్లో సోమవారం తెలంగాణ పల్లెలు పుస్తకాన్ని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సామాజిక న్యాయం-కమ్యూనిస్టులు పుస్త కాన్ని ఆపార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్‌కరత్ ఆవిష్కరిం చారు. ఈకార్యక్రమంలో సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యు లు బివి రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య, జి.నాగయ్య, ఎమ్మెల్యే సున్నం రాజయ్య, చుక్క రాములు, ఆ పార్టీ సీని యర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, ఏపీ రాష్ట్ర కార్యదర్శి పి మధు తదితరులున్నారు.

మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర ముగింపు దశకు చేరుకున్నది. రేపు బుధవారం (7-2-2018)తో నిజానికి జాతర ముగుస్తుంది. కానీ సమ్మక్క వన ప్రవేశంతో జాతర ముగిసిపోయినట్లు చాలా మంది భావిస్తున్నారు. అది నిజంకాదు. మొత్తం జాతర నాలుగు దశల్లో నాలుగు బుధవారాలు జరుగుతుంది. ఆ వివరాలను 'జాతర' పాఠకుల కోసం సచిత్రంగా ఇస్తున్నాం.






తిరుగువారంలో...

గుడి మెలిగే పండగ

మేడారం జాతరలో మొదటి దశను గుడిమెలిగే పండగ అంటారు. బుధవారం నాడు పూజారి సిద్ధబోయిన మునీందర్ ఇంటిదగ్గర పూజలో ఉపయోగించే వస్తువులను శుద్ధి చేస్తారు. ఆ వస్తువులను ఇతర పూజాద్రవ్యాలను తీసుకొని మేడారంలోనే ఉన్న సమ్మక్క దేవాలయానికి వెళతారు. అక్కడ కోయలందరూ కలిసి గుడిని కడిగి, తుడిచి శుభ్రం చేస్తారు. ముగ్గులతో అలంకరిస్తారు. ఆ తరువాత పూజలు చేస్తారు.దీనే గుడిమెలిగే పండగ అంటారు. నిజానికి పూర్వం మరికొంత శ్రమతో కూడిన పని చేసేవారు. అడవికెళ్ళి కట్టెలు, ఆకులు, రెల్లు గడ్డి తీసుకువచ్చి గుడిసె వేసేవారు. ఆ గుడిసె గోడలు, నేల అలికి ముగ్గుపెట్టి పూజలు చేసి జాతరకు తెరలేపేవారు. ఇప్పుడు గుడిసె స్థానంలో కాంక్రీటు గుడి కట్టింది ప్రభుత్వం. గుడిసె ఉన్నప్పుడు అలికి ముగ్గులు పెట్టి గుడిసెను సిద్ధం చేయడం వల్ల గుడి మెలిగే (గుడిని అలికే)పండుగ అనే పేరుతో జాతర పనులు ప్రారంభమయ్యేవి. ఇప్పుడు కాంక్రీటు గుడి కట్టినా ఆ పేరు మాత్రం అట్లాగే నిలిచిపోయింది.



రెండో బుధవారం మండమెలిగే పండగ

గ్రామంలో ఉన్న గ్రామదేవతలైన బొడ్డురాయి, పోతురాజు, యెల్లమ్మ, కట్టమైసమ్మ, ఆంజనేయుడు వంటి దేవతలను ఆరోజు మొక్కుతారు. ముందుగా పూజారి మునీందర్ ఇంటి దగ్గర నుంచి పూజా సామగ్రి తీసుకొని సమ్మక్క గుడికి వెళతారు గ్రామస్తులు. అక్కడ ఒక పందిరి వేస్తారు. దాన్ని ఎలుగుతారు. తరువాత ముగ్గులు పెట్టి డోలు వంటి వాయిద్యాలతో చప్పుడు చేస్తూ గ్రామ దేవతలందరినీ పూజించి మొక్కుతారు. ఊరు చివరికి పోయి (ఊరు మొదలయ్యే చోటకు పోయి) శాక నీరు పోస్తారు. రెండు బూరుగు చెట్టు స్తంబాలను అటొకటి, ఇటొకటి పాతి మామిడాకు తోరణం కడతారు. ఆ తోరణానికి ఒక కోడిపిల్లను తలకిందులుగా వేలాడ దీస్తారు. అట్లాగే ఒక ఆనపకాయిని కూడా వేలాడదీస్తారు. ఆ తరువాత డోల్ల శబ్దాలతో ఊరు మధ్యకు వచ్చి అక్కడ మరో తోరణాన్ని పైన చెప్పినట్లే కడతారు. దీన్ని మండమెలిగే పండగ అంటారు.

మూడో బుధవారం

జాతర మొదలైన మూడో బుధవారం నాడు సారలమ్మ కన్నెపల్లి నుంచి వచ్చి మేడారంలో ఉన్న గద్దెనెక్కుతుంది. సారలమ్మ దేవత ఉండేది కన్నెపల్లిలో. దాదాపు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న కన్నెపల్లి నుంచి బుధవారం రోజున మేడారానికి చేరుకుంటుంది. సారలమ్మకు ఆరుగురు పూజారులుంటారు. అందరూ కాకా వంశస్తులే. సమ్మక్కకు కొక్కెర, మల్లెల, సిద్దబోయిన, చందా ఇంటి పేరున్న వారు పూజారులుగా ఉంటారు. కానీ సారలమ్మకు కేవలం కాకా వంశస్తులే పూజారులుగా ఉండటం గమనార్హం. మండవెల్లి పండగ జరపడంతోనే సారలమ్మ జాతర ప్రారంభ మైనట్లు లెక్క. ఊరుచుట్టు బలి తీస్తారు. పందిపిల్లను ఊరు చుట్టు చప్పుళ్ళతో తిప్పి దాన్ని అమ్మవారి గుడి దగ్గరకు తీసుకువస్తారు కాకా వంశస్తులు. ఒక కట్టె పుల్లకు దాని నాలుగు కాళ్ళు కట్టి వేలాడదీస్తూ గుడి చుట్టూ మూడు ప్రదక్షిణలు చేస్తారు. దాన్ని బలిచ్చి తల, రక్తాన్ని గుడి ఎదురుగా ఉన్న తొక్కుడు బండకింద పూడ్చి పెడతారు. తొక్కుడు బండ పవిత్రమైనది. దాన్ని తొక్క కూడదు అనే నమ్మకం ఉంది. ఆ బండను దాటి గుళ్ళోకి వెళ్ళాలి. పంది పిల్లను గుడి చుట్టూ కట్టు తీసేటప్పుడు ఒక ఇత్తడిపళ్ళాన్ని తీసుకొని చేత్తో కొడుతూ ఉండాలి. అట్లాగే పందిని కూడా కొడితే గీర్... గీర్ మని శబ్దం రావాల. గుడిచుట్టూ తిరుగుతున్నంత సేపు అది అరుస్తూనే ఉండాలి. పంది మొండెంను కేవలం మంటల్లో కాల్చుకుని మాత్రమే తినాలి కాని కూర వండుకుని తినకూడదు అనే నమ్మకం ఉంది. ఈ సందర్భంగా కాకా వంశ పూజారులు కులపెద్దలను, బంధువులను పిలిచి తాగించి మర్యాద చేస్తారు. వేటపిల్లను కోసి భోజనాలు పెడతారు. గుడికట్టు తీసి ఎల్లొస్తారు. మళ్ళీ బుధవారం అమ్మవారు గద్దె దగ్గరకు వెళ్తుంది.

సారలమ్మ గద్దెకెళ్ళే రోజు ఉదయం పది పదిన్నరలోపు అయిదుగురు ఆడపిల్లలను పిలిచి తలార స్నానాలు చేయిస్తారు. ఇత్తడి సరవలు రెండు, స్టీలు సరవలు రెండు, మట్టి కుండ ఒకదాన్ని తీసుకొని గద్దెల దగ్గరకు చప్పుళ్ళతో వెళతారు. అక్కడ ఉన్న గద్దెలను శుభ్రంగా కడుగుతారు. ఆతరువాత పసుపు కుంకుమలు, చీరలు పెట్టి ఎల్లొస్తారు. తిరిగి కన్నెపల్లి వచ్చేటప్పుడు వారితోపాటు కలెక్టరు, ఎస్పీ, దేవాదాయశాఖ అధికారులు వంటి మొత్తం ప్రభుత్వాధికారులు కన్నెపల్లి వస్తారు. వచ్చి ముందు పాలపూజ చేస్తారు పూజారులు. ఆ తరువాత సారలమ్మను మేడారం తీసుకుపోవడానికి సిద్ధం చేసుకుంటారు. చప్పుళ్ళతో సకల ప్రభుత్వ అధికారులు అనుసరిస్తుంటే సారలమ్మను తీసుకొని కన్నెపల్లివారు మేడారం చేరుకుంటారు.

అట్లాగే పగిడిద్దరాజు పూనుగండ్ల నుండి వచ్చి ఆయన గద్దెను ఎక్కుతాడు. కొండాయి నుంచి గోవిందరాజు వచ్చి తన గద్దెను అధిష్టిస్తాడు.





సమ్మక్క గద్దెనెక్కడం

బుధవారం సారలమ్మ గద్దెనెక్కితే గురువారం సమ్మక్క గద్దెమీదికి వస్తుంది. గద్దెమీదికి వచ్చే ముందు అనేక క్రతువులు, పూజలు చేస్తారు కోయలు. అందులో ముఖ్యమైనది ఎదురేట. దేవునిగుట్ట కింద జల ఉంటుంది. అది ఆ గుట్టకింద కెల్లే వస్తది. ముందుగా కొండమీద ఉన్న సమ్మక్కను తీసుకు వచ్చే పూజారులు ఈ జలలో కాళ్ళు కడుక్కుంటారు. సమ్మక్క కిందికి దిగుతున్న సమయంలో ఎదురెళ్ళ మండ దగ్గర సెలపెయ్యను బలిస్తారు. సెలపెయ్యి అంటే మరక లేకుండా ఉండే తెల్లటి ఆవుదూడ. ఇలా బలివ్వడాన్ని ఎదురేట అంటారు. ఇప్పాకులు, పాలాకులు, అయిదు సేర్ల ఇప్పపూవు సారా, ఐదు సేర్ల కల్లు తెచ్చుకొని తాగుతారు. అట్లాగే బలిచ్చిన సెలపెయ్యి లోపలి అవయవాలు తీసి కాల్చుకుని ఆకుల్లో తలాకింత తింటారు. దీన్నే సాక అంటారు. ఇది కులస్తులను మర్యాదచేసి సంతృప్తిపరచడం కోసం చేసే విందులాంటిది . గురువారం సమ్మక్క గద్దెనెక్కిన తరువాత నిండు జాతర ప్రారంభమైనట్లు. ఒకప్పుడు కులపెద్దలు చిలకల గుట్ట ఎక్కేవారు. ఇప్పుడు యువకులే ఎక్కుతున్నారు. వారందరూ అమ్మవారికి రక్షణగా నిలుస్తారు. పోలీసులకు బదులు వారే ఉంటారు. వీరందరూ గుట్ట సగం వరకు ఎక్కి అక్కడక్కడా కట్టెలు పట్టుకొని నిలుచుంటారు. అమ్మవారుండే ప్రదేశానికి వెళ్ళేది ఒక్కరే. ప్రస్తుతం కొక్కెర కృష్ణయ్య ఆ విధి నిర్వర్తిస్తున్నాడు. .కొక్కెర వంశస్తులే అమ్మవారిని తీసుకువచ్చే హక్కు కలిగి ఉంటారు. అదివరకు కొక్కెర ఎంకన్న ఉండేవాడు. కొండ దిగిన సమ్మక్క గద్దె దగ్గరకు వస్తుంది. ఆ సంరంభాన్ని చూడాలే కాని చెప్పనలవికాదు. సమ్మక్క గద్దెనెక్కిన రోజే భక్తులు పోటెత్తుతారు. ఆ మరుసటి రోజు అంటే శుక్రవారం భక్తులు మొక్కులు తీర్చుకుంటారు.

వనప్రవేశం

శనివారం నాడు మేడారం గద్దెలపై కొలువుదీరిన దేవతలు, దేవుళ్లు అందరూ స్వస్థలాలకు బయలుదేరి వెళ్ళిపోతారు. ఈ వెళ్లే క్రమంలో చాలా సేపు పూజా కార్యక్రమాలు జరుగుతాయి. ఈ ఏడాది భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటంతో వనప్రవేశ కార్యక్రమం ఆలస్యంమయింది. ముందుగా గద్దెల ప్రాంగణం నుంచి సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులను తీసుకుని బయలుదేరారు. ఆ తరువాత చివరగా సమ్మక్కను చిలకల గుట్టకు తీసుకువెళ్లారు. ఈ వన ప్రవేశ ఘట్టం సమయంలో భక్తులు గద్దెల చుట్టుపక్కల ప్రాంతంలో పోటెత్తారు. ఈ కార్యక్రమం ముగిసిన తరువాత చాలామంది ఇండ్లకు వెనుదిరిగారు.

నాలుగో దశ తిరుగువారం

పూజలు ప్రారంభమైన తరువాత వచ్చే నాలుగవ బుధవారం ... అంటే వన ప్రవేశం తరువాత వచ్చే బుధవారం నాడు తిరుగు వారం పండుగ చేస్తారు. ఈ రోజు మేడారం ఊళ్లో ఉన్నవారందరూ తమ ఆడ బిడ్డలను, ఇతర బంధువులను ఇండ్లకు ఆహ్వానిస్తారు. ఇండ్లు సుభ్రం చేసుకొని సమ్మక్క గుడి దగ్గరకు పోతారు (గద్దెల దగ్గరకు కాదు). అక్కడ పూజలు చేసి చెట్లలోకి పోయి వంటలు చేసుకుని తింటారు. ఆరోజు చెట్ల కింద కోళ్లు, మేకల వంటి వాటిని కోసుకుని తింటూ, మద్యపానం సేవిస్తూ మహదానందం పొందుతారు. దీంతో మేడారం జాతర ముగిసినట్లవుతుంది.

జి.శివరామకృష్ణయ్య
7702508259







పిప్పళ్ల వెంకటేష్













అమ్మాయిలు అదుర్స్

తొలి వన్డేలో సఫారీపై 88 పరుగులతో విజయం

కింబర్లె (దక్షిణాఫ్రికా) : 2017 ప్రపంచకప్ తర్వాత తొలిసారి మైదానంలో అడుగుపెట్టిన భారత మహిళల జట్టు అదరగొట్టింది. దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి వన్డేలో 88 పరుగులతో భారీ విజయం సాధించింది. ఓపెనర్ స్మృతి మంధానా (84, 98 బంతుల్లో 8 ఫోర్లు, 1 సిక్స్)తో చెలరేగింది. కెప్టెన్ మిథాలీ రాజ్ (45, 70 బంతుల్లో 2 ఫోర్లు) సమయోచిత ఇన్నింగ్స్‌తో రాణించింది. దీంతో టాస్ నెగ్గి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ ఏడు వికెట్ల నష్టానికి 213 పరుగులు చేసింది. సీనియర్ పేసర్ జులన్ గోస్వామి (4/24), శిఖా పాండే (3/23)లకు తోడు పూనం యాదవ్ (2/22) చెలరేగటంతో ఛేదనలో దక్షిణాఫ్రికా మహిళల జట్టు 125 పరుగులకే కుప్పకూలింది. కెప్టెన్ వాన్ నికెర్క్ (41) మాత్రమే భారత బౌలర్లతో కాసేపు పోరాడారు. ఆల్ రౌండ్ ప్రదర్శన చేసిన అమ్మాయిలు సిరీస్‌లో 1-0తో ఆధిక్యం సాధించారు. మూడు వన్డేల సిరీస్‌లో రెండో మ్యాచ్ బుధవారం జరుగుతుంది.

షట్లర్ల ఆసియా పోరు



అలోర్ సెతార్ : బ్యాడ్మింటన్ స్టార్స్ ఆసియా పోరుకు సిద్ధమయ్యారు. సైనా నెహ్వాల్ తప్పుకోగా, హెచ్.ఎస్ ప్రణయ్ గాయంతో నిష్క్రమించగా భారత్ బలం కాస్త తగ్గినా.. సెమీఫైనల్స్ వరకూ చేరుకునే అవకాశం కనిపిస్తోంది. పురుషుల జట్టును శ్రీకాంత్, మహిళల జట్టును సింధు నడిపించనున్నారు. గ్రూప్-డిలో మాల్దీవులు, ఇండోనేషియా, ఫిలీప్పిన్స్‌లతో భారత్ తలపడనున్నది. నేడు ఫిలీప్పిన్స్‌తో శ్రీకాంత్‌సేన తొలి మ్యాచ్ ఆడనున్నది. అమ్మాయిలు గ్రూప్-డబ్ల్యూలో జపాన్, హాంగ్‌కాంగ్‌లతో కూడిన కఠిన డ్రా ఎదుర్కొంటుంది. థామస్, ఉబెర్ కప్‌లకు ఇది అర్హత రౌండ్ కావటంతో అన్ని జట్లూ సర్వ శక్తులూ వడ్డనున్నాయి.

ముంబయి టు బెంగళూర్!

- బీసీసీఐ ప్రధాన కార్యాలయం మార్పు యోచన



ముంబయి : భారత క్రికెట్ బోర్డు ప్రధాన కార్యాలయం చిరునామా మార్చుకునేందుకు వేగంగా అడుగులు వేస్తోంది. ప్రపంచంలోనే ధనిక క్రికెట్ బోర్డు బీసీసీఐకి సొంత కార్యాలయం లేదు. ముంబయిలో వాంఖడే స్టేడియంలో క్రికెట్ సెంటర్‌లో అద్దె ప్రాతిపదికన బీసీసీఐ ప్రధాన కార్యాలయం నడుస్తోంది. అయితే జాతీయ క్రికెట్ అకాడమీ నిమిత్తం బీసీసీఐ బెంగళూర్‌లో 40 ఎకరాల సువిశాల భూమిని కొనుగోలు చేసింది. ఇందుకు సంబంధించిన భూమి అప్పగింత ఇప్పటికే పూర్తయ్యింది. ఇక్కడ అధునాతన జాతీయ క్రికెట్ అకాడమీతో పాటు బోర్డు ప్రధాన కార్యాలయాన్ని కూడా ఏర్పాటు చేయటంపై రాష్ట్ర సంఘాల అభిప్రాయం కోరుతూ బీసీసీఐ తాత్కాలిక అధ్యక్షుడు సి.కె ఖన్నా లేఖ రాశారు. ముంబయి, ఢిల్లీలలో బోర్డు సమావేశాలు జరిగినప్పుడు ఆఫీస్ బేరర్స్ ఐదు నక్షత్రాల హోటల్ బస ఖర్చు తడిసి మోపడవుతోంది. బోర్డు కార్యదర్శి అమితాబ్ చౌదరి నెలలో 25 రోజులు ప్రయాణం చేస్తూనే ఉంటారు. అమితాబ్ హోటల్ బిల్లులే రూ. కోట్లలో వస్తోంది. ఆఫీస్ బేరర్ల బస ఖర్చులను తగ్గించుకునేందుకు కొత్త కార్యాలయంలో ఫైవ్ స్టార్ బస సదుపాయాలు సైతం ఏర్పాటు చేయాలని బోర్డు యోచిస్తోంది. రానున్న రెండు-మూడు ఏండ్లలో బెంగళూర్‌లో ఇందుకు సంబంధించి నిర్మాణం పూర్తి కావొచ్చని తెలుస్తోంది. దీంతో బీసీసీఐ చిరునామా ముంబయి నుంచి బెంగళూర్‌కు మారేందుకు మరెంతో సమయం పట్టదని చెప్పవచ్చు!.

డికాక్‌కు మణికట్టు గాయం

వన్డే, టీ20 సిరీస్‌కు దూరం

కేప్‌టౌన్ : దక్షిణాఫ్రికాకు ముచ్చటగా మూడో ఎదురుదెబ్బ. తొలి వన్డేకు ముందు ఏబీ డివిలియర్స్, రెండో వన్డేకు ముందు డుప్లెసిస్‌లు గాయంతో దూరం కాగా.. తాజాగా మూడో వన్డేకు ముందు వికెట్ కీపర్ క్వింటన్ డికాక్ నిష్క్రమించాడు. సెంచూరియన్ వన్డేలో జశ్‌ప్రీత్ బుమ్రా బౌలింగ్ ఎదుర్కొన్న సందర్భంలో డికాక్ వరుసగా రెండు సార్లు బౌన్సర్లతో ఇబ్బంది పడ్డాడు. బుమ్రా బంతి చేతి వేళ్లకు తాకటంతో డికాక్ అక్కడే విలవిల్లాడు. తదుపరి వైద్య పరీక్షల అనంతరం మణికట్టు గాయం అని తేలింది. దీంతో డికాక్‌కు కనీసం 2-4 వారాల పాటు విశ్రాంతి అవసరం. డికాక్ స్థానంలో సెలక్టర్లు మరో ఆటగాడికి ఎంపిక చేయలేదు. వికెట్ కీపింగ్ చేయగల డివిలియర్స్ సైతం జట్టులో లేడు. జట్టులోని హెన్రిక్ క్లాసెన్ కేప్‌టౌన్ వన్డేలో ఆరంగేట్రం చేయటం లాంఛనమే.



గెలిచాం కానీ..

- ఫైనల్లో నం.1 ఆట ఆడలేదు
- కోచ్ రాహుల్ ద్రవిడ్

నవతెలంగాణ-ముంబయి

అండర్-19 ప్రపంచకప్ సాధించిన యువ జట్టు సోమవారం స్వదేశానికి చేరుకున్నది. సోమవారం మధ్యాహ్నం కుర్రాళ్లు ఇక్కడికి చేరుకున్నారు. విజయానంతరం భారత్‌లో తొలిసారిగా మీడియాతో మాట్లాడిన కోచ్ రాహుల్ ద్రవిడ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పృథ్వీ షా జట్టు ఫైనల్లో కోరుకున్న ఫలితం సాధించినా, అనుకున్నట్టు నం.1 ఆట ఆడలేదని ద్రవిడ్ అభిప్రాయ పడ్డాడు. 'ప్రపంచకప్ మెడల్స్ సాధించటం పట్ల కుర్రాళ్ల చూస్తే గర్వంగా ఉంది. కానీ ఫైనల్లో నం.1 ఆట ఆడామని నేను అనుకోవటం లేదు. ఏదైతేనేం, అనుకున్న ఫలితం సాధించాం' అని ద్రవిడ్ అన్నాడు. ఇక నిజమైన సంతృప్తి విజయంలో కాదు, అది సాధించే ప్రక్రియలో పొందానని ద్రవిడ్ అన్నాడు. 'నిజమైన సంతృప్తి గత 15-16 మాసాల ప్రపంచకప్ సన్నద్ధతలో ఉంది. మెరుగవుతున్న ఆటగాడిని మెరికల్లా తీర్చిదిద్దే ప్రక్రియలో సక్రమంగా నిర్వర్తించాం. ఈ ప్రక్రియను ఇలాగే కొనసాగించాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే 2012 ప్రపంచకప్ నెగ్గిన జట్టు నుంచి కేవలం ఒకే ఒక్క ఆటగాడు భారత్‌కు ప్రాతినిథ్యం వహించగలిగాడు, అదీ కొన్ని మ్యాచుల్లోనే. దీంతో కుర్రాళ్లు మరింత కఠోరంగా శ్రమించాలి' అని ద్రవిడ్ పేర్కొన్నాడు.

కుర్రాళ్లకు ఘన స్వాగతం : ప్రపంచకప్ సాధించిన కుర్ర జట్టుకు విమానాశ్రయంలో సాదర స్వాగతం లభించింది. ముంబయి క్రికెట్ అసోసియేషన్ (ఎంసీఏ) సీనియర్ అధికారులు పృథ్వీ షా జట్టుకు స్వాగతం పలికారు. ఎంసీఏ అధికారులతో పాటు అభిమానులు సైతం ఎయిర్‌పోర్ట్‌లో కుర్రాళ్లకు ఘన స్వాగతం అందించారు.

కష్టపడ్డారు.. కప్పు తెచ్చారు



- భారత్‌కు మిగతా జట్లకూ అదే వ్యత్యాసం!
- అండర్-19 ప్రపంచకప్‌కు ద్రవిడ్ వ్యూహం

ఆట ఏదైనా, స్థాయి ఏదైనా విజయానికి మార్గం వ్యూహం, సన్నద్ధతే అని యువ భారత్ మరోసారి నిరూపించింది. క్రికెట్ దిగ్గజం రాహుల్ ద్రవిడ్ శిక్షణ సారథ్యంలో కుర్రాళ్లు నాల్గోసారి ప్రపంచకప్‌ను తీసుకొచ్చారు. అండర్-19 క్రికెట్‌లో సరికొత్త చరిత్ర సృష్టించారు.

యువ భారత్ అద్వితీయ ప్రదర్శన, అజేయ రికార్డు, అద్భుత విజయం వెనుక రెండేండ్ల సుదీర్ఘ కృషి దాగి ఉన్నది. 2016 ప్రపంచకప్ ముగిసిన రోజు నుంచి 2018 ప్రపంచకప్ మొదలయ్యే వరకూ కప్పు కొట్టడమే లక్ష్యంగా భారత్ చెమటోడ్చింది. అందుకు ఫలితమే కుర్రాళ్లు యువ విజేతలుగా నిలువటం!

నవతెలంగాణ క్రీడా విభాగం

2016 అండర్-19 ప్రపంచకప్ ఫైనల్స్. ఆఖరి ఓవర్ థ్రిల్లర్‌లో టీమ్ ఇండియాపై వెస్టిండీస్ యువ జట్టు విజయం సాధించింది. అప్పుడప్పుడే యువ భారత్ కోచ్‌గా పగ్గాలు అందుకున్న రాహుల్ ద్రవిడ్ కుర్రాళ్లను ఫైనల్స్ వరకూ తీసుకెళ్లాడు. ఈ సారి మన జట్టులో పృథ్వీ షా, శుభ్‌మన్ గిల్, ఇషాన్ పోరెల్, కమలేశ్ నాగర్‌కోటి వంటి సంచనాలు ఉన్నట్టే 2016లోనూ రిషబ్ పంత్, ఇషాన్ కిషన్, సర్ఫరాజ్ ఖాన్, వాషింగ్టన్ సుందర్‌లు ద్రవిడ్ శిక్షణలో రాటుదేలారు. ఇప్పుడు సీనియర్ క్రికెట్‌లోనూ వీరు అద్భుతంగా రాణిస్తున్నారు. కానీ ప్రశంసలు ఎప్పుడూ విజేతకే దక్కుతాయి. అందుకే గత టోర్నీలో మన కుర్రాళ్లు అద్భుత ప్రదర్శన చేసినా.. ఈ ఘనత మనకు దక్కలేదు. 2016 టీ20 ప్రపంచకప్‌లో కోహ్లిసేన మెరిసినా.. కొసమెరుపులతో కరీబియన్లు చాంపియన్స్‌గా నిలిచినట్టు యువ ప్రపంచకప్‌లోనూ అదే జరిగింది. కానీ యువ ప్రపంచకప్ సాధనలో కోచ్ రాహుల్ ద్రవిడ్ శ్రమ అక్కడితో ఆగిపోలేదు. నిజానికి 2018 ప్రపంచకప్ రోడ్‌మ్యాప్‌కు అక్కడే బీజం పడింది.

సమష్టి సన్నద్ధత : 2018 ప్రపంచకప్‌లో యువ భారత్ ఇతర జట్లకు ఆదర్శంగా నిలిచింది. 2016 నుంచి తాజా ప్రపంచకప్ వరకూ మన కుర్రాళ్లు నాల్గు ప్రధాన సిరీస్‌ల్లో పాల్గొన్నారు. అందులో ఇంగ్లాండ్‌తో ఇంటా, బయటా ద్వైపాక్షిక సిరీస్ సహా రెండు ఆసియా కప్‌లు ఉన్నాయి. వీటితో పాటు అండర్-19 అంతరాష్ట్ర టోర్నీ, చాలెంజర్ ట్రోఫీలు ప్రపంచకప్ జట్టు ఎంపికకు గీటురాయిగా నిలిచాయి. ఈ సమయంలో యువ భారత్‌కు ఏకంగా 27 మంది ప్రాతినిథ్యం వహించారు. దేశవాళీలో మరో 20 మందికి పైగా ఆటగాళ్లను పరీక్షించారు. సీనియర్ క్రికెట్‌లో ప్రపంచకప్ సాధనకు ఎంత ప్రాముఖ్యత ఉంటుందో, ఆ స్థాయి వ్యూహం, సన్నద్ధత యువ జట్టులోనూ చూపించారు. ఇదే ప్రపంచకప్‌లో టీమ్ ఇండియాను ఫేవరేట్‌గా, విజేతగా నిలిపింది. పలు సిరీస్‌ల్లో కుర్రాళ్లంతా కలిసి ఆడటం, తప్పొప్పులు తెలిసి రావటం కలిసొచ్చిన అంశం. అందుకే టోర్నీలో మిగతా జట్లు ఎక్కడో ఓ చోట ఇబ్బంది పడినా, మన కుర్రాళ్లు మాత్రం ఆరంభ మ్యాచ్ నుంచే చాంపియన్స్‌లా ఆడారు, చాంపియన్స్‌గా నిలిచారు. రన్నరప్ ఆస్ట్రేలియానే తీసుకుంటే.. డిసెంబర్‌లో పాకిస్థాన్‌తో సిరీస్ మినహాయిస్తే వారికి మ్యాచ్ ప్రాక్టీస్ లేదు. 2017లో శ్రీలంకతో ఆడిన మరో సిరీస్ కంగారూ కుర్రాళ్లను మరోసారి ఒక చోటికి చేర్చిన సందర్భం. ప్రపంచకప్‌కు ముందు శిక్షణ శిబిరంపైనే ఆసీస్ నమ్మకం ఉంచింది. ప్రపంచకప్‌కు ఆతిథ్యమిచ్చిన న్యూజిలాండ్ పరిస్థితి మరీ దారుణం. ఈ రెండేండ్ల కాలంలో ఆ జట్టు ఒక్కటంటే ఒక్క సిరీస్ ఆడలేదు. ప్రపంచకప్‌కు ముందు ఆడిన వార్మప్ మ్యాచులే కివీస్‌కు మ్యాచ్ ప్రాక్టీస్. జింబాబ్వేపై అలవోకగా నెగ్గిన కివీస్ సత్తాకు సిసలైన పరీక్ష ఎదురుకాలేదు. క్వార్టర్‌ఫైనల్లో తేలిపోయిన ఆ జట్టు టోర్నీ నుంచి నిష్క్రమించక తప్పలేదు.

మాకూ ఓ ద్రవిడ్ కావాలి : ఇక అండర్-19 ప్రపంచకప్‌లో యువ భారత్ విజయంతో మిగతా జట్లలోనూ ఎంతో కొంత చలనం వస్తోంది!. పాకిస్థాన్ సహా ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ జట్లు మాకూ ద్రవిడ్ వంటి కోచ్ కావాలని కోరుకుంటున్నారు. ద్రవిడ్ రాకముందు భారత క్రికెట్‌లోనూ అండర్-19 సహా భారత్-ఎ జట్లకు పెద్ద ప్రాధాన్యం లేదు. అతడు వచ్చిన తర్వాత విప్లవాత్మక మార్పులు వచ్చాయి. కోరుకుంటే వాలిపోయే సీనియర్ క్రికెట్ జట్టు చీఫ్ కోచ్ పదవిని కాదని యువ తరానికి క్రికెట్ ఓనమాలు దిద్దేందుకు నిర్ణయించుకున్న ద్రవిడ్ ఆ దిశగా విజయవంతమయ్యాడు. కుర్రాళ్ల అత్యంత సక్సెస్ రేట్ సాధించాడు. గతంలో ఎన్నడూ లేని విధంగా సీనియర్ క్రికెటర్లకు పోటీగా యువతరం దూసుకొస్తోంది. పొట్టి ఫార్మాట్ యుగంలో అడ్డదిడ్డమైన షాట్లు, ఎడాపెడా బాదటమే క్రికెట్‌గా మారిపోతున్న తరుణంలో భావి తరం క్రికెటర్లకు పూర్తిగా సంప్రదాయ క్రికెటింగ్ బోధించాడు ద్రవిడ్. మైదానంలో కుర్రాళ్ల క్రీడా స్ఫూర్తి, పూర్తి సంప్రదాయ క్రికెటింగ్ షాట్లు క్రికెట్ పండితులను మనసు దొచుకున్నాయి.



(ఫైల్)

ఆగిన ఆసరా..

రెండు నెలలుగా అందని పింఛన్

- లబోదిబోమంటున్న లబ్దిదారులు
- ధనిక రాష్ట్రమంటూనే నిధుల్లో కోతలు


ఆసరా. పింఛన్ ఆగిపోయింది.. రెండు నెలలుగా లబ్దిదారులకు చేతికందలేదు.. ప్రతి నెలా ఇవ్వాల్సిన పింఛన్ డబ్బులు డిసెంబర్ నుంచి పెండింగ్‌లో ఉన్నాయి.. రాష్ట్ర వ్యాప్తంగా చాలా జిల్లాల్లో 'ఆసరా' కోసం లబ్దిదారులు ఎదురు చూస్తున్నారు. బాధితులు గ్రామపంచాయతీల చుట్టూ తిరుగుతున్నారు. 'సర్కార్ నుంచి డబ్బులు రాలేదు. మేం ఏం చెయ్యాలే' అని అధికారులు చేతులెత్తేస్తున్నారు. మిగులు రాష్ట్రంలో పింఛన్ డబ్బులకు కొరత ఎలా ఉంటుందని బాధితులు ప్రశ్నిస్తున్నారు.



నవతెలంగాణ- మహబూబ్‌నగర్

టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పింఛన్ల డబ్బులు రెట్టింపు చేస్తే వృద్ధులు, వికలాంగులు, వితంతువులు ఎంతో ఆనందపడ్డారు. కానీ నెలనెలా సమయానికి అందని పరిస్థితి. ఎప్పుడో నెల చివరకుగానీ లబ్దిదారుల చేతికి పింఛన్ డబ్బులు అందటం లేదు. అది కూడా డిసెంబర్ నుంచి అసలే ఇవ్వలేదు. ఇటీవల మహబూబ్‌నగర్ పర్యటనకు వచ్చిన మంత్రి కేటీఆర్ జడ్పీ మైదానంలో పింఛన్లపై అత్తా కోడళ్ల కథ చెప్పి చప్పట్లు కొట్టించుకున్నారు. అంతవరకు బాగానే ఉన్నా ఒక్క నెల పింఛన్ రాకపోయినా వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు ముద్ద నోట్లోకి వెళ్లే పరిస్థితి ఉండదనేది మరిచిపోతున్నారు. మందులు, జీవనం కష్టంగా మారుతోంది.


పాలమూరు (మహబూబ్‌నగర్) జిల్లాలో 63,874 మంది వృద్ధులు, 7,421 మంది వితంతువులు, 2,291 మంది వికలాంగులు, 3,394 మంది చేనేత కార్మికులు, 1579 మంది కల్లుగీత కార్మికులు, 3019 మంది బీడీ కార్మికులు, 7,073 మంది ఒంటరి మహిళలున్నారు. వీరందరికి ప్రతి నెలా పింఛన్ కింద ప్రభుత్వం రూ.22.29 కోట్లు ఇస్తోంది. ప్రస్తుతం డిసెంబర్, జనవరి పింఛన్ డబ్బులు పెండింగ్‌లో ఉంది. దీంతో పింఛనే ఆధారంగా బతుకుతున్న పేదలు డబ్బులు సకాలంలో అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారు. అధికారులను అడిగితే 'ప్రభుత్వానికి నివేదిక పంపించాం. రెండు, మూడు రోజుల్లో నిధులు విడుదలవుతాయి.. రాగానే పంపిణీ చేస్తాం' అంటున్నారు. కొన్ని రోజుల కిందట జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో కూడా స్థానిక ప్రజాప్రతినిధులు నిధులపై ఆందోళన చేశారు.



"పింఛన్ రావడం లేదు..

రెండు నెలల నుంచి పింఛన్ లేదు సార్. నెలకు రూ.1500 వచ్చేవి. దాంతోనే నా అవసరాలు తీర్చుకునేదాన్ని. పింఛన్ కోసం ఎదురు చూస్తున్నా..


సత్యమ్మ- వికలాంగురాలు



"పింఛన్ వస్తదా సార్..

సార్ పింఛన్లు రాక రెండు మాసాలు అయింది. పింఛన్ అడగడానికి కార్యాలయానికి పోదామంటే చేతకావడం లేదు.

-మైసమ్మ - సంగపల్లె



"ఎందుకిట్ల చేస్తున్నరు..

పింఛన్ గతంలో ప్రతి నెలా ఇచ్చే వారు. ఇప్పుడివ్వడం లేదు. ఎందుకిట్ల చేస్తున్నరు. పెద్దోళ్ల దగ్గర డబ్బులు లేవా? ఎప్పుడిస్తరు..?

-పార్వతమ్మ, లబ్దిదారు

రూ.22.29 కోట్లకు నివేదికలు పంపించాం..

మహబూబ్‌నగర్ జిల్లాలోని 76,090 పింఛన్ లబ్దిదారులకు డిసెంబర్ నెలకుగాను రూ.22.29 కోట్లు అవసరమని ప్రభుత్వానికి నివేదిక పంపించాం. డబ్బులు రాగానే పంపిణీ చేస్తాం.

ఆనంద్- ఆసరా పింఛన్ల ఇన్‌చార్జి, మహబూబ్‌నగర్

మత్స్యకారులను ఎస్టీల్లో చేర్చాలి

- పవన్‌కల్యాణ్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మత్స్యకారులను ఎస్టీల్లో చేర్చాలన్న డిమాండ్ న్యాయబద్ధమైనదేనని జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ తెలిపారు. సోమవారం పవన్‌కల్యాణ్‌ను హైదరాబాద్‌లోని తన నివాసంలో పుదుచ్చేరి మంత్రి మల్లాడి కష్ణారావు, మత్స్యకారుల సంఘం నేతలు కలిశారు. ఈ సందర్భంగా తమ సమస్యలను ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లాలని కోరారు. మత్స్యకారుల పోరాటానికి జనసేన అండగా ఉంటుందని పవన్ హామీ ఇచ్చారు. మత్స్యకారులను ఎస్టీల్లో చేర్చడంపై టీడీపీ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఈనెల 21న శ్రీకాకుళంలో పర్యటించి, మత్స్యకారుల సమస్యలపై బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు ప్రకటించారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.